epaper.ninadamnews.com
తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, జులై 29, 2026 | సంపుటి - 22 | సంచిక 301 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

మైనర్లు, నేరచరిత్ర లేని వారిని

## వదిలేయండి

- నీట్ అరెస్ట్‌లపై సుప్రీం కీలక ఆదేశాలు
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకో వద్దని ఆదేశం



*18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ఆదేశించింది.*

2 వివరాలు



## హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

- ప్రజలు స్వాగతిస్తుంటే.. మీరు విమర్శిస్తున్నారు
- నీట్‌పై కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

# కనబడని సేఫ్టీ జాడ..

# కార్మికుల గుండెల్లో దడ

**నల్ల బంగారం వెలికితీస్తున్న సింగరేణిలో ప్రమాదాలు అందరినీ కలవరపరుస్తున్నాయి. గనుల్లోకి దిగాలంటే కార్మికులు వణికిపోతున్నారు. భూగర్భంలో రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు వెలికితీస్తున్న నల్ల సూర్యులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పని చేస్తున్నారు. నిత్యం సింగరేణిలో ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మానవ తప్పిదమా.., యంత్రాలు నడపడంలో నిర్లక్ష్యమా...? అసలేం జరుగుతున్నది. బొగ్గు బావుల్లో పెరుగుతున్న ప్రమాదాలపై 'నినాదం' స్పెషల్ స్టోరీ.**

## సింగరేణిలో రోజుకో ప్రమాదం | ఎవరిది ఈ నిర్లక్ష్యం

### ఆచరణకు నోచుకోని రక్షణ నిదానాలు | అల్లాడుతున్న కుటుంబాలు | రహస్యంగా సేఫ్టీ మీటింగ్.?

**(స్టేట్ బ్యూరో - నినాదం)**

సింగరేణిలో రోజుకో ప్రమాదం జరుగుతున్నది. గోలేటి నుండి మణుగూరు వరకు అటు భూగర్భ గని కావచ్చు., ఇటు ఓసీ మైన్ కావచ్చు. ఏదో రకమైన ప్రమాద వార్తేతే వినబడుతూనే ఉంది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా.., కార్మికులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమా దాలు మాత్రం తప్పడం లేదు. కాళ్లు, చేతులు కోల్పోతున్నారు. భూగర్భగనులలో మరింత తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ మధ్యకాలంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో కార్మిక కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. మానవ తప్పి దాలు, అధికారులు అవగాహన రాహిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నదన్న ఆరోపణ వినవస్తున్నాయి. సింగరేణి అంతటా ఇలాంటి అభద్రతాభావం నెలకొని ఉంటే.., సేఫ్టీ సమావేశాలు మాత్రం రహస్యంగా నిర్వహిస్తున్నారనే అపవాదు ఉంది. గనుల లోని మ్యాన్ వే ల వద్ద ప్రమాదాల గురించి వివరించే బదులు ప్రార్థనలు,ప్రామిస్‌లు చేయించి పంపుతున్నారన్న విమర్శలు వెలువెత్తున్నాయి. ఏదేమైనా మానవ తప్పిదాలు.., అదే మానవుల జీవితాలను చిన్నభిన్నం చేస్తున్నాయి. ప్రమాదాలను నివారణకు చేపడుతున్న చర్యలు మీడియా ద్వారా కార్మికులను, వారి కుటుంబ సభ్యులను చైతన్యం చేయాల్సిన అధికారులు.., గుట్టుచప్పుడు కాకుండా సమావేశాలు పెట్టి, కొంతమందిని మాత్రమే పిలిచి కౌన్సిలింగ్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది.

### ఇటీవలి ప్రమాదాలివీ..

గోదావరిఖని 11 ఇంక్లెన్ బొగ్గుగనిలో ఫిబ్రవరి 25, 2026న జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు ఐలయ్య గాయపడ్డాడు. బ్లాస్టింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా గని గోడ కూలిపోవడంతో ఆయన చేతి మడిమ, కుడి కాలుకు గాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే ఆయనను గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అనంతరం హైదరాబాద్‌కు తరలించారు.

రామగుండం రీజియన్–11 ఇంక్లెన్ బొగ్గు గనిలో గత సంవత్సరం నవంబర్ 12 న బుధవారం రాత్రి రెండో షిఫ్ట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు సింగరేణి కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గనిలోని ఎల్‌హెచ్‌డీ (LHD) మిషన్ వెనుక విధులు నిర్వహిస్తున్న రంజిత్, శ్రీకాంత్, ప్రవీణ్‌లకు అకస్మాత్తుగా కేబుల్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన సహచర కార్మికులు వెంటనే వారిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే–5 భూగర్భ బొగ్గు గనిలో ఈ నెల 15న ప్రమాదం చోటు చేసుకుంది. బొగ్గు ఉత్పత్తిలో భాగంగా బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్న సమయంలో పేలుడు సంభవించడంతో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఫస్ట్ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న షార్ట్‌ఫైరర్ శ్రీరాముల ప్రదీప్ 13వ లెవెల్‌లో బ్లాస్టింగ్ పనులు చేపడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు అతని చేతిలో ఉన్న పేలుడు పదార్థం పేలింది. ఈ ఘటనలో ప్రదీప్ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి.

పేలుడు శబ్దం వినిపించడంతో అప్రమత్తమైన తోటి కార్మికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ప్రదీప్‌ను బయటకు తీసుకొచ్చారు. అనంతరం భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రత్యేక ఆస్పత్రికి తరలించారు.

ఏఎల్పి గనిలో త్రీ సిమ్ వెన్సర్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు గుంట మహేష్ బోల్టింగ్ పనులు చేస్తుండగా బోల్టర్ హోస్ పైపు హైడ్రాలిక్ ఒత్తిడితో తలకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి సింగరేణి యాజమాన్యం, వెన్సర్ కంపెనీ పూర్తి బాధ్యత వహించి బాధిత కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ప్రధాన కార్యదర్శి పిన్నమనేని వేణుగోపాల్ రావు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు భద్రతా పరికరాలు, తగిన శిక్షణ, వైద్య సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రమాదంపై డీజీఎంఎస్‌తో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రామగుండం రీజియన్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ కోరారు.







పలు మైన్స్‌లో గాయపడిన కార్మికులు

### గనికార్మికుల భద్రతకు తప్పనిసరి సేఫ్టీ నిబంధనలు

* ప్రతి కార్మికుడికి హెల్మెట్, సేఫ్టీ షూస్, గ్లవ్స్, సెల్ఫ్ -రెస్క్యూవర్ వంటి భద్రతా పరికరాలు అందించాలి.
* గనిలో గ్యాస్ స్థాయిలను నిరంతరం పరీక్షిస్తూ, తగిన వెంటిలేషన్ ఉండేలా చూడాలి.
* రూఫ్ సపోర్టులు పూర్తయ్యే వరకు పనులు ప్రారంభించవద్దు.
* విద్యుత్, యంత్రాల భద్రతకు నిరంతర తనిఖీలు నిర్వహించాలి
* పేలుడు పనులు లైసెన్స్ పొందిన బ్లాస్టర్లతోనే చేపట్టాలి.
* మైన్ రెస్క్యూ టీమ్, ఫస్ట్ ఎయిడ్, అంబులెన్స్, ఎమర్జెన్సీ ఎస్కేప్ మార్గాలు సిద్ధంగా ఉండాలి.
* కార్మికులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలి.
* భద్రతా శిక్షణ, టూల్‌బాక్స్ టాక్స్ తప్పనిసరి
* పని గంటలు, విశ్రాంతి సమయాలు చట్టప్రకారం అమలు చేయాలి.
* ప్రమాదాలు, 'నియర్ మిస్' ఘటనలపై విచారణ చేసి సరిదిద్దే చర్యలు తీసుకోవాలి.
* ధూళి, అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
* ప్రతి షిఫ్ట్‌కు ముందు సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, డిజిఎంఎస్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి.
* ప్రతి కార్మికుడికి క్యాప్ ల్యాంప్, గ్యాస్ డిటెక్టర్, సెల్ఫ్ రెస్క్యూవర్ అందుబాటులో ఉండాలి.
* అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కమ్యూనికేషన్, రెఫ్యూజ్ చాంబర్లు, ఎస్కేప్ మ్యాప్స్ సిద్ధంగా ఉండాలి.

*గనికార్మికుల భద్రతకు సంబంధించిన ఈ నిబంధనలను అమలు చేయడం సింగరేణి యాజమాన్యంపై చట్టబద్ధ బాధ్యత. వీటిలో నిర్లక్ష్యం జరిగితే ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది.*

## గనుల్లో ప్రమాదాలు.. హోటళ్లలో సేఫ్టీ పాఠాలు..!

- మీట్ పేరిట లక్షల ఖర్చు..
- గనుల్లో మాత్రం భద్రత కరువు!
- వరుసగా ప్రమాదాలు
- క్షేత్రస్థాయిలో కనిపించని భద్రతా చర్యలు
- కార్మికులకు అవగాహన కార్యక్రమాలెవీ.?



**గోదావరిఖని,జూలై 28(నినాదం):**

"సింగరేణిలో సేఫ్టీ మాటలకే పరిమితమా..? గనుల్లో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే.. లగ్జరీ హోటళ్లలో లక్షల రూపాయలతో సేఫ్టీ సమావేశాలు ఎందుకు..? వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించక పోవడంపై కార్మికులు, స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కార్మికుల మధ్య నిర్వహించాల్సిన సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు అధికారుల సమావేశాలకే పరిమితమవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి."

గనుల్లో పని చేసే కార్మికులకు ప్రత్యక్షంగా సేఫ్టీపై అవగాహన కల్పించాల్సిన అధికారులు, లగ్జరీ హోటళ్లలో సమావేశాలు నిర్వహించి గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సేఫ్టీ సమావేశాలు కార్మికుల మధ్య నిర్వహించి కార్మికులకు అవగాహన కల్పిస్తే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.కార్మికుల హక్కులు, భద్రత కోసం పోరాడే కార్మిక సంఘాలు కూడా ఈ ఖరీదైన సమావేశాలపై ఎందుకు ప్రశ్నించడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమావేశాల కోసం ఖర్చు చేసే నిధులను కార్మికుల భద్రతా పరికరాలు, శిక్షణ కార్యక్రమాలు, ప్రమాద నివారణ చర్యల కోసం వినియోగిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.కార్మికుల ప్రాణాల కంటే ఏ సమావేశం గొప్పది కాదు. సేఫ్టీ అనేది కేవలం వేదికలపై చర్చించే అంశం కాకుండా గనుల్లో అమలు కావాల్సిన బాధ్యత. ప్రమాదాలు జరిగిన తర్వాత సమీక్షలు చేయడం కంటే, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన సేఫ్టీ అని కార్మికులు, స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.




## మావోయిస్టులకు బిగ్ షాక్!

- 16 మంది మావోల లొంగుబాటు..
- భారీగా ఆయుధాల అప్పగింత
- ఆరుగురిపై రూ.39 లక్షల రివార్డు
- 425 కేసుల్లో నిందితులు
- 'ఆపరేషన్ నవజీవన్'తో జనజీవన స్రవంతిలోకి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో జూలై 28 (నినాదం):**

జార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన 16 మంది మావోయిస్టులు ఆయుధాలను వదిలి జార్ఖండ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాంచీలోని జార్ఖండ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పోలీసుల ముందు లొంగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆపరేషన్ నవజీవన్' పునరావాస కార్యక్రమంలో భాగంగా ఈ లొంగుబాటు జరిగింది. లొంగిపోయిన వారిలో ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, ఒక జోనల్ కమిటీ సభ్యుడు, ఇద్దరు సబ్‌జోనల్ కమిటీ సభ్యులు, ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు.

▸▸తరువాయి 2లో..

తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు

## కేటాయించండి

- స్థానిక అవసరాలకు తగినట్లు వీబీ జీ రామ్ జీలోపనులు చేర్చండి..
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



*తెలంగాణకు ప్రధానమంత్రిఆవాస్ యోజన `గ్రామీణ్ కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాతపేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు.*

**న్యూఢిల్లీ,జూలై28(నినాదం):**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్ లో ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి మంగళవారంసమావేశమయ్యారు ఈ సందర్భంగాఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గతపదేళ్లుపేదలు సొంత ఇళ్లు నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సీఎం తెలిపారు. సాధ్యమైనంతత్వరగాతెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు.

▸▸తరువాయి 2లో..

## ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

- అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య
- గ్లోబరీనా అక్రమాలు సీబీఎసఈకీ విస్తరించాయి
- కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

2 వివరాలు

## హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం..

- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో

## రీ సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్ధేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

2 వివరాలు





▸▸వివరాలు 2లో..

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

## కీలక బిల్లులపై ఎన్‌డిఏ ఎంపిలతో మోడీ చర్చ

2

- పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం
- ఎన్‌డిఏ పక్ష ఎంపిలతో భేటీ

**పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని చర్చించారు.**



# మావోయిస్టులకు బిగ్ షాక్!

ఈ ఆరుగురిపై కలిపి ప్రభుత్వం రూ.39 లక్షల రివార్డు ప్రకటించింది. మొత్తం 16 మంది మావోయిస్టులపై కలిపి సుమారు 425 కేసులు నమోదై ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

వారిలో ప్రాంతీయ కమిటీ సభ్యుడు సంతోష్ అలియాస్ బసుదేవ్ దాస్ అత్యంత కీలకంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతను గతంలో మావోయిస్టు అగ్రనేత మిసిర్ బెస్రా బాడీగార్డుగా పనిచేసినట్లు సమాచారం. అతనిపై 128 కేసులు ఉండగా, రూ.15 లక్షల రివార్డు ఉంది. జోనల్ కమిటీ సభ్యుడు చందన్ లోహ్రాపై 78 కేసులు ఉండగా రూ.10 లక్షల రివార్డు ఉంది. సబ్‌జోనల్ కమిటీ సభ్యులు అనిల్ తూరి, సుహ్లాల్ బిరిజియాపై వరుసగా 22, 12 కేసులు ఉండగా, ఒక్కొక్కరిపై రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో ఇద్దరు మావోయిస్టులు సుదేశ్ హోయిన్‌హాగ్, రిసివ్‌లపై కూడా రివార్డులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఇందులో 6 ఇన్సాస్ రైఫిళ్లు, 2 ఏకే-47 రైఫిళ్లు, ఒక హెచ్‌కే-33 రైఫిల్, ఒక యూఎస్ కార్బైన్, ఒక ఎం-16 రైఫిల్ ఉన్నాయి. వీటితో పాటు 38 మ్యాగజైన్లు, 1,562 రౌండ్ల మందుగుండు సామగ్రి కూడా అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

లొంగిపోయిన బృందంలో మహిళా మావోయిస్టులు కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అడవుల్లో సాయుధ పోరాటాన్ని వీడి ప్రభుత్వ పునరావాస విధానానికి ఆకర్షితులై జనజీవన స్రవంతిలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రతా బలగాల నిరంతర కూంబింగ్, ఆపరేషన్లు,మావోయిస్టు సంస్థలో అంతర్గత సమస్యలు, ప్రభుత్వ పునరావాస చర్యలు తదితర కారణాలతో పలువురు మావోయిస్టులు లొంగిపోతున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

జార్ఖండ్‌లో ఈ ఏడాది మావోయిస్టుల లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. మే నెలలో 25 మంది మావోయిస్టులు, ఇద్దరు జేజేపీఎం సభ్యులు లొంగిపోయారు. తాజాగా 16 మంది లొంగుబాటు రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావాన్ని మరింత బలహీనపరిచే పరిణామంగా పోలీసులు భావిస్తున్నారు.

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

**హైదరాబాద్,జూలై28(నినాదం):**

హైడ్రాపై బీజేపీ, బీఆరఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనినీ స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆరఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆరఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎనఎస్‌య ఐ, య త్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్`జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్`జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.



## మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి

**న్యూఢిల్లీ,జూలై28(నినాదం):**



పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన పిటీషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమ ర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

## కీలక బిల్లులుపై ఎన్‌డిఎ ఎంపిలతో మోడీ చర్చ

**న్యూఢిల్లీ,జూలై28(నినాదం):**

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోడీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు`2026' ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయÖష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారాయనీ ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

## తుది దశకు చేరుకుంటున్న సర్

**డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం**

హైదరాబాద్ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ.. ఇంకా ఎన్యుమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనర్హం.వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా.. మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇంటి అడ్రసులు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సర్ పక్రియ ఆగస్టు 3వ తేదీన ముగుస్తుంది. కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యుమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతుంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటువంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబర్ తీసుకొని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్‌లో భాగంగా వీరందరికి ఎన్యుమరేషన్ పత్రాలను జూన్ 25 వ తేదీన ప్రారంభించారు. ఈ క్రమంలో సర్ పక్రియ చివరి దశకు చేరుకుంది.

# తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

ల్‌నినోనేపథ్యంలోవికసిత్భారత్గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులు చేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధులు మెరుగు పర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపుపనులనుచట్టంలోచేర్చాలని సీఎం కోరారు.రైతులు తమ భూముల్లో కూరగాయలపందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయలతోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులనువీబీ జీ రామ్ జీలోచేర్చాలని కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకుకందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతోదెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలోచేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని సీఎం తెలిపారు. వీబీ జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి కోరారు. స్థానిక అవసరాలకుతగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను విబీ జీ రామ్ జీలోచేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ము ఖ్యమంత్రి వెంట ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేంనరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, సెక్టరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

**ప్రశ్నపత్రాల లీకేజీలకు**

**కారకులను కఠినంగా శిక్షించాలి**

ప్రశ్నపత్రాలలీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతు న్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపైమాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నా పత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. య పీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎసఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనులవిషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరి శీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్కొ ట్టేయాలనుకునే సంస్థలవి ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆరఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్ ట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కుఅవసరమవుతయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.



## హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం..

**ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది**

**కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం**

**హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు**

**కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు**

**ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ,జూలై28(నినాదం):**

హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆరఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆరఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వరం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**న్యూఢిల్లీ,జూలై28(నినాదం):**

భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆరఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. య పీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ`సర్వే కీలక ఘట్టం

**హైదరాబాద్,జూలై28(నినాదం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ`సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ`సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సవిక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ`సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ`సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ`సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ`సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సవి క్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ`సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శా స్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ`సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల



యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ`సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చేందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# గ్రామాలకు ఆదాయం వచ్చేలా..
# నూతన ఆలోచనలతో ముందుకుపోవాలి

● జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, జూలై 28 (నినాదం):** గ్రామాలకు స్థిరమైన ఆదాయం వచ్చేలా వినూత్న ఆలోచనలతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం నల్గొండ మండల పరిషత్ కార్యాలయంలో వి బి-జీ రాం-జీ, జలసిరి పనులపై గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.వి బి.జీ రాం-జీ పనుల్లో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, నిర్మించి ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. గ్రామాల్లో నీటి కొరత లేకుండా ఉండే విధంగా జల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ,ప్రతి గ్రామంలో ప్రజలతో చర్చించి గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి వాటిపై



అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు కేవలం పత్తి పంటపైనే ఆధారపడకుండా కందులు, పెసర్లు, సజ్జలు, కొర్రలు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని, చెత్త వల్ల జ్వరాలు సోకే అవకాశం ఉందని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ ని సేకరించి అమ్మితే గ్రామానికి ఆదాయం వస్తుందని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలో ఆలోచించాలని, ప్రజా ప్రతినిధుల సహకారంతోపాటు, మన వంతుగా గ్రామానికి ఏం చేస్తున్నామో ఆలోచించాలని, ఇందులో భాగంగా రైతులను కూడా ప్రోత్సహించాలని, ఫుడ్ ప్రాసెసింగ్ గోదాముల నిర్మాణం కోల్డ్ స్టోరేజ్ వంటి వాటి వల్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని, తద్వారా గ్రామాలు ముందుకు వెళ్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శంకర్ నాయక్ ,ఎంపీడీవో యాకూబ్ నాయక్, సర్పంచులు, కార్యదర్శులు టెక్నికల్ సిబ్బంది హాజరయ్యారు.

KBNBFC
KrazyBee Services Limited

**క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్**
(పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడేది)
రిజిస్టర్డ్ ఆఫీస్: 3వ అంతస్తు, నెం. 128/9, మారుతీ సఫైర్, 35, హాల్ ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్, మురుగేష్‌పాళ్య, బెంగళూరు, కర్ణాటక-560017

**డిమాండ్ నోటీసు**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా కంపెనీల చట్టము, 2013 క్రింద నమోదైన ఒక కంపెనీగా క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్ (పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడే), రిజిస్టర్డ్ కార్యాలయము: 3వ అంతస్తు, నెం. 128/9, మారుతీ సఫైర్, 35, హాల్ ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్, మురుగేష్‌పాళ్య, బెంగళూరు, కర్ణాటక-560017 మరియు భారత్‌లో వివిధ ప్రదేశాలలో బ్రాంచ్‌లు కలిగి ఉండి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("యాక్ట్") క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (ఇకముందు చట్టముగా రెఫర్ చేయబడును) యొక్క సెక్షన్ 2(1)(ఎం)(iv) పరిధిలో ఒక ఆర్థిక సంస్థగా, ఖాతాదారులకు అడ్వాన్స్‌డ్ రుణముల వ్యాపారము నిర్వహిస్తున్నారు మరియు క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్ (పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడే) నుండి పొందిన క్రింద తెలిపిన పట్టికలోని కాలమ్ నెం. 2లో తెలిపిన రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు మరియు SARFAESI యాక్ట్ క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌గా క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్ (పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడే) అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 2తో చదవబడు సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ క్రింద తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి మొత్తం మరియు తదుపరి వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేసినారు. కానీ సదరు నోటీసును వివిధ కారణములతో అందజేయబడలేదు. కావున క్రింద తెలిపిన సదరు రుణగ్రహీతలకు అదనపు సమాచారం ప్రయోజనార్థం ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/ రుణ ఖాతానెం. | సృష్టించబడిన ప్రయోజనానికి సంబంధించి సెక్యూర్డ్ ఆస్తి వివరణ | డిమాండ్ నోటీసు తేదీ, ఎన్‌పి తేదీ మరియు బకాయి మొత్తం |
|---|---|---|---|
| 1<br>2 | గోపాల్‌దాస్ సతీష్ కుమార్ తండ్రి గోపాల్ దాస్ ఎల్లయ్య<br>శ్రీమతి గోపాల్ దాస్ శిరీష భర్త గోపాల్ దాస్ సతీష్ కుమార్<br>పైన తెలిపిన 1 & 2 ల నివాసం: ఇంటి నెం. 1-58/1/1, మల్లికార్జున నగర్, మల్లికార్జున దేవాలయం దగ్గర, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, మేడిపల్లి, కె.వి. రంగారెడ్డి-500098. ఇక్కడ కూడా: ఇంటి నెం. 6-118/1, ప్లాట్ నెం. 13, లక్ష్మీ హిల్స్ కాలనీ, పీర్జాదిగూడ, మేడిపల్లి, మేడ్చల్- మల్కాజ్‌గిరి, మేడ్చల్, తెలంగాణ - 500098.<br>రుణ ఖాతా నెం. BL250403UTOSP, రుణ మొత్తం: రూ. 22,47,000/- | తెలంగాణ రాష్ట్రం, సికింద్రాబాద్, చిలకలగూడ, క్రింది బస్తీ, స్లమ్ ఏరియా వద్ద పిటిఐ నెం. 1291111400తో ఇంటినెం. 11-4-275/79తో గల ఆవరణములో 31.33 చ॥గజాలు లేదా 26.19 చ॥మీ॥ల విస్తీర్ణములో గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు కలిగిన గృహము యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: రామంచదర్ ఇల్లు, దక్షిణం: పొరుగువారి ఇల్లు, తూర్పు: 7'-4" వెడల్పు రోడ్డు, పడమర: విఠల్ ఇల్లు. | 09-07-2026, 08-07-2026 నాటికి రూ. 24,80,147/- ఎన్‌పిఎ తేదీ: 05-07-2026 |

ఈ నోటీసు ద్వారా పైన తెలిపిన రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలను ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీతకు ఎదురుగా తెలిపిన రావలసిన బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ, సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీతను బకాయి మొత్తమును తదుపరి వడ్డీతో తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, కంపెనీగా క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్ (పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడే) వారు పైన తెలిపిన తనఖా ఆస్తులపై సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా సెక్షన్ 13(4) క్రింద సదరు చట్టము మరియు రూల్స్‌లో సూచించిన ఇతర విధానములలో ఈ నోటీసు జారీ కొరకు చర్యలు చేపట్టబడును. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(8)లో వివరముగా తెలిపినట్లు అమ్మకం ద్వారా బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందము లేదా బహిరంగ వేలము కొరకు నోటీసు ప్రచురణ తేదీ కంటే ముందుగా ఏ సమయములోనైనా నేటి వరకు క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్ (పూర్వము క్రేజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడే) ద్వారా ఖర్చుచేయబడిన వ్యయములు, చార్జీలు మరియు ధరలతో మొత్తం బకాయిని తిరిగి చెల్లించి మీ తనఖాను విడిపించు హక్కు కలదని మీ దృష్టికి తేవడమైనది.
సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా ఏవిధముగాను లేదా లీజు, అమ్మకం ద్వారా సెక్యూర్డ్ ఆస్తులతో వ్యవహరించుట మరియు/లేదా బదిలీ చేయుట నుండి SARFAESI యాక్ట్ లోని సెక్షన్ 13(13) నిబంధన క్రింద మిమ్ముల్ని నిషేధించినారని గమనించగలరు.

తేది: 28.07.2026, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, క్రేజీబీ సర్వీసెస్ లిమిటెడ్

## చేనేత ఉత్పత్తుల ఎగుమతులకు అంతర్జాతీయ మార్కెట్లో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తా..
### ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ, జూలై 28 (నినాదం):** చారిత్రాత్మకమైన వరంగల్ జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత, వివిధ రకాల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో గుర్తింపు రావడమే లక్ష్యంగా పనిచేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఉన్నారు. ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మంగళవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ప్రధానంగా వరంగల్ నుంచి చేనేత, వస్త్ర ఉత్పత్తులు, వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి? ఎగుమతిదారులకు అందించిన ఆర్థిక సహాయం, మార్కెటింగ్ మద్దతు, నాణ్యత ధ్రువీకరణ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశానికి చేపట్టిన కార్యక్రమాలు ఏమిటని లోక్‌సభలో ఆమె ప్రశ్న లేవనెత్తారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద వరంగల్ ఉత్పత్తులకు ఎగుమతుల పరంగా విశేష అవకాశాలు ఉన్నాయని లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. డిస్ట్రిక్ట్స్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్స్ కార్యక్రమం కింద వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల్లో టెక్స్‌టైల్స్, వరంగల్ చేనేత తివాచీలు, గార్మెంట్లు, మామిడి, బియ్యం, మొక్కజొన్నలను ఎగుమతి సామర్థ్యం కలిగిన ప్రధాన ఉత్పత్తులుగా గుర్తించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఎగుమతుల వృద్ధికి రూ. 25,060 కోట్లతో కేంద్ర ప్రభుత్వం 'ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్'ను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. వాణిజ్య రుణాలు, వడ్డీ రాయితీలు, క్రెడిట్ గ్యారంటీలు, నాణ్యత ప్రమాణాలు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, అంతర్జాతీయ మార్కెట్ యాక్సెస్ వంటి అంశాల్లో ఎగుమతిదారులకు మద్దతు అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. వరంగల్ రైతులు, చేనేత కార్మికులు, చిన్న పరిశ్రమలకు ప్రపంచ మార్కెట్లలో అవకాశాలు పెరిగేలా పార్లమెంట్ వేదికగా నిరంతరం తన గళం వినిపిస్తానని పేర్కొన్నారు.

## కోదాడలో కలెక్టర్ పర్యటన..
### విద్య, గృహ నిర్మాణాలపై దృష్టి



**కోదాడ,జూలై 28(నినాదం):** జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం కోదాడలో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కాసేపు ముచ్చటించారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకొని, లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం బాలాజీనగర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతి, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సంతోష్ కిరణ్, హౌసింగ్ ఏఈ జేఎస్ఎన్ మూర్తి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
### అడిషనల్ ఎస్పీ రమేష్




**నల్లగొండ ప్రతినిధి జూలై 28(నినాదం):** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నల్లగొండ అడిషనల్ రమేష్ అన్నారు. మంగళ వారం నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండలో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా యువజన అధికారి శ్రీ గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలోని నాలుగు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ యువత అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీ మారం వెంకటరమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ కె. మంజుల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పి. పుష్పలత, డాక్టర్ ఎ. వసంత చైతన్య, సుధా ఆనంద్, డాక్టర్ సాలయ్య, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అమరావతి, ప్రొఫెసర్ జ్యోత్స్న, సీనియర్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్. రాజారామ్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషిచేద్దాం

● బ్లాక్ స్పాట్లలో తక్షణ చర్యలు చేపట్టాలి
● అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
● రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు





**సంగారెడ్డి బ్యూరో, జూలై 28 (నినాదం):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి, బ్లాక్ స్పాట్లలో తక్షణ నివారణ చర్యలు చేపట్టడం ద్వారా జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, వాటికి దారితీస్తున్న కారణాలపై అధికారులతో వివరంగా చర్చించారు. ప్రమాదాల నివారణకు ప్రతి శాఖ చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ ప్రమాదం జరిగినా దాని వెనుక ఉన్న కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడం, గుంతలు, ఎత్తుపల్లాలను వెంటనే మరమ్మతు చేయడం, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయడం, ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హాట్ స్పాట్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు జిల్లాలోని ట్రామా కేర్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్యులు, అత్యవసర పరికరాలు, అంబులెన్స్ సేవల వివరాలను సమీక్షిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత కాదని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడే దిశగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, డీఎస్పీలు, రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHALMALKAJGIRI DISTRICT, AT: MEDIPALLY, O.S.No. 416 OF 2026

Between:-
1. Smt. Juluru Lavanya, C/o. Late J. Narsimha, Aged about: 36 years, Occ: House wife, 2. Juluru Yashaswini, D/o. Late J. Narsimha, Aged about 17 years, Student, 3. Juluru Vaishnavi, D/o. Late J. Narsimha, Aged about 14 years, Student, 4. Juluri Rohit, S/o. Late J. Narsimha, Aged about 14 years, Student, The Plaintiffs 2 to 4 are minors Represented their Natural Mother as a guardian Plaintiff No. 1 Herein. All are R/o. H.No. 6-67, 8 Habsiguda, G.G. Colony, Uppal, Medchal-Malkajgiri District, Hyderabad-500 007.
...Plaintiffs

AND

(1) The Tahasildar, UPPAL Town and Mandal, Medchal-Malkajgiri District.
(2) All Concerned
...Defendants

NOTICE

To,
ALL CONCERNED

Please take notice that the above said suit is filed by the Plaintiffs to declare them as legal heirs of Late J. Lakshamma and the same is posted **on 11-08-2026**. If any person is having any objection or right, they can make appearance, either by a person or pleader, failing which Hon'ble Court shall proceed further as per law.

"BY COURT ORDER"
LINGAMSETTY SUBBA RAO
Advocate
Malkajgiri, Hyderabad-500 047.
Mobile No. 9866979845

# అర్హత కలిగిన ప్రతి ఓటరును డిజిటలైజేషన్ చేయించాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**ఆమనగల్లు, జులై, 28(నినాదం):** అర్హత కలిగిన ప్రతి ఓటరును డిజిటలైజేషన్ చేయించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి కొట్ర గేట్ జంక్షన్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ ముఖ్య నాయకులు,సూపర్ వైజర్, బిఎల్ఎల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని బూతులలో ప్రతి ఓటరును కలిసి బిఎల్ఓలతో డిజిటలైజేషన్ చేపించాలని అర్హులైన ఓటర్లను అందరిని ఓటరు జాబితాలో చేర్పించేవిధంగా బిఎల్ఎ లు నాయకులు పని చేయాలనీ ఎమ్మెల్యే కోరారు. అర్హత కలిగిన వారి ఒక్క ఓటు కూడా మిస్ కావొద్దని అయన అన్నారు. నేటికీ సర్ ఓటరు డిజిటైజేషన్ ప్రగతి నివేదిక ప్రకారం మన నియోజక వర్గంలో 271 బోతులల్లో సగం బూత్‌లు ఇప్పటికే 100% డిజిటైజేషన్ పూర్తి చెయగా, సగం బూత్‌లు 90%కు పైగా నమోదు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విజయానికి శ్రమించిన ప్రతి కాంగ్రెస్ నాయకుడు, బిఎల్ఎ , బూత్ అధ్యక్షుడు, సూపర్వైజర్, గ్రామ, మండల, పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలను ముఖ్య నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. ఇంకా కొన్ని బూత్‌లలో పని పూర్తి కావాల్సి ఉందని,మన లక్ష్యం కేవలం 95% కాదు... ప్రతి బూత్‌లో 100% డిజిటైజేషన్ చేయాలనీ రెండు రోజుల్లో మిగిలిన ప్రతి అర్హత కలిగిన ఓటరిని వ్యక్తిగతంగా సంప్రదించి, ఒక్క ఓటరు కూడా మిగిలిపోకుండా డిజిటైజేషన్ పూర్తి చేయాలని ప్రతి కాంగ్రెస్ నాయకులకు , బిఎల్ఎ, బూత్ అధ్యక్షుడు, కార్యకర్తను కోరారు. కాంగ్రెస్ బిఎల్ఎ లు నాయకులు సమష్టిగా కృషి చేసి కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి బూత్‌ను 100% పూర్తి చేసి, ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టుకుందమన్నారు. బూత్ -- 100% డిజిటైజేషన్... ఇదే మన లక్ష్యం... ఇదే మన విజమన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సర్ తాలూకా కో ఆర్డినేటర్ ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి,కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, సుదర్శన్ రెడ్డి డిసిసి ఉపాధ్యక్షులు భూపతిరెడ్డి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ ముదిరాజ్ కల్వకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు బాల్ రెడ్డి కల్వకుర్తి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పుస్తకాల రాహుల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోతుగంటి శంకర్, శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు సంజీవ్ యాదవ్ వెంకటయ్య గౌడ్ పర్వత్ రెడ్డి,శంకర్ నాయక్ భరత్ గౌడ్ వెంకటేష్ భాస్కర్ సురేష్ రాజేష్ శబ్బు తదితరులు పాల్గొన్నారు.

## మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలి
### కలెక్టర్ అనురాగ్ జయంతి



**ఆలేరు, జూలై 28(నినాదం):** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటలను సాగు చేయడంతో పాటు ప్రభుత్వం అధిక ప్రోత్సాహం అందిస్తున్న ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి రైతులను కోరారు. మంగళవారం కొలనుపాక రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' రెండో ఎపిసోడ్ సందర్భంగా రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు, మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కంది, పెసర, మినుములు, అలసంద వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్న ఆయిల్ పామ్ సాగుకు రైతులు అధిక సంఖ్యలో ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావంతో ఏర్పడుతున్న వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి హేమలత, సహాయ వ్యవసాయ సంచాలకురాలు నిర్మల, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ ఆంజనేయులు, పశుసంవర్ధక శాఖ అధికారి చైతన్య, ఏపీఎం సత్యనారాయణ, కొలనుపాక, రాజానగరం సర్పంచులు యాకమ్మ వెంకటేష్, వెంకటేశ్వరరాజు, ఉపసర్పంచ్ విజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైసయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు రాజు, వీరమల్లయ్య, ఏఈఓలు శివకుమార్, భార్గవి, తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి ఉమేష్, ఆర్ఐ పూర్ణచందర్, జీపీఓ, సీసీ యాదగిరి, రైతులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, జూలై 28 (నినాదం):** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల వైపు వెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. కొంతమంది రైతులు ఇదివరకే పత్తి, కంది వంటి పంటలు సాగు చేయడం జరిగిందని, అలాంటి పంటల్లో అంతర పంటలు వేసుకోవాలని, తద్వారా పంటల సాగు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్వహించిన "రైతు నేస్తం 100 వ ఎపిసోడ్" కార్యక్రమానికి హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కాగా, జిల్లాలోని దోమలపల్లి రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యక్రమానికి హాజరైన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ అల్పపీడనద్రోణి వల్ల సెప్టెంబర్ మాసంలో కూడా వర్షాలు వచ్చే అవకాశం లేదని, అంతేకాక ఎగువ న ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర లలో కూడా వర్షాలు లేనందున, శ్రీశైలం ప్రాజెక్టు నిండే అవకాశం లేదని,అందువల్ల నల్గొండ జిల్లాకు జీవనాధారమైన నాగార్జునసాగర్, ఏఎంఆర్పి ప్రాజెక్టులు కూడా నిండే పరిస్థితి లేదని, వీటన్నిటిని దృష్టిలో రైతులు కందులు, మిల్లులు, ఉన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బోర్లు ,ఎత్తిపోతల పథకాల కింద, అలాగే సాధారణ వ్యవసాయం ఎలా చేయాలో కూడా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తెలియజేస్తారని చెప్పారు. ఎల్ నినో దృష్ట్యా రైతులు ఉద్యాన పంటలు, ఆలోచించాలని ఆయన తెలిపారు .రైతు నేస్తం ద్వారా అందించే వ్యవసాయ యాంత్రీకరణ, పద్ధతులు తెలుసుకుంటూ వ్యవసాయం సాగు చేస్తే త్వరగా వ్యవసాయం ముందుకు వెళుతుందని, రైతులు కష్టాల భారం నుండి తప్పించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా హార్టికల్చర్ డిడి శేఖర్ , హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

# మాతృ, శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 28 (నినాదం):** జిల్లాలో ప్రసవాల సందర్భంగా మాతృ, శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటుచేసుకోకుండా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాతృ, శిశు మరణాల ఆడిట్‌తో పాటు జిల్లాలో గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం--1994 అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇటీవల నమోదైన ప్రతి మాతృ, శిశు మరణ ఘటనను కేసు వారీగా పరిశీలించారు. ఏ ఆసుపత్రిలో ఘటన చోటుచేసుకుంది, మరణానికి దారితీసిన కారణాలు ఏమిటి, వైద్య సేవలలో ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా లోపాలు జరిగాయా అనే అంశాలపై సంబంధిత వైద్య సిబ్బంది నీ ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. వైద్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులను గర్భధారణ ప్రారంభం నుంచే నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని, హై రిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి తక్షణమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని, గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణికి, ప్రతి నవజాత శిశువుకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తల్లి--శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సమర్థవంతమైన కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో PC&PNDT చట్టం--1994ను కట్టుదిట్టంగా అమలు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం

**ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి... ఓటర్ల డిజిటలైజేషన్‌లో వేగం పెంచండి**

**పస్పుల గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ జులై 28( నినాదం)**

నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం పస్పుల గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని డిజిటలైజేషన్ కేంద్రాలను సందర్శించి, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) నిర్వహిస్తున్న డిజిటలైజేషన్ పనులను నిశితంగా పరిశీలించారు. ఓటర్ల వివరాల నమోదు, మ్యాపింగ్, పెండింగ్ దరఖాస్తులు, వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల నమోదుపై అధికారులను ప్రశ్నించి పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,.-.-.. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఓటరు వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులేకుండా రూపొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామంలోని 71వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 1,116 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 938 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసి 84 శాతం ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే 72వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 852 మంది ఓటర్లు ఉండగా, 727 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసి 85 శాతం ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ వివరాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, మిగిలిన ఓటర్ల సమాచారాన్ని వేగంగా నమోదు చేసి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంకా ఎంత మంది ఓటర్ల మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందని, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు నమోదు చేశారా, మరణించిన ఓటర్ల వివరాలను ఎన్నికల నిబంధనల ప్రకారం తొలగించేందుకు అవసరమైన ఆధారాలను సేకరించారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉన్న వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వలస వెళ్లిన ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వారి వివరాలను సేకరించాలని, అవసరమైతే కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం పొందాలని కలెక్టర్ సూచించారు. మరణించిన ఓటర్లకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను సేకరించి ఎన్నికల నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, ఎటువంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా పూర్తి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని, ప్రతి నమోదును మరోసారి పరిశీలించిన అనంతరం మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదని, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువైన ఆగస్టు 3వ తేదీలోగా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ లక్ష్య సాధన దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ జమీల్,ఆర్.ఐ సురేందర్ , పోలింగ్ బూత్ స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.






# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేపట్టాలి

**రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం రైతులకు నష్టం జరగకుండా ముందస్తు అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం**

**వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పంటలనే సాగు చేయాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల బ్యూరో జులై 28 (నినాదం)**

వాతావరణ శాఖ అంచనాలు,నీటి లభ్యత,వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించి పంటల సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి రైతు వేదికలో పాల్గొని,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందించిన శాస్త్రీయ వ్యవసాయ సూచనలను వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు.రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే జిల్లాలో అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులు,శాస్త్రవేత్తల సూచనల మేరకు స్వల్పకాలిక, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఆరుతడి పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ మొత్తం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు.వర్షాలు కురుస్తున్నాయని భావించి నీటిని పూర్తిగా సాగుకు విడుదల చేస్తే, తరువాతి దశలో వర్షాలు తగ్గిన పరిస్థితిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు.వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని,ఇప్పటికే జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.గత అనుభవాల కంటే భిన్నమైన పరిస్థితులు నెలకొన్నందున రైతులు ఆలోచించి పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా వినియోగిస్తున్నామని,సాగునీటి విడుదలపై కూడా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.ఇరిగేషన్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులకు సాధ్యమైనంత మేర సహకారం అందిస్తామని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాలు, నీటి లభ్యత,వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించి పంటల సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం ఆయిల్ పామ్‌తో పాటు పంటల వైవిధ్యీకరణ ద్వారా ఆదర్శంగా నిలిచి ఇతర రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రగతిశీల రైతులను,రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ తహసీల్దార్ హరికృష్ణ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీరణ అధికారులు, చెనుగొనిపల్లి సర్పంచ్ పద్మ, ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన
# బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**కల్వకుర్తి జులై 28 (నినాదం)**



హైదరాబాదులోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యేను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అలవ్వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన
# ఎంపీ అర్వింద్ ధర్మపురి

**నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే ప్రాజెక్టులపై వినతి**

**నిజామాబాద్ ప్రతినిధి, జులై 28 (నినాదం) :**



కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి మంగళవారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నవీపేట్ రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గడంతో పాటు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించబడి ప్రయాణ భద్రత మరింత మెరుగుపడుతుందని ఎంపీ వివరించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల ఇందల్వాయి, జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు.

# నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**సీడీఎంఏ శ్రీదేవిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 28 (నినాదం) :**

నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్ లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందూరు అభివృద్ధి కొరకు నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్ కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.

# జీవో-76కు బ్రేక్ పడిందా?

**పట్టాల కోసం కొత్తగూడెం పేదల నిరీక్షణకు తెర పడేది ఎప్పుడు ?**

**జీవో 76 అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి**

**సంకుబాపన అనుదీప్ డిమాండ్**



**కొత్తగూడెం, జులై 28 (నినాదం)**

బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకుని వచ్చిన జీవో ఎంఎస్ నెం.76 అమలు పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, కొత్తగూడెం నియోజకవర్గంలోని పేదలకు ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీకి సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు సంకుబాపన అనుదిప్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 76 ద్వారా ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీకి మార్గం సుగమం చేసినప్పటికీ, ప్రస్తుతం ఆ జీవో అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాలన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో కొత్తగూడెం పేదలకు ఇండ్ల స్థలాలు, గృహ హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆ తర్వాత కార్పొరేషన్ ఎన్నికల సమయంలో రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా మళ్ళీ హామీను ఇచ్చినప్పటికీ ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని దీన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

జీవో 76 కింద కొత్తగూడెం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎంతమందికి పట్టాలు పంపిణీ చేశారో, ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను విడుదల చేయాలని కోరారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికల సమయంలో "100 రోజుల్లో జీవో 76 కింద పట్టాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారని, అయితే రెండున్నరేళ్లు గడిచినా ఆ హామీ అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి జీవో 76 అమలుకు స్పష్టమైన గడువు ప్రకటించాలని కోరారు. జీవో అమలుకు పరిపాలనా లేదా న్యాయపరమైన అడ్డంకులు ఏమైనా ఉంటే వాటిని ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు నిర్దిష్ట కాలపట్టిక ప్రకటించి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా "జీవో ఎంఎస్ నెం.76 ప్రస్తుతం అమలులో ఉందా? లేక నిలిపివేశారా? అమలులో ఉంటే ఇప్పటివరకు ఎంతమందికి లబ్ధి చేకూరింది? నిలిపివేసి ఉంటే అందుకు గల కారణాలేమిటి? కొత్తగూడెం ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఎప్పుడు అందిస్తారు?" అనే ప్రశ్నలకు ప్రభుత్వం అధికారికంగా సమాధానం ఇవ్వాలని కోరారు. జీవో 76 అమలు స్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, కొత్తగూడెం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నిర్దిష్ట గడువులో ఇండ్ల స్థలాల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రంగరాజు రాజేష్, బత్తుల శ్రీనివాస్, అహ్మద్, గుమ్మడి సాగర్, కలకోటి ఐలయ్య, గాదం రాజేందర్, కాసోజు రామాచారి, న్యాయవాది రాధాకృష్ణ, మున్నా, పిక విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కేంద్ర గ్రంథాలయానికి జేఈఈ

**ఐఐటీ అధ్యయన పుస్తకాల విరాళం**

**ఖమ్మం, జులై 28(నినాదం ):**

ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం కోసం జేఈఈ మెయిన్స్ , జేఈఈ అడ్వాన్స్ ఐఐటీ మరియు ఇతర ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన విలువైన అధ్యయన పుస్తకాలను శ్రీ తుమ్మా గణేష్ సాయి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు . ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా మాట్లాడుతూ ఐఐటీ ఢిల్లీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ( సి యస్ ఇ ) లో ప్రవేశం పొందిన శ్రీ తుమ్మా గణేష్ సాయి , ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ తుమ్మా ధరణి కుమార్ , కుమారుడు అని పేర్కొంటూ తన విజయానికి ఉపయోగపడిన అధ్యయన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందించడం అభినందనీయమని తెలిపారు . జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల సేకరణను నిరంతరం విస్తరిస్తున్నామని , జేఈఈ , ఐఐటీ , ఎన్ఐటీ , ఐఐఐటీ తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని చైర్మన్ పేర్కొన్నారు . ఉన్నత విద్యలో విజయాలు సాధించిన విద్యార్థులు తమకు ఉపయోగపడిన పుస్తకాలను గ్రంథాలయాలకు విరాళంగా అందించి , భావితర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ తుమ్మా ధరణి కుమార్ స్వయంగా పాల్గొని తన కుమారుడు శ్రీ తుమ్మా గణేష్ సాయితో కలిసి అధ్యయన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు అందజేశారు . ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా , శ్రీ తుమ్మా గణేష్ సాయిని అభినందించి ఆయన ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు . అలాగే శ్రీ తుమ్మా ధరణి కుమార్‌ను అభినందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా విలువైన అధ్యయన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందించిన వారి కుటుంబ సేవాభావాన్ని కొనియాడారు . ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు , సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

## సీజ్ చేసిన సామాన్లు
# మళ్లీ అదే ఆక్రమణదారులకా..?

**రెవెన్యూ సడెన్ యాక్షన్ అంతా నాటకమేనా..?**

**ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణం అడ్డుకున్న అధికారులు...**

**స్వాధీనం చేసుకున్న పనిముట్లు తిరిగి అప్పగించారనే ప్రచారం**





**లక్ష్మీదేవిపల్లి జూలై 28 (నినాదం):**

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ చిత్తశుద్ధిపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లో సింగరేణి మెయిన్ హాస్పిటల్ సమీపంలో ప్రభుత్వ భూమిపై అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు హడావుడిగా అడ్డుకుని నిర్మాణ పనులు నిలిపివేశారు. నిర్మాణానికి ఉపయోగిస్తున్న రేకులు, పనిముట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ప్రకటించారు. అయితే ఈ చర్యల వెనుక అసలు కథ వేరే ఉందన్న ప్రచారం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారులు స్వాధీనం చేసుకున్న సామగ్రిని రెండు రోజులకే అదే అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తులకే తిరిగి అప్పగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రచారంలో ఎంత వరకు నిజం ఉందో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

**రెవెన్యూ సడెన్ యాక్షన్ అంతా నాటకమేనా..?**

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, కేవలం హడావుడిగా వెళ్లి సామగ్రిని స్వాధీనం చేసుకుని మళ్లీ అప్పగిస్తే అలాంటి చర్యల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుందనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఇది కేవలం కంటితుడుపు చర్యేనా? లేక ఆక్రమణదారులకు పరోక్ష సహకారమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కొత్తగూడెం పరిధిలో ప్రభుత్వ భూములపై ఆక్రమణలు పెరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెబుతోంది. కానీ ఆక్రమణలను శాశ్వతంగా అడ్డుకోవాల్సిన అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తే ప్రభుత్వ భూములు ఎలా రక్షణ పొందుతాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**సామాన్లు తిరిగి ఇచ్చారనే ప్రచారంపై స్పష్టత ఇవ్వాలి**

స్వాధీనం చేసుకున్న రేకులు, పనిముట్లు, ఇతర సామగ్రి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? వాటిని నిబంధనల ప్రకారం స్వాధీనంలోనే ఉంచారా? లేక తిరిగి అప్పగించారా? అనే విషయాలపై రెవెన్యూ శాఖ అధికారికంగా వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిజంగానే తిరిగి అప్పగించి ఉంటే ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్డీవో అధ్యక్షతన ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష సమావేశం: ఆర్డీఓ జనార్దన్ రెడ్డి

**కల్వకుర్తి జులై 28 (నినాదం)**

కల్వకుర్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆర్డీఓ జనార్దన్ రెడ్డి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్హుడి పేరు



ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, తప్పులు లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ ఇబ్రహీం, అధి కారి రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డొక్క లింగమయ్య,తది తరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**పాఠశాలల్లో 100 శాతం హాజరు సాధించేలా చర్యలు చేపట్టాలి**

**ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల బ్యూరో జూలై 28( నినాదం )**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల ఆవరణ, తరగతి గదులు,పారిశుద్ధ్య పనులు,మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించారు. అలాగే విద్యార్థులతో మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, ఇతర మౌలిక సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యాబోధన అందించి అభ్యాసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలన్నారు.ప్రతి విద్యార్థి ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నిర్ణీత సమయానికి నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే యూనిఫాంలు,ఇతర సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని ఆదేశించారు.వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు,మరుగుదొడ్లు,తాగు నీటి ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత,చదువుపై ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులతో నిరంతరం సమన్వయం కొనసాగించి విద్యార్థుల హాజరు,విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా వంద శాతం డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఎస్ఐఆర్ పనులను పరిశీలించి, బీఎల్ఓలు,



సంబంధిత అధికారులతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటైజేషన్, ఇంటింటి సర్వే పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ప్రతి అర్హుడి వివరాలను నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి లోపాలు, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్ఓలు పూర్తి బాధ్యతతో వారి నుంచి సరైన సమాచారాన్ని సేకరించి ఫారాలను పూర్తిగా నింపి వెంటనే డిజిటైజేషన్ కోసం అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సానుకూల సహకారం అందించాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు,బిఎల్ఓలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే లోకేశ్ సవాల్ స్వీకరించండి

## వైసిపికి మంత్రి మండిపల్లి సవాల్

**విశాఖపట్నం,జులై 28(నినాదం ):** వైసీపీ నేతలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. డీఎస్సీపై మంత్రి నారా లోకేశ్ విసిరిన సవాల్‌ను వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే స్వీకరించాలన్నారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని జగన్, వైసీపీకి ఛాలెంజ్ చేశారు. జగన్, ఆయన టీంకు బుద్ధి లేదని.. ప్రజలకు మంచి చేస్తున్నా కూడా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేశ్ విద్యాశాఖ మంత్రి అయ్యాకే.. విద్యా రంగంలో సంచలనాత్మక నిర్ణయాలు తీసుకున్నారని.. పెనుమార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. లోకేశ్‌ను వైసీపీ నేతలు రాజీనామా చేయమనడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకు పైగా టీచర్ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన కుటుంబాలను వైసీపీ నేతలు అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు మెండుగా వస్తున్నాయన్నారు. ఏపీ బ్రాండ్‌ను చెడగొట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదే పద్ధతిలో వైసీపీ వెళ్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి 11 సీట్లు కూడా రావని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# 1న విమానాశ్రయం జాతికి అంకితం: పార్థసారథి

**విజయనగరం,జులై 28(నినాదం):** రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి భోగాపురంలో విడియాతో మాట్లాడుతూ.. ఆగస్ట్ 1 న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ తెలుగు జాతి ఎప్పటికీ మరిచిపోదని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక అభివృద్ధికి ఒక అధ్యాయంగా ఈ విమానాశ్రయం మారనుందని తెలిపారు. ఇదే విషయాన్ని ఇన్వెస్టర్స్ పెద్దఎత్తున చర్చించుకుంటున్నారని స్పష్టం చేసారు. ఏపీ అంటే పారిపోయిన పెట్టుబడిదారులు ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం వెంట పడుతున్నారని, లోకేష్ తన వ్యక్తిగత పరిచయాలతో పెద్దఎత్తున సాఫ్ట్వేర్ కంపెనీలను తీసుకువస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో భోగాపురం ఎయిర్ పోర్ట్ మరింత విస్తరించనుందని చెప్పుకొచ్చారు. ఏపికి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉత్తరాంధ్ర మారుతుందని, ఉత్తరాంధ్రలో 189 కొత్త ప్రాజెక్టులను ఆరు వేల కోట్లకు పై పెట్టుబడులతో ప్రారంభించారని గుర్తు చేసారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని భరోసా ఇచ్చారు.

## అంగన్వాడీల విషయంలో

# తప్పుడు ప్రచారం

## వైసీపీపై మంత్రి నారా లోకేశ్ విమర్శలు



**అమరావతి,జులై 28(నినాదం ):** అంగన్వాడీల విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోం దని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసీపీ నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డా రు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా స్పందిస్తూ.. 'ఫేక్ వర్సెస్ రియల' పేరుతో వీడియోను విడుదల చేశారు. అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో వారు నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ.. అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విష ప్రచారం చేస్తోంది' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.


# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

**ఏపీ ప్రభుత్వంతో ఎంఓయ కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా**

**దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం**

**సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ**

**అమరావతి, జులై 28(నినాదం ):** కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆరఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి



క్వాంటం వ్యాలీ- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించను న్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ , నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది.

**వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు..**

ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని... ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యారోగ్య రంగంలో మరింత వేగంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరగాల్సి ఉందని తెలిపారు. కేన్సర్ తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పెదపెంకి అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై పవన్ కళ్యాణ్ అసంతృప్తి

**క్వాలిటీ కంట్రోల్ అధికారుల నివేదిక ఆధారంగా కాంట్రాక్టర్‌పై చర్యలకు ఆదేశం**

**సంబంధిత రోడ్ల బిల్లులు నిలిపివేయాలని ఆదేశించిన ఉప ముఖ్యమంత్రివర్యులు**

**అమరావతి, జులై 28(నినాదం):** పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెదపెంకి గ్రామంలో నిర్మించిన కొన్ని




సిమెంట్ రోడ్లలో పగుళ్లు ఏర్పడిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని పెదపెంకి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో ఐదు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టా లని పవన్ ఆదేశించారు. ఈ సందర్భంగా పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌తో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపెంకిలో చేపట్టిన రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక శాసనసభ్యులు కూడా తీసుకోవాలని సూచించారు.


# వెయిట్ లిఫ్టర్ అజయ్‌కు అభినందనల వెల్లువ

## సిఎం, డిప్యూటి సిఎం తదితరుల ప్రశంసలు

**అమరావతి, జులై 28(నినాదం ):** గ్లాస్గోలో జరుగు తోన్న కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ అజయ్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. సోషల్ విడియా ఎక్స్‌లో చంద్రబాబు స్పందిస్తూ.. గ్లాస్గో 2026 కామ న్వెల్త్ క్రీడల్లో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వల్లూరి అజయ్ బాబు రజత పతకం సాధించారని, తన తండ్రి శ్రీనివాసరావు అడుగుజాడ ల్లో



నడుస్తూ క్రీడా వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించారని కొనియాడారు. అజయ్ సాధించిన ఈ విజయం ఏపీతో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ క్రీడా కీర్తిని మరింత ఉన్నత శిఖరాలకు



తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. మన్వెల్త్ గేమ్స్-2026లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా స్పందిస్తూ.. గ్లాస్గోలో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించి.. భారతదేశానికి మరో కీర్తిని తెచ్చిపెట్టిన అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. స్వర్ణ పతకాన్ని అత్యంత స్వల్ప తేడాతో చేజార్చుకున్నా ఛాంపియన్‌గా నిలిచావని కొనియాడారు. అజయ్ బాబు ప్రదర్శన.. ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. అజయ్ బాబు.. విజయనగరం జిల్లా కీర్తిని ప్రపంచ వేదికపై చాటారని.. తండ్రి వల్లూరి శ్రీనివాసరావు క్రీడా వారసత్వాన్ని కొనసాగించారని పవన్ అన్నారు. భారతదేశానికి మరో గర్వకారణమైన విజయాన్ని అజయ్ అందించారన్నారు. తమ బిడ్డలలో ఒకరు భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందని అన్నారు. ప్రపంచ వేదికపై మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ.. అజయ్ బాబుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబును మంత్రి నారా లోకేశ్ అభినందిస్తూ.. తండ్రికి తగ్గ తనయుడు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గ్లాస్గో 2026లో పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు. తన తండ్రి వల్లూరి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ, అజయ్ యావత్ దేశానికి గర్వకారణంగా నిలిచాడు. అతను మరిన్ని ఉన్నత శిఖరాలను

**శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARPL)**
(వివిధ SARC ట్రస్టులకు ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తూ)
SHRIRAM Asset Reconstruction
సమోదిత కార్యాలయం: శ్రీరామ్ హౌస్, నెం. 4, బుర్కిట్ రోడ్, టి. నగర్, చెన్నై-600017,
కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నెం. ఎఫ్ఎఫ్-ఎ-05, ఎ వింగ్, మొదటి అంతస్తు, ఆర్ట్ గిల్డ్ హౌస్, ఫోనిక్స్ మార్కెట్ సిటీ, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (పశ్చిమ), ముంబై-400070.
వెబ్‌సైట్: www.shriramarc.com, ఫోన్ నెం. 1800 120 2389, customercare@shriramarc.com.

**స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (1) క్రింద**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "SARFAESI చట్టము"గా రిఫర్ చేయబడును) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని రూల్ 8(1)కు అనుగుణంగా మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదవబడు చట్టములోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ సెక్యూర్డ్ క్రెడిటార్/అసలు రుణదాత/అసైనర్ మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి అన్ని హక్కులు టైటిల్ మరియు వాటిపై ప్రయోజనంతో పాటు దానికి కల్పించిన అంతర్లీన సెక్యూరిటీ ప్రయోజనంతో కలిపి ఇందులో దిగువ తెలిపిన రుణగ్రహీతలతో సహా వివిధ రుణగ్రహీతలకు సంబంధించి SARFAESI చట్టములోని సెక్షన్ (5) క్రింద వివిధ SARC ట్రస్ట్-13 (ఇకమీదట "SARPL"గా రిఫర్ చేయబడును) యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తూ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు ఆర్థిక ఆస్తులను పొంది దిగువ షెడ్యూల్‌లో తెలిపిన చెల్లింపు మరియు / లేదా వసూలు తేది వరకు అయిన వర్తించు విధముగా తదుపరి వడ్డీ అనుషంగిక వ్యయాలు ఛార్జీలు మొదలగు వాటితో కలిపి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా సదరు నోటీసులో తెలిపిన విధముగా వర్తించే/ఒప్పంద రేట్ల ప్రకారం దాని వడ్డీతో కలిపి వారి సంబంధిత పేర్లకు ఎదురుగా తెలిపిన దిగువ మొత్తాలను తిరిగి చెల్లించాల్సిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలను కోరుతూ SARFAESI చట్టములోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ నోటీసులు జారీ చేసినారు.
SARPL అసలు రుణదాతగా ఆర్థిక ఆస్తులకు సంబంధించి సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అన్ని హక్కులు టైటిల్ ప్రయోజనాలకు సంబంధించి రంగప్రవేశం చేసారు. దిగువ తెలిపిన రుణగ్రహీతలు బకాయి ఉన్న మొత్తాలు చెల్లించుటలో విఫలమైనందున రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా SARFAESI చట్టములోని రూల్ 8తో చదువబడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ దిగువ తెలిపిన ఆస్తులు/సెక్యూర్డ్ ఆస్తులను శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి స్వాధీనము చేసుకున్నారు.
కావున ప్రత్యేకించి రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా దిగువ తెలిపిన ఆస్తి/లు/సెక్యూర్డ్ ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరపకూడదనియు ఆస్తి/లు/సెక్యూర్డ్ ఆస్తులతో ఒకవేళ జరిపినట్లయితే రుణ/అసైన్‌మెంట్ ఒప్పందం ప్రకారం మొత్తం మరియు దానిపై వడ్డీ కోసం శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కు లోబడి ఉండును. మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యతకు సంబంధించి SARFAESI చట్టము సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/ తనఖాదారులను కోరడమైనది.

| క్ర. సం. | రుణ ఖాతా నెం. & ట్రస్ట్ వివరాలు/ఒరిజినల్ లెండర్ | రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు | డిమాండ్ నోటీసు తేది & మొత్తం | సెక్యూర్డ్ ఆస్తి వివరణ (స్థిరాస్తి) |
|---|---|---|---|---|
| 1 | రుణ ఖాతా నెం: MHL01320040177 ట్రస్ట్ వివరాలు: SARCT Trust 13 అసలు రుణదాత: మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ | అదెమ్మ & మేకల సోమశేఖర్ | 13-09-2025 & రూ. 533898/- | శ్రీ సత్య సాయి జిల్లా మరియు బుక్కపట్నం మం॥, కొత్తకోట గ్రా॥ & పంచాయతీ పరిధిలోని బుక్కపట్నం ఎస్ఆర్‌డి & పుట్టపర్తి ఆర్‌డి వద్ద సర్వే నెం. 2, డి.నెం. 2-155తో గృహము యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: మేకల గంగమ్మ ఇల్లు, పడమర: శేషం గంగులమ్మ ఖాళీ స్థలం, దక్షిణం: మేకల రాముడు ఇల్లు, ఉత్తరం: దారి. |

ప్రదేశం: అనంతపురం
తేది: 29-07-2026
సం/- అధీకృత అధికారి, మెస్సర్ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARC ట్రస్ట్-13 యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తూ)

**శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARPL)**
(వివిధ SARC ట్రస్టులకు ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తూ)
SHRIRAM Asset Reconstruction
సమోదిత కార్యాలయం: శ్రీరామ్ హౌస్, నెం. 4, బుర్కిట్ రోడ్, టి. నగర్, చెన్నై-600017,
కార్పొరేట్ కార్యాలయం: యూనిట్ నెం. ఎఫ్ఎఫ్-ఎ-05, ఎ వింగ్, మొదటి అంతస్తు, ఆర్ట్ గిల్డ్ హౌస్, ఫోనిక్స్ మార్కెట్ సిటీ, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (పశ్చిమ), ముంబై-400070.
వెబ్‌సైట్: www.shriramarc.com, ఫోన్ నెం. 1800 120 2389, customercare@shriramarc.com.

**స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (1) క్రింద**

| క్ర. సం. | రుణ ఖాతా నెం. & ట్రస్ట్ వివరాలు/ఒరిజినల్ లెండర్ | రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు | డిమాండ్ నోటీసు తేది & మొత్తం | సెక్యూర్డ్ ఆస్తి వివరణ (స్థిరాస్తి) |
|---|---|---|---|---|
| 1 | రుణ ఖాతా నెం: MHL00360039675 ట్రస్ట్ వివరాలు: SARCT Trust 13 అసలు రుణదాత: మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ | మద్దెల బీబీ, సీలం శ్రీనివాసులు & మద్దెల సుకుమారి | 13-08-2025 & రూ. 638695/- | ఆంధ్రప్రదేశ్-516163, వైఎస్ఆర్ కడప రిజిస్ట్రేషన్ జిల్లా, కడప ఉప జిల్లా, కడప, ఖాజీపేట మం॥, చెన్నముకపల్లె గ్రా॥, చెన్నముకపల్లె గ్రామపంచాయతీ, సర్వే నెం. 174-2 పైకి లో 198.45 చ॥గ॥ల విస్తీర్ణముతో డి.నెం. 2-66 కలిగిన ఆర్‌సిసి గృహము యావదాస్తి, సరిహద్దులు: తూర్పు: అకుల పెద్ద రాముడు స్థలం మరియు ఇల్లు, పడమర: దారి, ఉత్తరం: పుత్తూరు ఉదయ్ కుమార్ ఇల్లు, దక్షిణం: దారి. |

ప్రదేశం: కడప
తేది: 29-07-2026
సం/- అధీకృత అధికారి, మెస్సర్ శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARC ట్రస్ట్-13 యొక్క ట్రస్టీగా తన హోదాలో వ్యవహరిస్తూ)

**ఎన్‌కోర్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్**
earc
కార్పొరేట్ ఆఫీస్: 5వ అంతస్తు, ప్లాట్ నెం. 137, సెక్టార్ 44, గురుగ్రామ్-122002, హర్యానా, ఇండియా.
ఫోన్: +91.124.4527200/ఫ్యాక్స్: +91.124.4527231, ఇ-మెయిల్: contact@encorearc.com
రిజిస్టర్డ్ ఆఫీస్: కాడీ కమర్షియల్ టవర్, రీగస్ బిజినెస్ సెంటర్, 5వ అంతస్తు, ఏరోసిటీ (డైల్), న్యూఢిల్లీ, ఇండియా- 110037. CIN No : U74140DL2013PTC259641

**స్వాధీనతా ప్రకటన**

16-04-2024 నాటి అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ద్వారా 29.09.2025 నుండి అమలులోకి వచ్చేలా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ('SARFAESI యాక్ట్, 2002')లోని సెక్షన్ 5 క్రింద బ్యాంకు ద్వారా సంక్రమించిన మజ్జి వెంకట రమణ యొక్క ఆర్థిక ఆస్తుల విషయంలో ఇఎఆర్- బ్యాంక్-025-ట్రస్ట్ యొక్క ట్రస్టీ స్థానంలో వ్యవహరిస్తూ ఎన్‌కోర్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ("ఎన్‌కోర్ ఎఆర్‌సి") వారు మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ('బ్యాంక్') నుండి అన్ని హక్కులు, టైటిల్ మరియు ప్రయోజనములు పొందినారు.
కావున ఇందుమూలముగా తెలియజేయడమేమనగా SARFAESI యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 '(రూల్స్')' లోని రూల్ 3తో చదవబడుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ SARFAESI యాక్ట్, 2002 క్రింద ఎన్‌కోర్ ఎఆర్‌సి యొక్క అధీకృత అధికారి అయిన క్రింది సంతకముదారు తేది: 09-02-2023 తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారం మజ్జి వెంకట రమణ మరియు మజ్జి విజయ లక్ష్మి ల నుండి నోటీసులో తెలిపిన బకాయి మొత్తం అనగా తేది: 10-02-2023 నాటికి రూ. 1404435 /- (రూపాయలు పధ్నాలుగు లక్షల నాలుగు వేల నాలుగు వందల ముప్పై ఐదు మాత్రమే) + 18-10-2024 నుండి ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు మరియు వ్యయములతో నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.
కాని సదరు రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడు SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ క్రింద ఆస్తిని అధీకృత అధికారి 22 జులై, 2026న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమునకు ఎన్‌కోర్ ఎఆర్‌సి యొక్క అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకముదారు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపకూడదనీయు ఒక వేళ జరిపినట్లయితే ఎన్‌కోర్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ వారికి చెందవలసిన బకాయి మొత్తం 22-07-2026 నాటికి రూ. 2060929.74/- (రూపాయలు ఇరవై లక్షల అరు వేల తొమ్మిది వందల ఇరవై తొమ్మిది మరియు పైసలు డెబ్బై నాలుగు మాత్రమే) మరియు తేది: 23-07-2026 నుండి ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు మరియు వ్యయముల క్రింద వర్తించను.
మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యతకు సంబంధించి SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా కోరడమైనది.

**షెడ్యూల్**

షెడ్యూల్: స్థిరాస్తి వివరణ: శ్రీకాకుళం జిల్లా, పిన్: 532408, రణస్థలం మం॥, గరికిపాలెం గ్రా॥, జగన్నాథపురం పంచాయతీ వద్ద సర్వే నెం. 26-17ఎ, సర్వే నెం. 26-18ఎ భాగము లలో ఉన్న ఖాళీ స్థలం విస్తీర్ణము యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: చెక్క బంగ్రరాజు స్థలం, పడమర: అల్లూరి సుందర రాజు ఖాళీ స్థలం, ఉత్తరం: 14 అడుగుల రోడ్డు మరియు సూరు జగదీష్ కుమార్ ఖాళీ స్థలం, దక్షిణం: ఎం.ఎస్. నాయుడు మరియు ఇతరుల ఖాళీ స్థలం.

తేది: 22-07-2026
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
ఎన్‌కోర్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్

# పెద్దపల్లి రైతన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యం

**మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి.. కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ భారీ ధర్నా**



**పెద్దపల్లి రూరల్ జూలై 27(నినాదం):** పెద్దపల్లి రైతాం గం ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదురుగా భారీ ధర్నా ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తక్షణమే స్పందించి సాగునీరు, విద్యుత్, ఎరువుల కొరత వంటి ప్రతిష్టంభనలను తొలగించాలని డిమాండ్ చేశారు. అసలే తీవ్ర వర్షం పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న రైతులను మార్కెట్లో వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీకి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సెంటర్లలో రూ. 266.50 కి లభించాల్సిన యూరియా బస్తాను ప్రైవేట్ ఫెర్టిలైజర్ దుకాణాల్లో చట్టవిరుద్ధంగా రూ. 320కి, డిఏపి బస్తాలను రూ. 1350కి బదులు రూ. 1750కి, ఎన్.పి.కే బస్తాలను రూ. 1400 కి బదులు రూ. 2300 వరకు అధికధరలకు విక్రయిస్తూ వ్యాపారులు రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపిం చారు. అంతే కాకుండా యూరియా కోసం వచ్చే రైతుల కు బలవంతంగా ఇతర ఎరువులు అంటగడుతు న్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రైవేట్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన కన్నెపల్లి మోటార్లను వెంటనే ప్రారంభించి రైతన్నలకు సాగునీరును అందిం చాలని కోరారు. అప్రకటిత విద్యుత్ కోతల వల్ల వ్యవసాయ మోటర్లు కాలిపోయి రైతులు ఆర్థిక నష్టాలకు గురవుతు న్నారని పేర్కొన్నారు. 2014 ముందు రైతులు రాష్ట్రంలో ఎదుర్కొన్న విద్యుత్ సమస్యలను ప్రస్తుత అదే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి గుర్తు చేస్తుందన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అందించినట్లు నిరంతర 24గం టల ఉచిత విద్యుత్ ను నాణ్యమైన త్రీ ఫేస్ ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి నియో జకవర్గంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మొక్క జొన్న పంట విక్రయించిన రైతులకు బర్దాన్ సంచుల డబ్బును వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కోరారు. అనంతరం రైతుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగళ తిరుపతిరెడ్డి, నూనేటి సంపత్, మోహన్ రావు, సందీప్ రావు, మార్కు లక్ష్మణ్, మల్లేశం బైరం రామ్ రెడ్డి, రాజమల్లు, గణపతి, కొయ్యడ సతీష్ గౌడ్ సలేంద్ర రాములు, విన్నం రవీందర్ పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, స్వామి విక్రమ్ గౌడ్, బాబురావు, శ్రీనివాస్, పడాల సతీష్ గౌడ్, తీగల సదయ్య, చీకటి పోచా లు, ముత్యాల రాజయ్య, రామ్ రెడ్డి, సర్పంచులు గొడుగుల సతీష్, చొప్పరి ఆంజనే యులు, కొండల్ రాజు, తాడిచెట్టు చామంతి శ్రీకాంత్, శ్వేతా వెంక టేష్, ఆకుల శ్రీనివాస్ గౌడ్, మెడగొని శ్రీకాంత్, దేవ య్య, నూనెటి కుమార్ యాదవ్, లవన్, బాలసాని శ్రీనివాస్ గౌడ్ తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల సంరక్షణకు విస్తృతంగా ఫామ్ పాండ్ లు నిర్మించుకోవాలి

**కొట్ల (కె) గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ ప్రతినిధి, జూలై 28 (నినాదం):** మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ గ్రామీణ మండలం కొట్ల (కె) గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లబ్ధిదారు మూడ నాగవ్వ కు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. లబ్ధిదారురాలు, అధికారులతో కలిసి రిబ్బను కత్తిరించి గృహ ప్రవేశం చేశారు. అనంతరం ఇంటిని మొత్తాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు అందిన డబ్బుల వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇంటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. హట్ సర్వేను పరిశీలించారు. అంతకుముందు గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించారు. ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కల్పించిన వసతులను వాకబు చేశారు. విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక



సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ, గ్రామస్తుల వినతి మేరకు కేటాయింపు పూర్తి అవగా మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అర్హులకు అందిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. సొంత స్థలాలు ఉన్న ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. గ్రామంలో



నిర్మిస్తున్న ఫామ్ పాండ్ ను పరిశీలించారు. రైతులంతా ఫామ్ పాండ్ ల నిర్మాణాలకు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఎంపీడీఓ సుధాకర్, సర్పంచ్ దుమాల రాజు, ఉప సర్పంచ్ రఘు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సౌకర్యాలు.. గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యం

**వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరుపై తనిఖీలు**

**ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం**

**ఖమ్మం, జులై 28(నినాదం):** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కె ట్ కమిటీలను పారదర్శ కంగా తీర్చిదిద్ది రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కె టింగ్శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివా రం ఒక ప్రకటనలో పేర్కొంటూ అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరును సమగ్రంగా పరిశీలించేం దుకు ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు వ్యవసాయ మార్కె టింగ్ సంచాలకుల నియంత్రణలో పనిచేస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఈ వారం తనిఖీ చేయనున్నాయి. ప్రత్యేక బృందాలు మార్కెట్ కమిటీల పరిపాలన, రైతులకు అందుతున్న సేవలు, మార్కెట్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించనున్నాయి. రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో ఎదుర్కొంటున్న ఆచరణాత్మక సమస్యలతో పాటు కనీస మద్దతు ధర కొనుగోలు కార్యకలాపాల్లో ఉన్న లోపాలు, ఇబ్బందులు గుర్తిస్తాయి. రైతులు తమ పంటలను నష్టపోయే ధరలకు విక్రయించాల్సిన పరిస్థితులకు దారితీ స్తున్న కారణాలు, మార్కెట్ సెస్ ఎగవేతను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపడుతాయి. మార్కెట్ కమిటీల పరిపాలన, మౌలిక సదుపాయాలు, సేవలపై సూచనలు మార్కెట్‌లో గిట్టుబాటు ధర పొందుతున్నారా వేలం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా అనే అంశాలను పరిశీలన జరుగుతుంది. కనీస మద్దతు ధర కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, చెల్లింపులు సకాలంలో జరుగుతు న్నాయా అనే అంశాలను తెలుసుకుంటాయి. మార్కెట్ కమిటీలలో అమల వుతున్న డిజిటల్ సేవలు,



రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ మార్గ దర్శకాల అమలును జరగడం చూస్తాయి. ప్రత్యేక బృందాలు ప్రతి వారం తమ తనిఖీ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించను న్నాయి. నివేదికల్లో గుర్తించిన లోపాలు, తక్షణ చర్యలు అవసరమైన అంశాలు, విధానపరమైన సంస్కర ణలు, మార్కెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన సూచనలు పొందుపరుస్తాయి. రైతుకు గిట్టుబాటు ధర, మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు, పారదర్శకమైన లావాదేవీలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యం అని బాధ్యతాయుత పరిపాలన ఈ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## పురుగుల మందు

# తాగి వ్యక్తి మృతి

**భీమదేవరపల్లి జూలై 28 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి గ్రామానికి చెందిన చెల్పూరి రాజయ్య (53) అనే కూలీ కార్మికుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జూలై 26న పనికి వెళ్లిన రాజయ్య మద్యం సేవించి రాత్రి ఇంటికి వచ్చాడు. ఈ సందర్భంగా భార్య భాగ్యలక్ష్మి మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆవేశానికి గురైన రాజయ్య ఇంటి నుంచి వెళ్లి వంగర రోడ్డులోని మార్పాటి వీరారెడ్డి పొలం వద్ద గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని ముల్కనూరు సుధాకర్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 27 సాయంత్రం రాజయ్య మృతి చెందాడు. మృతుడి భార్య చెల్పూరి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# హైడ్రా దూకుడుకు హైకోర్టు కళ్లెం

సంపాదకీయం

హైడ్రా తీరు, కమిషనర్ రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. దీనిపై సవి క్షించుకోవడం, ఆత్మవిమర్శ చేయడం ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యంగా భావించాలి. పెద్దలను వదిలి పేదల ఇళ్లను కూలస్తున్నారన్న అపప్రథ రాగానే చర్యలు తీసుకుని ఉంటే ఇంతటి అపప్రథ వచ్చేది కాదు. కానీ సిఎం రేవంత్ పదేపదే హైడ్రాను సమర్థిస్తూ వచ్చారు. అయితే హైడ్రా వల్ల మంచి పనులు జరగలేదని చెప్పడానికి లేదు. ప్రభుత్వ భూముల కబ్జా, చెరువుల కబ్జాను తొలగించడం వంటి చర్యలను ప్రజలు సమర్థిaి`తూ వస్తూనే ఉన్నారు. కానీ పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చడాన్ని ఎవరూ సమర్థించరు. పేదలకు గూడు కట్టివాలనుకున్నప్పుడు వారు ఉన్న ప్రాంతాలను వారికే అప్పగించాలి. కానీ వారిని గూడులేని వారుగా చేయడం సరికాదు. హైదరాబాద్‌లోని జలవనరుల రక్షణ, అక్రమార్కుల కబ్జాలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణ పేరుతో ప్రభుత్వం గతేడాది జూలైలో జీవో 99 ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్ `హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కాలంలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులను కాపాడిందనడంలో సందేహం లేదు. అయితే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు చెడ్డపేరు తెచ్చి పెట్టాయి. చట్టప్రకారం, నిబంధనల మేరకు నడుచుకుని ఉంటే ఇంతగా హైకోర్టు చేత చివాట్లు తినాల్సిన పని వచ్చేది కాదు. హైడ్రా చేస్తున్న పనులపై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్ట్ వరుసగా మొట్టికాయలు వేస్తూనే ఉన్నది. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు చెప్పడం ప్రభుత్వాని చెంపపెట్టుగానే భావించాలి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారం ముందు నుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. బుల్డోజర్లను ఉపయోగిస్తూ ప్రభుత్వం సాగిస్తున్న కూల్చివేతల విషయంలో ఆయన తీరు పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడపట్ల విపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్‌పై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఆఫీస్ కోర్ట్ ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు ముందు కూడా రంగనాథ్ తీరు పట్ల హైకోర్ట్ పలుమార్లు మొట్టికాయలు వేసింది. ఇటీవలే ఆయన అరెస్ట్‌కు సైతం ఆదేశాలు ఇచ్చి, న్యాయవాదుల విజ్ఞప్తితో విరమించుకున్నది. హైడ్రా అరాచకాలు, రంగనాథ్ ఉల్లంఘనలపై హైకోర్ట్ చాలాసార్లు ఘాటుగానే స్పందించింది. హైడ్రా చర్యలు యుద్ధ పరిస్థితిని తలపించే చర్యలు అని అభివర్ణించింది. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నమోదు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైడ్రా చర్యలు సరైన దిశలో లేవని న్యాయమ ర్తి స్పష్టంచేశారు. 2025 ఫిబ్రవరిలోనూ జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరింత తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముత్తంగి గ్రామంలో ఓ షెడ్‌ను హైడ్రా కూల్చివేసిన తీరును దొంగలముఠా చర్యగా పోల్చింది. రాత్రిపూట రహస్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయని, చట్టపరమైన పక్రియను పాటించకపోతే హైడ్రాను మ సివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. ముందస్తు సమాచారం లేకుండా సెలవు రోజుల్లో ఎందుకు కూల్చివేతలకు పాల్పడుతున్నారని నిలదీసింది. హైడ్రా తీరుపై హైకోర్ట్ పదేపదే మొట్టికాయలు వేస్తున్నా, అధికారుల తీరును తప్పుబడుతున్నా ఆ సంస్థ యథేచ్ఛగానే వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోక పోవడంతో హైకోర్టు ముందు దోషిగా న ఇలబడాల్సి వచ్చింది. లోతుకుంటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల పర్వం పరాకాష్టగా చూడాలి. ఏవీ రంగనాథ్‌పై శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మ డో ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా జూలై 21న కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది. కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల విస్తీర్ణంలో కూల్చి వేసిన నిర్మాణాలను హైడ్రానే పునరుద్ధరించాలని జూన్‌లో హైకోర్ట్ తేల్చిచెప్పింది. హైడ్రా దుస్సాహసాన్ని న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తున్నదని జస్టిస్ నాగేశ్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయని చెప్పినప్పటికీ రాత్రంతా కూల్చివేతలు జరుపడమేంటని నిలదీసింది. నిర్మాణాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చును అధికారుల వ్యక్తిగత నిధుల నుంచి భరించాలని తేల్చిచెప్పింది. ఇది అరుదైన తీర్పు అని చెప్పవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ వృద్ధుడికి చెందిన వ్యవసాయ భూమిలో చేసిన విధ్వంసాన్ని కూడా జస్టిస్ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. రంగనాథ్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడంతో ఆ ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నది. రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని తేల్చిచెప్పింది. అదే రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు హైకోర్టులో విచారణకు రంగనాథ్ హాజరయ్యారు. అయితే ఆ తర్వాత కూడా హైడ్రా వ్యవహరించే తీరులో మార్పు రాలేదు. హైడ్రా చీఫ్ తానే ఒక చట్టంలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు సైనిక సిబ్బంది మోహరింపు ఉత్తర్వులను కూడా హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. జలవనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అంటూ హైడ్రా చెప్పుకొస్తున్నది. కానీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హైడ్రా అంటే ఉదయం 4 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేసే సంస్థ అని పేరుమోసింది. కోర్ట్ ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ధిక్కారణ ధోరణితో ప్రవర్తిస్తూ, ఆ ప్రవర్తననే విజయంగా ప్రచారం చేసుకొనే బృందంగా గుర్తింపు పొందింది. హైకోర్ట్‌లో 700కు పైగా కేసులు ఎదుర్కొంటున్న హైడ్రా, వివిధ కేసుల్లో విచారణల సందర్భంగా ధర్మాసనాలతో మొట్టికాయలు వేయించుకుంది. హైడ్రా రాజకీయంగా తటస్థంగా వ్యవహరించడంలేదని ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది. అధికార పార్టీకి చెందిన నేతల అక్రమ కట్టడాలను హైడ్రా ఎందుకు కూల్చివేయడంలేదని విపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంలేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, గడువు అడిగితే నిరాకరించడం, అప్పీల్‌కు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ప్రభుత్వ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టడం దారుణం. ఇప్పటికైనా హైడ్రా తీరు మారాలి. చట్టబద్దంగా, నిబంధనల మేరకు నడుచుకుంటే మంచిది. పేదల పక్షాలన నిలబడాల్సిన అసవరం కూడా గుర్తించాలి.

# 28 ఏండ్ల నిరీక్షణకు ఫలం

### అహింస పరిమళించిన నేలకు అంతర్జాతీయ గౌరవం...

**విశ్వశాంతికి వెలుగుదివ్వె సారనాథ్: బారతీయ ఆధ్యాత్మిక వారసత్వానికి సకల లోకాల సత్కారం**

**యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో సారనాథ్**

మన నేల సంస్కృతి ప్రయాణంలోనూ, లోక రంగ స్థలంపై బారతీయ ఆధ్యాత్మికత వెదజల్లిన సువాసనలలోనూ ఒక విలక్షణమైన పండగ ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాచీన చరిత్రకు, ఆత్మజ్ఞాన గొప్పతనానికి గురుతుగా నిలిచే ఉత్తరప్రదేశ్‌లోని సారనాథ్ బౌద్ధ పుణ్యక్షేత్రానికి యునెస్కో (UNESCO) ప్రపంచ వారసత్వ హోదా లభించింది. దక్షిణ కొరియాలోని బుసాన్ పట్టణంలో నిర్వహించిన ప్రపంచ వారసత్వ కమిటీ 48వ అంతర్జాతీయ కూటమి సమావేశంలో ఈ పవిత్ర నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ గొప్ప ప్రకటనతో మన దేశంలో యునెస్కో గుర్తింపు దక్కించుకున్న వారసత్వ తావుల మొత్తం సంఖ్య 45కు చేరింది. వీటిలో 37 సంస్కృతి–కళల తావులు, 7 ప్రకృతి ఒడిలో పుట్టిన తావులు, మరియొకటి కలగలిపిన (కంచన్‌జంగా) తావు ఉన్నాయి. లోకంలోనే అత్యంత విస్తారమైన సంస్కృతిని, ప్రకృతి సిరులను కలిగిన గొప్ప దేశాల వరుసలో బారతదేశం తన అగ్రస్థానాన్ని మరింత గట్టిగా మలచుకుంది. ఇది కేవలం ఒక రాతి కట్టడానికి లేక నేల భాగానికి దక్కిన పేరు ప్రఖ్యాతి మాత్రమే కాదు; మానవాళికి హింసలేని దారిని, జాలిని, ప్రశాంతతను అప్పజెప్పిన భారతీయ ధర్మాల సార్వజనీన వెలుగులకు లోకమంతా తలవంచి అందించిన గొప్ప గౌరవం.

సారనాథ్‌కు ఈ లోకవ్యాప్త పేరు ప్రఖ్యాతి అంత సులువుగా ఏమీ దక్కలేదు. యునెస్కో నియమాల ప్రకారం ఒక తావుకు అంతర్జాతీయ వారసత్వ గుర్తింపు దక్కాలంటే, దానికి "సాటిలేని విశ్వమానవ విలువ" ఉండటం ఎంతో ముఖ్యం. మన దేశం 1998లోనే సారనాథ్‌ను యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చింది. దాదాపు 28 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణ, ఎడతెగని పరిశోధనలు, పురాతన ఆధారాల సమర్పణ, కాపాడుకునే పద్ధతుల సమీక్షల తర్వాత ఈ గొప్ప కల నిజమైంది. చారిత్రక నిజాయితీ, శిల్పకళా నేర్పు, మానవ నాగరికతపై అది చూపిన ప్రభావం వంటి కఠినమైన పరీక్షలన్నింటినీ సారనాథ్ నిండుగా గెలిచి చూపించింది.

ఉత్తరప్రదేశ్ నేలలోని పరమ పవిత్రమైన కాశీ పట్టణానికి ఉత్తరంగా పది కిలోమీటర్ల దూరంలో ప్రశాంతమైన చెట్ల నీడలో అలరారుతున్న సారనాథ్, ప్రపంచ బౌద్ధ చరిత్రలోనే అత్యంత పూజనీయమైన తావు. లుంబినిలో పుట్టి, బోధ్‌గయలోని నదీ తీరాన రావి చెట్టు కింద ఎల్లలు లేని జ్ఞానాన్ని పొంది "బుద్ధుడు"గా మారిన సిద్ధార్థుడు, తన మొదటి ధర్మ సందేశాన్ని లోకానికి వినిపించడానికి ఎంచుకున్న దివ్యభూమి ఇది. ఇక్కడే ఆయన తన పాత మిత్రులైన ఐదుగురు సన్యాసులకు — కొండన్న, భద్దియ, వప్ప, మహానామ, అస్సజిలకు — మొట్టమొదటి సారిగా "నాలుగు ఆర్య సత్యాలను", "ఎనిమిది బాటల మార్గాన్ని" ఉపదేశించారు. బౌద్ధ భాషలో ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని "ధర్మచక్ర ప్రవర్తన సూత్రం" అని పిలుస్తారు. లోక కల్యాణానికి పునాది వేసిన బౌద్ధ "సంఘం" పురుడు పోసుకుంది కూడా ఈ పవిత్ర నేలపైనే కావడం విశేషం.

చారిత్రక ఆధారాల ప్రకారం "సారనాథ్" అనే మాటకు సుదీర్ఘమైన, అందమైన పూర్వాపరాలు ఉన్నాయి. ఎంతో ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని "ఋషిపట్టనం" అని, "మృగదావం" అని పిలిచేవారు. 'మృగదావం' అంటే జింకలు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా తిరిగే అడవి అని అర్థం. బౌద్ధ జాతక కథల ప్రకారం, ఒక పూర్వజన్మలో బోధిసత్వుడు జింక రూపంలో పుట్టి, నిండు చూలాలుగా ఉన్న ఒక జింక ప్రాణాలను కాపాడటానికి తన ప్రాణాలనే త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడు. ఈ కరుణామయ త్యాగానికి సాక్ష్యంగా నిలిచిన ఈ నేలకు "సారంగనాథ్" (జింకల ఏలేడు) అనే పేరు వచ్చి, కాలక్రమంలో అది "సారనాథ్"గా రూపాంతరం చెందింది. కేవలం బౌద్ధానికే కాకుండా, ప్రాచీన సంస్కృత సాహిత్యంతోనూ, 11వ జైన తీర్థంకరుడైన శ్రేయాంశనాథుని పురిటిపాటిగా జైన సంప్రదాయంతోనూ ఈ నేలకు విడదీయరాని ముడి ఉంది.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో మౌర్య రాజ్యాన్ని ఏలిన అశోక చక్రవర్తి, కళింగ యుద్ధం తర్వాత కత్తిని పక్కనపెట్టి శాంతి బాటను ఎంచుకున్నాక సారనాథ్‌ను ఒక అద్భుతమైన నిర్మాణ కళా నిలయంగా మార్చాడు. బుద్ధుని బోధనలు ఎప్పటికీ నిలిచిపోయేలా ఇక్కడ ధర్మరాజిక స్తూపాన్ని, పెద్ద బౌద్ధ విహారాలను, ఏకశిలా అశోక స్తంభాన్ని నిలబెట్టాడు. ఈ అశోక స్తంభం నెత్తిపై అత్యంత నేర్పుతో చెక్కిన నాలుగు సింహాల బొమ్మ, స్వతంత్ర భారతం అవతరించాక మన దేశ అధికారిక ముద్రగా మారింది. అదే స్తంభం కింది భాగంలో కనిపంచే 24 ఆకుల 'ధర్మచక్రం' మన జాతీయ జెండా నడుమ సముచిత స్థానాన్ని పొందింది. మన దేశ గుర్తింపులకు, రాజ్యాంగ ముద్రకు ఏకకాలంలో మూలమై నిలవడం సారనాథ్ కలిగి ఉన్న ప్రత్యేకమైన గొప్పతనం.

మౌర్యుల తర్వాత ఈ నేలను ఏలిన కుషాణులు, గుప్తులు, తదితర రాజులు సారనాథ్‌లో బౌద్ధ సంస్కృతిని మరిన్ని జిలుగులతో తీర్చిదిద్దారు. ముఖ్యంగా గుప్తుల కాలంలో ఇక్కడి శిల్పకళ నింగినంటింది. ప్రాచీన శిల్పులు మలచిన "సారనాథ్ శిల్పశైలి" ప్రపంచ కళల చరిత్రలోనే ఒక ప్రత్యేక పేజీగా నిలిచింది. ఇక్కడ చెక్కిన బుద్ధుని విగ్రహాలు ప్రశాంతతకు, జాలికి, ఆధ్యాత్మిక నిలకడకు సజీవ రూపాలు. నేటికీ చెక్కుచెదరకుండా ఉన్న 43.6 మీటర్ల ఎత్తున్న ధమేఖ్ స్తూపం, చౌఖండి స్తూపం, పాత విహారాల అవశేషాలు సారనాథ్ చారిత్రక వెలుగులకు నిలువుటద్దాలు.

చైనా దేశానికి చెందిన ప్రసిద్ధ యాత్రికులు ఫాహియాన్, హ్యూయెన్‌సాంగ్ తమ భారత పర్యటనల్లో సారనాథ్‌ను సందర్శించి, ఇక్కడి వైభవాన్ని తమ పుస్తకాలలో అద్భుతంగా రాశారు. హ్యూయెన్‌సాంగ్ రాస్తూ, సారనాథ్‌లో దాదాపు 30కి పైగా పెద్ద విహారాలు, 1500 మందికి పైగా బౌద్ధ భిక్షువులు నివసిస్తూ నిరంతరం జ్ఞాన చర్చలు జరిపేవారని పేర్కొన్నాడు. ఆనాడు వేర్వేరు దేశాల నుంచి వేలాది మంది విద్యార్థులు, పండితులు ధర్మ జ్ఞానం కోసం ఇక్కడికి వచ్చేవారు. ఆ రకంగా సారనాథ్ నాటి కాలంలోనే ఒక అంతర్జాతీయ జ్ఞాన పీఠంగా విలసిల్లింది.

మధ్యయుగంలో జరిగిన దండయాత్రల వల్ల ఈ పుణ్యక్షేత్రం తీవ్రంగా దెబ్బతిని, అనేక కట్టడాలు



మట్టిలో కలసి పోయాయి. అయితే 19వ శతాబ్దంలో "భారత పురావస్తు పితామహుడు" సర్ అలెగ్జాండర్ కనింగ్‌హామ్ నేతృత్వంలో జరిగిన తవ్వకాల ద్వారా నేలలో దాగివున్న ఈ ప్రాచీన సంపద మళ్లీ వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సారనాథ్ మ్యూజియంలో భద్రపరిచిన రాతి బొమ్మలు, బుద్ధ శిల్పాలు భారతీయ కళా నేర్పునకు కిరీటాలుగా నిలుస్తున్నాయి.

ఈ యునెస్కో గుర్తింపుతో లోక పర్యాటక రంగంలో సారనాథ్ పేరు మరింత ఉజ్వలంగా ప్రకాశించనుంది. శ్రీలంక, థాయ్‌లాండ్, జపాన్, దక్షిణ కొరియా, నేపాల్ వంటి దేశాల నుంచి యాత్రికుల రాక గణనీయంగా పెరుగుతుంది. దీనివల్ల స్థానిక ప్రజలకు రవాణా, భోజన, వసతి, హస్తకళల రంగాల్లో కొత్త ఉపాధి మార్గాలు లభిస్తాయి. అయితే ఈ గుర్తింపుతో పాటు కాపాడుకునే బాధ్యత కూడా పెరుగుతుంది. పాత కట్టడాల రక్షణ, కాలుష్యాన్ని అదుపు చేయడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం వంటి విషయాల్లో యునెస్కో నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. నేటి కాలంలో పోరాటాలు, కక్షలు పెరుగుతున్న తరుణంలో, వేల ఏండ్ల క్రితం సారనాథ్ నేల నుంచి వెలువడిన బుద్ధుని అహింసా సందేశం లోకానికి ఎంతో అవసరమైన దివ్య ఔషధం. విశ్వశాంతికి దిక్సూచిగా నిలిచిన సారనాథ్‌ను యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించడం భారతీయ ఆధ్యాత్మిక ప్రజ్ఞకు లభించిన నిరంతర అంతర్జాతీయ గౌరవం.

# రోడ్డు దాటిన నేరానికే మరణశిక్షా..? అడవి జంతువుల ఆర్తనాదం పట్టదా"..?



అడవిలో జన్మించిన జంతువుకు రోడ్డు అంటే ఏమిటో తెలియదు. ట్రాఫిక్ నిబంధనలు తెలియవు. ఎరుపు, ఆకుపచ్చ సిగ్నల్ల అర్థం తెలియదు. దానికి తెలిసిందల్లా ఒక్కటే... దాహం తీర్చుకోవాలి... ఆకలి తీర్చుకోవాలి... పిల్లలను కాపాడుకోవాలి. కానీ మనిషి నిర్మించిన రహదారులు ఇప్పుడు వాటికి మరణ మార్గాలుగా మారాయి. ప్రతి కొన్ని రోజులకోసారి ఎక్కడో ఒకచోట చిరుత, జింక, అడవి పంది, నెమలి లేదా మరేదైనా అడవి జీవి వాహనం ఢీకొని చనిపోయిందన్న వార్త కనిపిస్తోంది. కొన్ని నిమిషాలు బాధపడతాం. సోషల్ మీడియాలో ఫోటోలు చూస్తాం. ఆ తర్వాత మర్చిపోతాం. కానీ ఆ మరణాల వెనుక ఉన్న అసలు కారణాలను సరిదిద్దే ప్రయత్నం మాత్రం కనిపించడం లేదు. ఒక ప్రశ్న మనందరం వేసుకోవాలి.

అడవిని చీల్చుకుంటూ రహదారులు వేసింది ఎవరు?

అడవిని చీల్చుకుంటూ రహదారులు వేసింది ఎవరు? జంతువుల నివాసాలను ముక్కలుగా చేసింది ఎవరు?

అడవుల్లోని చెరువులు ఎండిపోవడానికి, నీటి వనరులు తగ్గిపోవడానికి కారణం ఎవరు? సమాధానం ఒక్కటే... మనిషి. అడవుల్లో నీటి కొరత పెరిగింది. వాతావరణ మార్పులు, అటవీ నరికివేత, అభివృద్ధి పేరుతో జరుగుతున్న నిర్మాణాలు అడవుల స్వరూపాన్నే మార్చేశాయి. ఫలితంగా మూగజీవులు గ్రామాల వైపు, చెరువుల వైపు, పంట పొలాల వైపు వస్తున్నాయి. తిరిగి అడవికి వెళ్లే క్రమంలో వేగంగా దూసుకొచ్చే వాహనాలు వాటి జీవితాలను క్షణాల్లో ముగిస్తున్నాయి.
చిరుత చనిపోతే అది ఒక వార్త కాదు. ఒక జీవ వ్యవస్థకు కలిగిన నష్టం. జింక చనిపోతే అది ఒక ప్రమాదం కాదు. అడవిలోని ఆహార గొలుసుకు తగిలిన దెబ్బ.

ప్రకృతిలో ప్రతి జీవి ఒక బాధ్యతను నిర్వహిస్తుంది. ఒక జాతి తగ్గిపోతే దాని ప్రభావం చివరకు మనిషిపైనే పడుతుంది. ప్రభుత్వాలు అభివృద్ధి గురించి గొప్పగా చెబుతున్నాయి. వేల కిలోమీటర్ల రహదారులు నిర్మిస్తున్నాయి. కానీ అదే రహదారులు అడవి జీవులను ఎలా ప్రభావితం చేస్తున్నాయో పరిశీలిస్తున్నాయా? రోడ్డు నిర్మాణానికి ముందు వన్యప్రాణుల సంచార మార్గాలను గుర్తిస్తున్నామా? అండర్‌పాస్‌లు, ఓవర్‌పాస్‌లు, రక్షణ కంచెలు, హెచ్చరిక వ్యవస్థలు సరిపడా ఏర్పాటు చేస్తున్నామా? ఈ ప్రశ్నలకు సమాధానం చాలాచోట్ల 'లేదు' అనే చెప్పాలి.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దేశవ్యాప్తంగా అడవుల గుండా వెళ్లే అన్ని ప్రధాన రహదారులపై ప్రత్యేక "వైల్డ్‌లైఫ్ రక్షణ ప్రణాళిక" అమలు చేయాలి. జంతువులు తరచూ రోడ్డు దాటే ప్రాంతాలను గుర్తించి అక్కడ తప్పనిసరిగా వైల్డ్‌లైఫ్ అండర్‌పాస్‌లు, ఓవర్‌పాస్‌లు నిర్మించాలి. అడవుల్లో ఏడాది పొడవునా నీరు ఉండేలా చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు, సోలార్ పంపులతో నీటి వనరులు అభివృద్ధి చేయాలి. రాత్రివేళల్లో వేగ నియంత్రణను కఠినంగా అమలు చేయాలి. సెన్సార్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేసి డ్రైవర్లకు ముందుగానే సమాచారం అందేలా చూడాలి.

అటవీ శాఖ, జాతీయ రహదారుల సంస్థ, రవాణా శాఖ, పోలీసులు సమన్వయంతో పని చేస్తే అనేక మూగజీవాల ప్రాణాలను కాపాడవచ్చు. అలాగే వాహనదారుల్లో కూడా బాధ్యత పెరగాలి. అడవి ప్రాంతాల్లో వేగం తగ్గించడం కేవలం చట్టం కోసం కాదు... ఒక ప్రాణాన్ని కాపాడడం కోసం. ఒక నాగరిక సమాజాన్ని భవనాల ఎత్తుతో కాదు, బలహీనమైన జీవులను ఎంతగా రక్షిస్తుందో దానితో కొలుస్తారు. మాట్లాడలేని జీవుల కోసం మాట్లాడటం మనిషి బాధ్యత. అభివృద్ధి పేరుతో వాటి నివాసాలను ఆక్రమించినప్పుడు, వాటికి సురక్షితమైన మార్గాలను కల్పించడం కూడా మన కర్తవ్యమే. అడవి జంతువులు రోడ్డు దాటడం నేరం కాదు. వాటి దారిలో మనమే రోడ్డు వేశాం. ఇప్పుడు వాటి ప్రాణాలను కాపాడకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు... కానీ మన నిర్లక్ష్యానికి తగిన మూల్యం మాత్రం తప్పకుండా చెల్లింపజేస్తుంది. మూగజీవుల కళ్లలో కనిపించే భయం... వాటి చివరి శ్వాసలో వినిపించే నిశ్శబ్ద ఆర్తనాదం... మన అభివృద్ధి నమూనాకు అద్దం పడుతోంది. ఇకనైనా మేల్కొని రోడ్లను మనుషులకే కాదు, అడవి జంతువులకు కూడా సురక్షితంగా మార్చే సమయం వచ్చింది.

**ఉక్కకల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

**ఆగస్టు 1న ప్రధాని చేతుల మీదుగా ఏఎసఆర్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం**

**2,703 ఎకరాల విస్తీర్ణం, రూ.4,727 కోట్ల ప్రాజెక్టు.**

**3,800 మీటర్ల రన్‌వేతొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం**

**500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ**

**ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం**

**అమరావతి, జూలై 28 (నినాదం):**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో మైలురాయి ఆవిష్కృతం కానుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే నెల నుంచి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఆగస్టు ఒకటో తేదీన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం వస్తున్నారు.
విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఈ ప్రాజెక్ట్ కీలకం కావడంతో ఈ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి కూటమి సర్కార్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన నగరాల సరసన చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో అదే స్థాయి ప్రమాణాలతో భోగాపురం ఎయిర్ పోర్టు సిద్దమైంది. కేవలం విమాన ప్రయాణ కేంద్రంగానే కాకుండా.. పరిశ్రమలు, ఉపాధి, ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు కేంద్రబిందువుగా మారేలా అల్లూరి సీతారామ రాజు ఎయిర్ పోర్టుకు రూపకల్పన చేశారు. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భోగాపురం ఒకటి. నిర్మాణం ప్రారంభమైన కేవలం 31 నెలల్లోనే పనులు పూర్తి చేయడమే కాకుండా, మొదట నిర్ణయించిన గడువుకంటే దాదాపు ఐదు నెలల ముందే సిద్ధం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం?విజయనగరం?శ్రీకాకుళం జిల్లాల ఆర్థికాభివృద్ధికి, పర్యాటక రంగ విస్తరణకు, పారిశ్రామిక పెట్టుబడులకు, ఎగుమతులకు, లాజిస్టిక్స్‌కు, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలక మౌలిక వసతిగా మారనుంది.
జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా పీపీపీ విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. మొత్తం 2,703.26 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. విమానాశ్రయం 2,203 ఎకరాలు, ఏవియేషన్ హబ్ 500 ఎకరాలు, ఏవియేషన్ య నివర్సిటీ/ఎడ్యుసిటీ 136 ఎకరాలు కేటాయించారు. విమానాశ్రయ పరిధిలో ఎయిర్‌సైడ్ డెవలప్‌మెంట్, సిటీ సైడ్ కమర్షియల్ డెవలప్‌మెంట్, రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారు. 3,800 వి టర్ల పొడవైన రన్‌వే ఈ విమానాశ్రయానికి ప్రధాన ఆకర్షణ. వైడ్‌బాడీ విమానాల కార్యకలాపాలకు అనుకూలంగా దీనిని రూపొందించారు. అంటే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్ లైనర్, ఎయిర్ బస్ ◌ం330, ఎయిర్ బస్ 340 వంటి భారీ ఎయిర్ క్రాఫ్టులు భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి రాకపోకలు సాగించగలవు. ఇక ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్, నావిగేషన్ ఎయిడ్స్, వంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు ఈ ఎయిర్ పోర్టులో అందుబాటులో ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ విమాన కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రమాణాలతో ఎయిర్‌సైడ్ మౌలిక వసతులను అభివృద్ధి చేశారు.



భోగాపురం విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాడ్యులర్ విధానంలో అభివృద్ధి చేశారు. తొలి దశలో ఏటా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఉంటుంది. భవిష్యత్‌లో దశలవారీ విస్తరణ ద్వారా ఈ సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణించేలా విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ప్రయాణికుల రద్దీ పెరిగే కొద్దీ టెర్మినల్, ఎయిర్‌సైడ్, కమర్షియల్ మౌలిక వసతులను విస్తరించేందుకు వీలుగా ప్రాజెక్టును రూపొందించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యం, వేగవంతమైన ప్రాసెసింగ్, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచేందుకు కాంటాక్ట్ బోర్డింగ్ బ్రిడ్జిలు, కామన్ య జ్ పాసింజర్ ప్రాసెసింగ్ వ్యవస్థ, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, సెల్ఫ్ సర్వీస్ పాసింజర్ ప్రాసెసింగ్, స్మార్ట్ సర్వైవలెన్స్, యాక్సెస్ కంట్రోల్, సెక్యూర్టీ మేనేజ్మెంట్ సిస్టం, ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ వంటి ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.ఉత్తరాంధ్ర ఎగుమతులు, పారిశ్రామిక అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం కీలకంగా మారనుంది. ఇక్కడ ఏటా 25,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రత్యేకించి కార్గో టెర్మినల్ అభివృద్ధి చేశారు. ఫార్మా, మెరైన్ ప్రొడక్ట్స్, అధిక విలువైన, పెరిషయబుల్ ఉత్పత్తుల రవాణాకు అవసరమైన టెంపరేచర్ కంట్రోల్డ్ కోల్డ్ చైన్ సదుపాయాలు కల్పించారు. దీంతో ఉత్తరాంధ్ర నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు వేగవంతం కానున్నాయి. భవిష్యత్‌లో విశాఖపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లతో అనుసంధానం ద్వారా భోగాపురం తూర్పు తీరంలో కీలకమైన ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ హబ్‌గా ఎదగనుంది. భోగాపురం విమానాశ్రయం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా అభివృద్ధి చేశారు. దీంట్లో భాగంగా 5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, ఎనర్జీ ఎఫిషియెంట్ ఊ అ వ్యవస్థ, ఎలఈడీ ఎయిర్ పోర్టు లైటింగ్, స్మార్ట్ బిల్డింగ్ మేనేజ్మెంట్ సిస్టం, రెయిన్ వాటర్ హర్వెస్టింగ్, వాటర్ రీ`సైక్లింగ్, మురుగు నీటి శుద్ధి చేసే ప్లాంట్లు, ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి వ్యవస్థలతో పర్యావరణ హిత విమానాశ్రయాన్ని ఏర్పాటు అయింది. విమానాశ్రయ నీటి అవసరాల్లో సుమారు 30 శాతం రీసైకిల్ చేసిన నీటితో తీర్చేలా ప్రణాళిక రూపొందించారు.

# హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

**కోట్ల రూపాయాల సైబర్ మోసం**

**కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఇడి**

హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖపట్నం, లఖ్‌నవూతో పాటు పలు నగరాల్లో నకిలీ కాల్ సెంటర్లను వికాస్ నిర్వహించాడు. ఈ ముఠా.. టెక్నికల్ సపోర్ట్ పేరుతో విదేశీయులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బు కాజేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రముఖ ప్రైవేట్ కంపెనీల అధికారులమంటూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి నిందితుడు బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో బయటపడింది. వికాస్.. కంప్యూటర్ వైరస్‌లు, బ్యాంక్ ఖాతా సమస్యలు, సెక్యూరిటీ అలర్ట్‌ల పేరుతో అమెరికన్లను భయపెట్టి డబ్బు వసూలు చేశాడని.. గిఫ్ట్ కార్డులు, డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ బాధితుల నుంచి నగదు సేకరించినట్లు దర్యాప్తులో తేలింది. సేకరించిన డబ్బును క్రిప టోకరెన్సీగా మార్చి ఆధారాలు లేకుండా ప్రయత్నించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. క్రిప `టో ఆస్తులను ఎక్స్ఛేంజ్‌లు, హవాలా తరహా నగదు సెటిల్‌మెంట్ నెట్‌వర్క్‌లు, బ్యాంకింగ్ మార్గాల ద్వారా భారత కరెన్సీగా మార్చినట్లు విచారణలో బయటపడింది. వీసీ సొల్యూషన్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి మోసపూరిత డబ్బును చట్టబద్ధ ఆదాయంగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. వీసీ సొల్యూషన్స్ బ్యాంక్ ఖాతాల్లో భారీ నగదు డిపాజిట్లు, అనుమానాస్పద క్రెడిట్ లావాదేవీలను గుర్తించారు. Sల్ సెంటర్ ద్వారానే ఆదాయం వచ్చినట్లు విచారణలో నిమార్ అంగీకరించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. అయితే ఈ డబ్బును ఆదాయపు పన్ను రిటర్న్‌లో కిరాణా వ్యాపారం, ఇతర వ్యాపారాల ఆదాయంగా వికాస్ చూపించాడని తెలిపారు. 2023లో ఈసీఐఆర్ నమోదు చేసి మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర, నిధుల ప్రవాహం, క్రిప్టో లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## నిజామాబాద్‌కు చెందిన జాన్ లిబ్నీ బాతుకకు అరుదైన అవకాశం

### డెన్వర్ ఫ్యామిలీ నైట్ కార్యక్రమంలో తెలుగు కుటుంబాలతో సుమ కనకాల

**నిజామాబాద్ ప్రతినిధి, జులై 28 (నినాదం)**

**డెన్వర్ ఫ్యామిలీ నైట్ కార్యక్రమంలో సుమ కనకాల ప్రేక్షకులతో కలిసిపోయి నిర్వహించిన సరదా ఆటలు, వినోద కార్యక్రమాలు, ఆత్మీయ సంభాషణలు తెలుగు కుటుంబాలకు స్వదేశంలో ఉన్న అనుభూతిని కలిగించాయి. అమెరికాలో వేల మైళ్ల దూరంలో ఉన్నా, ఆ సాయంత్రం ప్రతి ఒక్కరికీ తమ సొంత ఊరిలో ఉన్నట్టే అనిపించిందని వారు తెలిపారు.**

తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్‌కు చెందిన జాన్ లిబ్నీ బాతుకకు ప్రముఖ టెలివిజన్ యాంకర్ సుమ కనకాలతో ప్రత్యేక ఫోటోషూట్ నిర్వహించే అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని కొలరాడో రాష్ట్రం, డెన్వర్ నగరంలో ఉత్సవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన డెన్వర్ ఫ్యామిలీ నైట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన సుమ కనకాల డెన్వర్‌లో రెండు రోజులు గడిపారు. ఆ రెండు రోజుల పర్యటనలో ఆమెతో ప్రత్యేక ఫోటోషూట్ నిర్వహించే అవకాశం జాన్ లిబ్నీ బాతుకకు దక్కింది. ఆ రెండు రోజులలో ఆమెతో కలిసి ఫోటోషూట్ నిర్వహించడం తన జీవితంలో మరచిపోలేని అనుభవమని జాన్ లిబ్నీ బాతుక తెలిపారు. సెలబ్రిటీతో కలిసి పనిచేస్తున్నామనే భావన కంటే,ఒక కుటుంబ సభ్యురాలితో గడిపిన ఆప్యాయ సమయం అనే అనుభూతే ఎక్కువగా కలిగిందని ఆయన చెప్పారు. సుమలో ఎక్కడా సెలబ్రిటీ అనే గర్వం కనిపించలేదని, చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరితో ఒకే విధమైన ప్రేమ, ఆప్యాయత, గౌరవంతో మెలిగారన్నారు. ఆమె సరళత, వినయం, హాస్యచతురత, మనుషులను గౌరవించే తీరు నన్నెంతో ఆకట్టుకున్నాయి. ఆమె వ్యక్తిత్వం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని జాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాన్ లిబ్నీ బాతుక నేటి సమాజంలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, నిరాశ, ఒంటరితనం గురించి సుమ కనకాలని ప్రశ్నించారు. ఈ రోజుల్లో చిన్న చిన్న కారణాలకే చాలామంది తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కొందరు జీవితంపై ఆశనే కోల్పోతున్నారు. అలాంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అని అడగగా, సుమ కనకాల ఎంతో సరళంగా కానీ హృదయాన్ని తాకే సమాధానం ఇచ్చారు. జరిగిపోయిన వాటిని పదే పదే గుర్తు చేసుకుంటూ బాధపడకండి. వీలైనంత వరకు మర్చిపోయి ముందుకు సాగండి జీవితం ఎప్పుడూ ముందుకు సాగుతూనే ఉంటుందన్నారు. ఈ ఒక్క వాక్యం తన మనసులో చిరస్థాయిగా నిలిచిపోయిందని జాన్ తెలిపారు.జీవితంలో కష్టాలు, అపజయాలు, బాధలు ప్రతి ఒక్కరికీ వస్తాయి. కానీ అవి శాశ్వతం కావు. ఒక సమస్య కోసం మన అమూల్యమైన జీవితాన్ని కోల్పోవడం ఎప్పటికీ పరిష్కారం కాదు. ప్రతి ఉదయం కొత్త ఆశను, కొత్త అవకాశాన్ని తీసుకొస్తుంది. మనల్ని ప్రేమించే కుటుంబం ఉంది, స్నేహితులు ఉన్నారు, మన కోసం ఎదురు చూస్తున్న మంచి రోజులు ఉన్నాయి. అందుకే జీవితాన్ని ప్రేమిద్దాం, నవ్వుతూ ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. మానసికంగా కుంగిపోయిన వారు తమ బాధను మనసులో దాచుకోకుండా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో లేదా అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణులతో మాట్లాడాలని ఆయన సూచించారు. సహాయం కోరడం బలహీనత కాదు, అది ధైర్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. జాన్ లిబ్నీ బాతుక మాట్లాడుతూ సుమ కనకాలతో గడిపిన ఆ రెండు రోజులు నాకు కేవలం అందమైన ఫోటోలు మాత్రమే ఇవ్వలేదు. జీవితాన్ని సానుకూలంగా చూడడం, వినయంగా ఉండడం, ప్రతి మనిషిని గౌరవించడం, చిరునవ్వుతో జీవించడం వంటి ఎన్నో విలువైన పాఠాలను నేర్పాయి. ఆ రెండు రోజుల అనుభవం నా జీవితాంతం స్ఫూర్తిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రస్తుతం ఎంతటి బాధలో ఉన్నా అది మీ జీవితానికి ముగింపు కాదు. ఈ రోజు కనిపించని వెలుగు రేపు మీ జీవితాన్ని ప్రకాశింపజేయవచ్చు. ఒక క్షణిక నిర్ణయం మీ జీవితాన్ని ముగించగలదు కానీ ఒక ఆశాజనక నిర్ణయం మీ జీవితాన్నే మార్చగలదు. నవ్వండి మాట్లాడండి సహాయం కోరండి ముఖ్యంగా జీవించండి.



### సాగునీటి ప్రాజెక్టులు రాజకీయ ప్రాజెక్టులుగా మారిన

# సీతమ్మ సాగర్, సీతారామ సాగర్

### ఆయకట్టు రైతుల ఆశలు అడియాశలు

### రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు, సీతమ్మ సాగర్, సీతారామ సాగర్ ప్రాజెక్టుగా మారిన వైనం

**మణుగూరు జూలై 28 (నినాదం):**

వల్ల మారిన రాజకీయాలతో వట్టిపోతున్న సాగునీటి ప్రాజెక్టులు దుస్థితి రైతుల పాలిటి శాపాలుగా మారాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సబ్ డివిజన్ అశ్వాపురం మండలం అమ్మగారి పెల్లి, దుమ్మగూడెం మండలాలను అనుసంధానం చేసే గోదావరి నదిపై నిర్మించిన సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులు ఇప్పుడు రాజకీయ ప్రాజెక్టుగా మారిపోయాయి. స్థానిక ఆయకట్టు రైతులు ఎంతో ఆశతో తమ విలువైన భూములను త్యాగం చేసి, రెండు ప్రాజెక్టులకు అనుమతిని ఇవ్వడం జరిగింది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇదే గోదావరి నదిపై రాజీవ్ సాగర్ సాగునీటి ప్రాజెక్టుగా రూపాంతరం సంతరించుకొని పురుడు పోసుకుంది. ఆ తర్వాత రాష్ట్ర విభజన విభజన అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టులు ఊరు పేరు మారిపోయింది. సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టుగా మరల రెండోసారి ఈ ప్రాజెక్టులు పురుడు పోసుకోవడం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజీవ్ సాగర్ గా రూపాంతరం జరిగిన ఈ ప్రాజెక్టుల ద్వారా ఆంధ్ర ప్రాంతానికి సాగునీరును తరలించుకుపోయే ఉద్దేశంతో ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన అనంతరం కెసిఆర్ ప్రాజెక్టులకు పేరు మార్పిడి చేసి





తన ఆధిపత్యాన్ని ప్రదర్శించుకున్నారు. కానీ ఎంతో త్యాగం చేసి విలువైన భూములను ఇచ్చిన రైతులను ఇద్దరు ముఖ్య మంత్రులు విస్మరించారు.సాగునీటిని తరలించే ఉద్దేశంతో ప్రాజెక్టు రూప కల్పన జరిగినట్లు తెలుస్తుంది. ప్రాజెక్టులు నిర్మాణం 70 శాతం వరకు కేసీఆర్ హయాంలోనే పూర్తి చేసుకోగా, ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం జిల్లా ఏనుకూరు మండలం అన్నారుగూడెం వద్ద ఎన్ఎస్కెనాల్కి తరలించే ఉద్దేశంతో రూపకల్పన జరిగింది. ఎన్ఎస్ కెనాల్ ద్వారా మధిర కల్లూరు సత్తుపల్లి అశ్వారావుపేట తదితర ప్రాంతాలకు సాగునీరును తరలించకపోవడం స్థానిక రైతులకు కన్నీరు పెట్టిస్తుంది. త్యాగం చేసిన రైతులకు చుక్క నీరు కూడా సాగునీరుకి త్రాగునీరుకి ఇవ్వకుండా వారి కళ్ళ ఎదురుగా సుదీర్ఘ ప్రాంతాలకు సాగునీరును తరలించడం స్థానిక రైతులకు ఆయకట్టు ప్రజలకు మింగుడు పడడం లేదు. ఇదే విషయంపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులను విస్మరించి తాగునీరు సాగునీరు ఇవ్వకుండా సుదీర్ఘ ప్రాంతాలకు ఈ ప్రాజెక్టుల ద్వారా తరలించడం ఏమిటని వాళ్ళు ప్రశ్నిస్తున్నారు. ఆయకట్టు రైతులు ప్రభుత్వం పై ఒత్తిడి తేవడంతో అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద నిర్మించిన రెండు ప్రాజెక్టుల ఎత్తిపోతల గేటు ద్వారా, నేరెళ్ల పాడు కాలువ ద్వారా స్థానికంగా ఉన్న చెరువులకు నీరు అందించే ప్రతిపాదన నత్తనడకన నడుస్తుందని కమ్యూనిస్టులు తీవ్ర స్వరంతో ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో సాగినీరు ఎద్దడి ఏర్పడింది. ఇదే సమస్య తీవ్ర రూపం దాల్చిందని కమ్యూనిస్టులుఆరోపిస్తున్నారు. కొద్దో గొప్పో ప్రాజెక్టు నుంచి వచ్చే గోదావరి నీటిని నిర్భయంగా నిక్కచ్చిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు మూడు ప్రాంతాలకు సాగినీటిని తరలించకపోవడం ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. భూములు త్యాగం చేసిన రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం పూర్తిగా చెల్లించడం లేదని కమ్యూనిస్టు పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఒకపక్క రైతులు భూములు కోల్పోయి కన్నీటి ఆవేదనతో ఎదురుచూస్తున్న తరుణంలో వర్షాభావ పరిస్థితులు రైతుల ఓపికను పరీక్షిస్తుందని వారి ఆరోపిస్తున్నారు. మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్లు రైతులు పరిస్థితి వర్ణనాతీతంగా మారిపోయిందని కమ్యూనిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సాగునీటి ప్రాజెక్టుల సాగునీరు దోపిడిని వెంటనే నిలుపుదల చేయాలి:**
**కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్**

సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల వేదలను వెంటనే పరిగణలకు తీసుకొని వాళ్ల సమస్యలను పరిష్కరించాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ ప్రాంతాల నుంచి జరుగుతున్న సాగినీరు దోపిడిని వెంటనే నిలుపుదల చేసి స్థానిక ప్రజలకు, ఆయకట్టు రైతులకు త్రాగునీరు



సాగునీరు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆయకట్టు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని పాలకులు దురుద్దేశంతో సాగునీరు సుదీర్ఘ ప్రాంతాలకు తరలించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రుల మూడు రకాల కుట్రాలను భగ్నం చేసేందుకు స్థానిక రైతులు సిద్ధంగా ఉండాలని కమ్యూనిస్టు పార్టీలు పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలనలో దుమ్ముగూడెం వద్ద ఆనకట్టను నిర్మించి ఆ నీటిని నిలుపుదల చేసి చుట్టుపక్కల ప్రాంతాలకు సాగునీరు అందించింది. అప్పుడు బ్రిటిష్ పాలకులు వారు ముందు చూపుతో ఈ ప్రాంత వాసులకు ఇప్పటివరకు ఎంతో అమృత పాణ్యం గా మారింది. అదే ఆనకట్టపై కొత్త ప్రాజెక్టులు నిర్మించి చుట్టుపక్కల రైతులను తీవ్ర అన్యాయం చేయటం ఇది దేశద్రోహం కిందే వస్తుందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము స్థానిక ఆయకట్టు రైతులకు సాగునీరు త్రాగునీరు ఇచ్చిన తర్వాతే సుదీర్ఘ ప్రాంతాలకు తీసుకొని వెళ్లాలని వారు డిమాండ్ చేశారు.




## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలు, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం మార్కెట్ సూచీలపై ప్రభావం చూపింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్ ఒత్తిళ్లకు లోనయ్యాయి. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 69.86 పాయింట్లు కోల్పోయి 76,765.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.60 పాయింట్లు నష్టపోయి 23,985.35 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.84 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో టీసీఎస్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి.హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, బీఈఎల్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ, పవర్‌గ్రిడ్, రిలయన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 86.18 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,021.89 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఇన్‌స్టా మార్ట్ సీఈఓ రాజీనామా




### పెరిగిన స్విగ్గీ షేర్లు

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగం ఇన్‌స్టా మార్ట్ షేర్లు మంగళవారం అమాంతం పెరిగాయి. కంపెనీ ప్రస్తుత సీఈఓ అమితేశ్ కుమార్ ఝా రాజీనామానే ఇందుకు కారణం. తక్షణమే ఇది అమల్లోకి రానుంది. ఆగస్టు 3 నుంచి తదుపరి సీఈఓగా నందిత సిన్హా కొనసాగనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. సీఈఓ రాజీనామాతో స్విగ్గీ షేరు 0.03శాతం ఫ్లాట్‌గా రూ.257.90 వద్ద ప్రారంభమవ్వగా.. ఇంట్రాడేలో రూ.273 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్‌లో 5శాతం మేర షేర్లు లాభపడ్డాయి. 2.05 గంటల సమయంలో బీఎస్ఈలో షేరు ధర రూ.268.27 వద్ద కొనసాగుతోంది. "ఇన్‌స్టామార్ట్ వృద్ధికి అమితేశ్ విలువైన నాయకత్వం అందించారు. జులై 28న ఆయన కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుంది. కంపెనీ బలోపేతానికి కృషి చేస్తాం. కాంట్రిబ్యూషన్ మార్జిన్ క్రమంగా మెరుగుపరుస్తాం" అని కంపెనీ ప్రకటించింది. కాగా, తదుపరి సీఈఓ నందిత సిన్హా గతంలో ఇ-కామర్స్ సంస్థలైన ఫ్లిప్‌కార్ట్, ఎఫ్ఎంసీజీ వంటి సంస్థలకు తన నాయకత్వాన్ని అందించారు.

# మరో సేల్‌కు సిద్ధమైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మరో సేల్‌కు సిద్ధమయ్యాయి. జులై 4న అమెజాన్.. ప్రైమ్ మెంబర్ల కోసం ప్రత్యేకంగా ప్రైమ్ డే సేల్‌ను తీసుకురాగా.. ఇప్పుడు గ్రేట్ ఫ్రీడమ్ సేల్‌ను ఆగస్టు 7వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈసారి అందరూ పాల్గొనేలా ఈ సేల్ ప్రకటించింది. అలాగే, ఫ్లిప్‌కార్ట్ కూడా ఫ్రీడమ్ సేల్‌ను ఆగస్టు 8వ తేదీ నుంచి తీసుకొస్తోంది. ఈ సందర్భంగా ఐఫోన్17, శాంసంగ్ గెలాక్సీ ఎస్25పై భారీ డిస్కౌంట్లు ఉంటాయని పేర్కొంది. మరి ఆ వివరాలు పరిశీలిస్తే..

**అమెజాన్ గ్రేట్ ఫ్రీడమ్ సేల్..**

ఆగస్టు 7 నుంచి అమెజాన్.. గ్రేట్ ఫ్రీడమ్ సేల్ నిర్వహించనుంది. హెచ్‌డీఎఫ్‌సీ కార్డుతో చేసే కొనుగోళ్లపై 10 శాతం తక్షణ రాయితీ లభిస్తుంది. అమెజాన్ ఐసీఐసీఐ బ్యాంక్ కార్డు ఉన్నవారు 5 శాతం క్యాష్‌బ్యాక్ ప్రకటించింది. అలాగే రూ.2వేల వరకూ క్యాష్‌బ్యాక్ రివార్డులు, గిఫ్ట్‌కార్డ్‌లు, గిఫ్ట్ వోచర్స్ దక్కించుకోవచ్చు. మొబైల్ రీఛార్జ్‌లపై




రూ.50 వరకు, ఇన్సూరెన్స్ ప్రీమియంలపై రూ.999 వరకు ఆదా చేసుకోవచ్చు.
స్మార్ట్‌ఫోన్స్, యాక్సెసరీలు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు, అమెజాన్ డివైజులపై డిస్కౌంట్లు అందించనుంది. కొన్ని వస్తువులపై లిమిటెడ్ టైమ్ ఆఫర్లు, ట్రెండింగ్ డీల్స్, 8 పీఎం డీల్స్, బ్లాక్‌బస్టర్ డీల్స్ కూడా ఉండబోతున్నాయి. సేల్‌కు సంబంధించి ఇప్పటికే అమెజాన్ తన వెబ్‌సైట్/ యాప్‌లో మైక్రోసైట్ అందుబాటులో ఉంచింది. త్వరలోనే ఆఫర్ల వివరాలను ప్రకటించనుంది

**ఫ్లిప్‌కార్ట్ ఫ్రీడమ్ సేల్ వివరాలివే..**

అమెజాన్‌కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ కూడా తన కస్టమర్ల కోసం ఫ్రీడం సేల్ తీసుకు వస్తోంది. ఇది ఆగస్టు 8న ప్రారంభం కానుంది. ప్లస్, బ్లాక్ సబ్‌స్క్రైబర్లకు 24 గంటల ముందే సేల్స్ అందుబాటులోకి రానున్నాయి.
ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో చేసే కొనుగోళ్లపై 10 శాతం తక్షణ రాయితీ అందించనుంది. ఎంపిక చేసిన వస్తువులపై వడ్డీ రహిత ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. కొన్ని వస్తువులపై టాప్ డీల్స్, మేడ్ ఇన్ ఇండియా, టిక్ టాక్ వంటి ఆఫర్లు ఉండబోతున్నాయి. ఐఫోన్ 17, శాంసంగ్ గెలాక్సీ ఎస్25, మోటొరోలా ఎడ్జ్ ఫ్యూజన్ మొబైల్స్‌పై డిస్కౌంట్లు ఉండనున్నాయి. వీటితో పాటు ల్యాప్‌టాప్స్, ట్యాబ్లెట్స్, టీవీలు, హోమ్ అప్లికేషన్స్‌పై ఆఫర్లు ఉండబోతున్నాయి. పూర్తి ఆఫర్ వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# ప్లాస్టిక్ నోట్ల ముద్రణకు ప్రభుత్వ అనుమతి

దేశంలో సామాన్యులు రోజువారీగా అత్యధికంగా వినియోగించేది రూ.10, రూ.20 నోట్లే. వాడకం అధికంగా ఉండటంతో త్వరగా పాడవుతున్నవీ ఈ నోట్లే. అందుకే రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా వినియోగంలోకి తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ వెల్లడించారు. 1934 ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం.. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సిఫారసుల మేరకే, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో పాలిమర్ నోట్లను పరీక్షించేందుకు చిన్న




మొత్తాలతో ప్రారంభించాలని నిర్ణయించారు. తొలి సారిగా రూ.10 పాలిమర్ నోట్లు 100 కోట్ల మేర, రూ.20 పాలిమర్ నోట్లు మరో 100 కోట్ల మేర మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు. పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి వచ్చినా, ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీ నోట్లు రద్దు కావని, రెండూ సమాంతరంగా చలామణిలో ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. కరెన్సీ నోట్లు పాడవుతుండటంతో, కొత్తగా ముద్రించేందుకు ఏటా పెద్దమొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. 2023-24లో కొత్త నోట్ల ముద్రణ వ్యయం రూ.5,101.4 కోట్లు కాగా, 2024-25లో రూ.6372.8 కోట్లకు చేరింది. ఒకపక్క డిజిటల్ చెల్లింపులు సంఖ్యాపరంగా - విలువపరంగా వృద్ధి చెందుతున్నా, కరెన్సీ నోట్ల ముద్రణకు అధికంగా వెచ్చించాల్సి వస్తున్నందునే, పాలిమర్‌నోట్లు తెస్తున్నారు.

# టాటా సన్స్ లాభంలో 22% వృద్ధి

టాటా గ్రూప్ హోల్డింగ్ సంస్థ టాటా సన్స్, 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.31,961 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2024-25 లాభం రూ.26,232 కోట్ల కంటే ఇది 22% అధికం. పెట్టుబడులపై వచ్చిన లాభాలు, అనుబంధ సంస్థలు మెరుగైన పనితీరు కనబర్చడం టాటా సన్స్ లాభాల్లో వృద్ధికి కారణమయ్యాయి. సంస్థ ఆదాయం 9.1% పెరిగి రూ.42,367 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.1,10,717 డివిడెండును కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో టాటా గ్రూపు ఆదాయం 7.8% పెరిగి రూ.16.24 లక్షల కోట్లకు, లాభం 52% వృద్ధితో రూ.1.71 లక్షల కోట్లకు చేరాయి. 2020 స్థాయితో పోలిస్తే గ్రూపు ఆదాయం 2.1 రెట్లు, లాభాలు 5.4 రెట్లు పెరిగాయని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ.. ఎయిరిండియా, టాటా డిజిటల్ వంటి నష్టాల్లో ఉన్న వ్యాపారాల్లో పెట్టుబడులు కొనసాగించడాన్ని దీర్ఘకాలిక వ్యూహాత్మక నిర్ణయాలుగా చంద్రశేఖరన్ సమర్థించుకున్నారు. 2025-26లో ఎయిరిండియా రూ.22,238 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తద్వారా గ్రూపు పనితీరుపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. టాటా డిజిటల్ నష్టం కూడా 2024-25లోని రూ.4,610 కోట్ల నుంచి 2025-26లో రూ.4,974 కోట్లకు పెరిగింది. భారత ఇ-కామర్స్ విపణిలో వేగంగా వస్తున్న మార్పుల వల్లే టాటా డిజిటల్‌కు నష్టాలు వచ్చాయని చంద్రశేఖరన్ తెలిపారు. గగనతల మూసివేతలు, ఇంధన ధరల పెంపు, విదేశీ మారకపు రేట్ల హెచ్చుతగ్గులు, ఏఐ- 171 విమాన ప్రమాదం లాంటివి ఎయిరిండియా ఆర్థిక పనితీరుపై ప్రభావం చూపాయని వెల్లడించారు. 'టాటా డిజిటల్ లక్ష్యాలు గొప్పగా ఉన్నాయి. అవి పురోగతి చూపించడం ప్రారంభించాయి. కేవలం నాలుగేళ్లలోనే ఈ వ్యాపారం రూ.46,515 కోట్ల జీఎంవీ (స్థూల వస్తువుల విలువ) స్థాయికి చేరుకుంద'ని ఆయన వెల్లడించారు. విమానాల పునరుద్ధరణ, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, పాత వ్యవస్థలు, సంస్కృతిని సమూలంగా మార్చడం లాంటి చర్యల ద్వారా ఎయిరిండియా గాడిలో పడేందుకు 5-10 సంవత్సరాల సమయం పడుతుందని అనుకోవాలని చెప్పారు. మరోవైపు ఆర్థిక సేవలు, లాయల్టీ కార్యకలాపాలపై టాటా న్యూ మరింతగా దృష్టి సారించనుందని చెప్పారు. రుణాలు, బీమా సేవలను విస్తరిస్తూనే, వినియోగదార్ల నెలవారీ చెల్లింపులను 10 రెట్లు పెంచే ప్రణాళికలో ఉందని తెలిపారు.



## ఇన్‌స్టా, ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌కు కేంద్రం నోటీసులు

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, గూగుల్ వంటి పలు సామాజిక మాధ్యమాలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. డేటా గోప్యత, ఇతర నిబంధనలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఆగస్టు 3న సోషల్ మీడియా ప్రతినిధులతో పార్లమెంటరీ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కమిటీ ఛైర్మన్, భాజపా ఎంపీ నిశికాంత్ దూబే ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సప్, గూగుల్, స్నాప్‌చాట్, ఎక్స్ (ట్విట్టర్) సంస్థలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. వినియోగదారుల వ్యక్తిగత భద్రతకు, డేటా ప్రైవసీకి అమలు చేస్తున్న నిబంధనలపై ఆ సంస్థల ప్రతినిధులు వివరణ ఇవ్వాలి. మహిళలు, చిన్నారులు, రైతులు, కార్మికులు ఇలా ప్రజా భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలి. ఆగస్టు 3న సాయంత్రం 4 గంటలకు సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం ఉంటుంది" అని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, భాజపా ఎంపీ నిశికాంత్ దూబే తెలిపారు. కాగా, నీట్ యూజీ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల నిరసనను ప్రచారం చేయడానికి కాక్రోచ్ జనతా పార్టీ విస్తృతంగా సామాజిక మాధ్యమాలను వినియోగించింది. ఈ క్రమంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులు



**కీసర, జూలై 28 (నినాదం):** మెడ్చల్ నియోజకవర్గం, పోచారం డివిజన్ పరిధిలోని ప్రతాప్‌సింగారం గ్రామంలో మెడ్చల్ కాంగ్రెస్ మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ భవాని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కీసర మండల మాజీ జడ్పీటీసీ ముప్పు రామరెడ్డి, నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆలయ పునర్నిర్మాణం కోసం ?51,000 విరాళంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్కా ప్రభాకర్ రెడ్డి, గణపురం కొండలరెడ్డి, పొట్టా పరమేశ్ పాల్గొనడం జరిగింది.

## విద్యార్థుల జీవితాన్ని మలుపు తిప్పే దశ ఇంటర్మీడియట్

- నోడల్ అధికారి శంకర్ నాయక్



**కొడంగల్, జూలై 28(నినాదం):** విద్యార్థుల జీవితాన్ని మలుపు తిప్పే దశ ఇంటర్మీడియట్ అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం బొంరాస్ పేట్ మండలం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ను సందర్శించిన ఆయన కళాశాలలో అడ్మిషన్లు, విద్యార్థుల హాజరు, యుడైస్ వంటి తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యాభ్యాసం లో ఇంటర్మీడియట్ విద్య చాలా ముఖ్యమైనది, విద్యార్థులు ఏకాగ్రత ను కోల్పోకుండా, దుర్వ్యసనాలకు, దురలవాట్లకు లోను కాకుండా, లక్ష్యం దిశగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎంచుకున్న సబ్జెక్టు లలో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రోజారాణి, అధ్యాపకులు సురేష్, హరికృష్ణ, రమేష్, క్రిష్ణ, ప్రవీణ్, శేఖర్, ఫాతిమా, శివ, స్వప్న, కీర్తి, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం పూర్తిచేయాలి



**వికారాబాద్, జూలై 28(నినాదం ):** వికారాబాద్ పట్టణం లోని ప్రభుత్వ జూనీయర్ కాళశాల భవనం నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరుతూ మంగళవారం అసిస్టెంట్ కలెక్టరు ఉమా శంకర్ ను కలిసి బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా కన్వీనర్ శివరాజ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా కళాశాలకు మంజూరైనా భవనం నిర్మాణం ఇప్పటి వరకు పూర్తిచేయకపోవడం విడ్డురంగా ఉందని చెప్పారు. ఎంత మంది ప్రజాప్రతినిధులను కలిసిన ప్రయోజనం లేదని చెప్పారు. గత సంవత్సరం జిల్లా కలెక్టర్ చొరవతో 5 అయిదు గదులు పూర్తిచేయించారాని చెప్పారు. దాదాపుగా 600 మంది విద్యార్థులు ఉన్నారని సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ వినతి పత్రం ఇవ్వడం జరిగిందన కలెక్టర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. అదేవిధంగా కళాశాల ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న మంచి నీటి వసతి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని ఈ విషయమై అసిస్టెంట్ కలెక్టర్ తో చర్చించగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ సమస్యలపై హై కోర్ట్ చిఫ్ జస్టిస్ కు పోస్ట్ కార్డు లు తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య, సీపీఫ్స్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు లు పంపడం జరిగింది.

## ఈ నెలాఖరు లోగా ఈ కేవైసీ పూర్తి చేయండి

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పౌరసరఫరాల అధికారి

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 28 (నినాదం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కమిషనర్ పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ నమోదు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హాజరై మాట్లాడుతూ ఈ కేవైసీ పురోగ వృద్ధిపై నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం 22,60,451 మంది రేషన్ కార్డుదారులు ఉండగా ఇప్పటివరకు 17,07,731 మంది సభ్యులు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారని ఇంకా 5,52,720 మంది సభ్యులు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయవలసి ఉందని తెలిపారు. ఈ విషయమై గతంలో కూడా పలుమార్లు రేషన్ కార్డుదారులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కల్పించినప్పటికీ ఇంకా కొంతమంది సభ్యులు ఈ కేవైసీ నమోదు చేయలేదని కావున ఈ కేవైసీ ఉన్న రేషన్ కేవైసీ పూర్తి చేయని 5,52,720 మంది రేషన్ కార్డు దారులు తమకు అందుబాటులో ఉన్న రేషన్ షాపును సందర్శించి ఎటువంటి జాప్యం లేకుండా ఈ కేవైసీ ప్రక్రియను ఈ నెల 31 తేదీలోగా పూర్తి చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ ప్రక్రియ కోసం రేషన్ దుకాణాలను తెరిచి ఉంచి ఈ కేవైసీ పూర్తి చేసుకోవడానికి వచ్చే కార్డుదారులకు అవసరమైన సహకారం అందించాలని రేషన్ దుకాణ దారులను ఆదేశించారు.

## చిత్తరయ్యకాలనీలో మాజీ కార్పొరేటర్ పాదయాత్ర



**అల్వాల్, జూలై 29 (నినాదం):** ఓల్డ్ ఆల్వాల్ చిత్తారయ్య కాలనీలో పాదయాత్ర చేసిన మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి. పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సర్ కార్యక్రమ గురించి అవగాహన కల్పించుకుంటూ ఇంటింటికి తిరుగుతున్నారు. స్థానిక మౌలిక వసతులపై ప్రజలతో చర్చించి అభివృద్ధికి పాటుపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, అరుణ్,రాజేందర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రజలకు అందుబాటులోకి కిమ్స్ ఆస్పత్రి

### ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్



**అల్వాల్, జూలై 29 (నినాదం):** అల్వాల్ లోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(టిమ్స్) అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ నీ సందర్శించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్. జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 90 శాతం పనులు పూర్తి అయ్యాయని సెప్టెంబర్ అక్టోబర్ వరకు ప్రారంభిస్తామని అన్నారు. ఆసుపత్రిలో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లో ఐసీయులు ఆధునాతన డయాగ్నస్టిక్ లేబరేటరీస్ అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈ ఈ ఉషారాణి,డిఈలు వెంకటేష్, ప్రదీప్ రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు బీఎల్‌ఓలకు వేతనాలు, కనీస సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, జూలై 28 (నినాదం):** బిఎల్ఓ లు, ఎన్నికల ప్రక్రియలో భాగంగా అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి అవసరమైన వేతనాలు, ప్రోత్సాహంతో పాటు, సౌకర్యాలు అందే విధంగా కృషి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్‌లోని వాణి నగర్ ప్రాంతంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, బీఎల్ఏ ల తో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీసి తగిన వేతనాలు చెల్లించడంతో పాటు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని ఫోన్ ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి కి, మల్కాజిగిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా కి విజ్ఞప్తి చేశారు.

# ప్రమాదకరంగా ప్రధాన రహదారి

### ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పట్టించుకోని అధికారులు





**జవహర్ నగర్, జూలై 28 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ పరిధిలోని యాప్రాల్ నుండి జవహర్ నగర్ కు వెళ్లే ప్రధాన రహదారి పై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహన దారులతోపాటు పెద్ద వాహన దారులు తరచూ ప్రమాదానికి లోనవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ కు వెళ్లే ముఖ్యమైన రహదారి కావడంతో నిత్యం ఈ రహదారి వెంబడి రద్దీ ఉంటుందని అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతిరోజు వేలాదిమంది ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని వాహనదారులు, జవహర్ నగర్ యాప్రాల్ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో నమోదు చేసుకోవాలి

### సుష్మాదామోదర్ కౌన్సిలర్



**కొడంగల్, జులై 28(నినాదం):** ప్రతి ఓటరు ఎస్ఐఆర్ నమోదు చేసుకోవాలని కొడంగల్ మున్సిపల్ కౌన్సిలర్ సుష్మాదామోదర్ అన్నారు. మంగళవారం ఆమె తన వార్డులోని 238,239 పోలింగ్ బూత్ లలో ఎస్ ఐ ఆర్ నమోదు వివరాలను బిఎల్ ఓ లను తెలుసుకున్నారు. ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని సూచించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమైనదని,ఇప్పటికీ ఎస్ఐఆర్ లో నమోదు చేసుకోలేని వారు ఆగష్టు 3వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, బూత్ లెవల్ ఏజెంట్ లు బూత్ అధికారుల ద్వారా వివరాలు సేకరించి, తప్పిపోయిన వారితో మాట్లాడి, వివరాలు నమోదు చేయించాలని, ఇంకా ఆరు రోజులు మాత్రమే సమయం మిగిలిందని, ఈ ఆరు రోజులు ప్రత్యేక దృష్టిసారించి, మిగిలిన ఓటర్ల వివరాలు నమోదు చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో బిఎల్ ఓ లు మహేశ్వరి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గీతాపరాయణం



**వికారాబాద్, జూలై 28(నినాదం ):** గత కొన్ని రోజులుగా నిర్దేశించిన ఆలయాల్లో మహిళా భక్తులు గీతాపరాయణం చేస్తూ భక్తిని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కేంద్రకంలోని అలంపల్లి లోని శ్రీ బోనమ్మ గుడిలో గీతా పారాయణం సకల పాప హరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు డా, ఏ చంద్రశేఖర్ కూతురు చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డా. ఏ. చంద్రప్రియ పాల్గొన్నారు. భగవద్గీత సందేశాలను అందరితో పంచుకుని, ప్రజలందరూ ధర్మంగా జీవించాలని ఆకాంక్షించారు. భక్తి అనేది కేవలం అధ్యాత్మిక పరమైన అంశమే కాదని శారీక, మానసిక ప్రశాంతతపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. దీంతో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఓర్పు, అలవడుతోందని ఆమె చెప్పారు. ప్రతి వ్యక్తి భక్తి భావం కలిగినప్పుడు సమాజం శాంతికి నిలయంగా మారుతొందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్‌రెడ్డి మున్సిపల్ శాఖ కిందే హైడ్రా పని చేస్తోంది

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్
- సిట్టింగ్ హైకోర్ట్ జడ్జితో హైడ్రా ఆగడాలు, దోపిడీపై సత్వర విచారణ చేపట్టాలని డిమాండ్



**కుత్బుల్లాపూర్, జూలై 28 (నినాదం):** హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహార తీరుపై రాష్ట్ర హైకోర్ట్ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ మంగళవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మీడియ ముఖంగా హైడ్రా ద్వారా ప్రభుత్వం సాగించిన దురాక్రమ పాలన, హైడ్రా కమిషనర్ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొలగించాలని హై కోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయమని అధర్మం పై ధర్మం సాధించిన విజయంగా అభివర్ణించారు. హై కోర్టు తీర్పు బీ ఆర్ ఎస్ పేదల పక్షాన సాగిస్తున్న పోరాటానికి వచ్చిన ప్రతిఫలమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన హిట్లర్ పోకడలకు ఈ తీర్పు చెంప పెట్టు అన్నారు.ఏ వ్యవస్థలైన బాబా సాహెబ్ అంబెద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పని చేయాల్సిందే కానీ ఎనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం ప్రకారం కాదని, హైడ్రా కమిషనర్ ను తొలగించాలని ఇచ్చిన తీర్పు రుజువు చేసిందన్నారు. రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ కిందే హైడ్రా పని చేస్తోందని హై కోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖల మంత్రిగా కొనసాగే నైతిక అర్హతను కోల్పోయారని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్టే రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విపత్తుల సమయం లో ప్రజలకు అండగా ఉండాల్సిన హైడ్రా ప్రజలను విపత్తుల్లోకి నెడుతోందని హైడ్రా పనితీరును తప్పుపట్టారు. తమకు నచ్చిన వారికి నజరానా, నచ్చని వారికి జరిమానా అనే విధానాన్ని అమలు చేయడానికి రేవంత్ రెడ్డి హైడ్రా ను దుర్వినియోగం చేస్తున్నారు. హైడ్రా తో ప్రజలకు జరిగిన మేలు గోరంత, జరిగిన నష్టం కొండంత అని విమర్శించారు. హై కోర్టుకు సారీ చెప్పిన రంగనాథ్ తనను తొలగించాలని న్యాయస్థానం ఆదేశం ఇచ్చిన తర్వాత తన చర్యలను సమర్థించుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థను గౌరవిస్తారా, లేదంటే ఓ వ్యక్తి దుర్మార్గాలను ప్రోత్సహిస్తారా రేవంత్ రెడ్డి తేల్చుకోవాలని పేర్కొన్నారు. బుల్డోజర్ రాజ్ వైపా రూల్ బుక్ వైపా అనేది రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలని, హైడ్రా లాంటి వ్యవస్థ పేద,మధ్యతరగతి వర్గాల పాలిట హైడ్రోజన్ బాంబు లా మారిందన్నారు. కేసీఆర్ బీ ఆర్ ఎస్ అధికారం లోకి వచ్చిన వెంటనే హైడ్రా భూతాన్ని తరిమికొడతామని ,మొదటి నిర్ణయం ఇదే అవుతుందని జగిత్యాల సభలో కుండబద్దలు కొట్టినట్టు తెలిపారు. రంగనాథ్ పోయి ఇంకో రంగయ్య వచ్చినా రేవంత్ హిట్లర్ పోకడలు మానక పోతే హైడ్రా తీరు మారదు. చేసిన దుర్మార్గాలు చాలవన్నట్టు హైడ్రా కు మరిన్ని అధికారాలు కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నేతల రక్తం తో పొలాలు పండించాలన్న రేవంత్ రెడ్డి హైడ్రా తో ప్రజల రక్త మాంసాలు కండ్ల జూస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనకు హిట్లర్ ఆదర్శమన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్ప ఈ దేశం లో ఎవరైనా ఉన్నారా? రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతూ నీతులు చెబుతారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న రేవంత్ రెడ్డి పై రాహుల్ గాంధీ మౌనం అనేక అనుమానాలకు తావిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్ గా అభివర్ణించారు.రేవంత్ బ్లాక్ మెయిల్ కు రాహుల్ గాంధీ కూడా భాదితుడిగా మారి రాష్ట్రం లో రాక్షస పాలన నడుస్తున్నా ధృతరాష్ట్రుడిలా మారిపోయారా ? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అధికారం లోకి వస్తే జెన్ జీ తరానికి విద్యాశాఖ మంత్రిగా భాద్యతలు అప్పగిస్తామని రేవంత్ చెప్పడం మిలీనియం జోక్ అన్నారు. రాహుల్ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి మంత్రులను నియమిస్తాడా, ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత అన్నట్టు ఉంది రేవంత్ వ్యవహార శాలి అని రేవంత్ రెడ్డి పరిపాలనను దుయ్యబట్టారు.విద్యా శాఖ మంత్రిగా రేవంత్ విఫలమయ్యారు, జెన్ జీ మీద అంత ప్రేమ ఉంటే తన స్థానం లో 30 యేండ్ల లోపున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ను విద్యా శాఖ మంత్రిగా నియమించొచ్చు కదా అన్నారు.రోజుకో డ్రామా ,దినానికో డైవర్షన్ తో రేవంత్ రెడ్డి ప్రజలను మభ్య పెట్టాలనుకుంటున్నారు. ప్రజలకు రేవంత్ మాయ మాటలన్నీ అర్థమై పోయాయి ఇక మసిపూసి మారేడు కాయ చేస్తానంటే కుదిరే కాలం పోయిందని వాపోయారు.హైడ్రా కమిషనర్ పై హైకోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైంది.హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొమ్మిది తలల సర్పమని హై కోర్టు అంటే రేవంత్ రెడ్డి ని పది తలల రావణుడని ప్రజలు అంటున్నారని ఎమ్మెల్యే విమర్శించారు.రేవంత్ రావణ పాలన పోవడం ఖాయం కేసీఆర్ రాముడి పాలన రావడం తథ్యమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద వివరించారు.

## వారాంతపు అంగడి రోజును మార్చొద్దు



**జిన్నారం, జులై 28 (నినాదం):** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో వారాంతపు అంగడి బుధవారంను మార్చొద్దంటూ వర్తక సంఘం సభ్యులు,మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ముదిరాజు కి మరియు కమిషనర్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. వర్తక సంఘం సభ్యులు మాట్లాడుతూ వారానికి ఒకసారి జరిగే అంగడి మార్చడం వలన మా వ్యాపారాలు దెబ్బతింటాయని అందరికీ సొంత భవనాలలో షాపులో లేనందున మేము అద్దెకు తీసుకున్న వారికి కిరాయిలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉన్నందున ఇప్పటికే జిన్నారం మండలం నుండి గుమ్మడిదల మండలం విడిపోయి గ్రామాలలో అంగళ్ళు పెరిగిపోయి జిన్నారంలో వ్యాపారాలు బాగా నడవడం లేదని అంగడిని మార్చడం వల్ల మా వ్యాపారాలు పూర్తిగా నష్టపోతామని వ్యాపారస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ నరేందర్ రెడ్డి స్పందిస్తూ కొద్ది మార్పులతో అంగడిని కొనసాగిస్తామని మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ ముదిరాజ్, కమిషనర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు వెంకటేష్ గౌడ్ నిరంజన్ రెడ్డి ,మార్వాడి సురేందర్, నవీన్ రెడ్డి ,ఫణి భూషణ్ గుప్త,బాలగౌడ్ ,రాజ్ కుమార్, రాజు గౌడ్ ,మొబైల్ చిన్న, హరి సతీష్, శ్రవణ్ గ్రామస్తులు శ్రీనివాస్ గౌడ్ ,శ్రీధర్ గౌడ్ ,బ్రహ్మేందర్ గౌడ్ ,నిఖిల్ పాల్గొన్నారు.

## ఆమనగల్లు మున్సిపాలిటీలో సర్వే ప్రక్రియ



**ఆమనగల్లు, జూలై 28(నినాదం):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు 190వ బూత్‌లో ప్రముఖ సంఘ సేవకులు, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ నిర్వహించారు. బూత్ లెవల్ ఆఫీసర్ స్వాతి సమక్షంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు జంతుక కిరణ్, చలిచీమల సతీష్, కోరే రవి, వస్పుల శ్రీరామ్, అనిల్, ఏకుల కార్తీక్, దార భరత్, గోరటి భరత్, లక్మల్ల శివ, లండం శివతో పాటు స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

- ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు ప్రక్రియపై వినతి



**రాజేంద్రనగర్, జులై 28 (నినాదం):** నార్సింగి సర్కిల్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' , ఓటర్ల నమోదు ప్రక్రియపై బి ఆర్ ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధి బృందం డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా బిఎల్ఓలు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి విధుల పురోగతిపై అధికారులు, నాయకుల మధ్య చర్చ జరిగింది. ఇప్పటివరకు దాదాపు 50 శాతం మేరకే నమోదు పనులు పూర్తయ్యాయని, ఇంకా అనేకమంది అర్హులైన పౌరుల ఓట్లు నమోదు కాకపోవడంపై విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రక్రియను వేగవంతం చేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలు కేవలం తెలుగులోనే ఉండటం వల్ల మైనారిటీలకు పూర్తి అవగాహన లభించడం లేదని తెలిపారు. తెలుగు సరిగా రాని మైనారిటీ ప్రజల సౌకర్యార్థం ఈ వివరాలను ఉర్దూలోకి అనువదించి అందుబాటులో ఉంచాలని కోరారు. మున్సిపల్ పరిధిలో అత్యధికంగా నివసిస్తున్న అద్దెదారుల ఓట్ల నమోదును ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటారనే అంశంపై డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడి స్పష్టత కోరారు.

ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా ముందస్తు జాగ్రత్తగా ఎక్కడా నకిలీ, తప్పుడు ఓట్లు నమోదు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ముక్తార్, నాయకులు పెద్దపులి కిషన్, గణేష్ ముదిరాజ్, నరసింహ, మల్లేష్, గణేష్ రెడ్డి, చిరంజీవి, మహిపాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హెపటైటిస్‌పై చైతన్యమే శ్రీరామరక్షణ

### ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన

**అల్వాల్, జులై 28 (నినాదం):** ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోడిస్టిక్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్ పాల్గొని అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. హెపటైటిస్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం, సకాలంలో పరీక్షలు, చికిత్సలు పొందేలా ప్రోత్సహించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా డిఎంహెచ్వో ఆనంద్ పేర్కొన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు బ్యానర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెపటైటిస్ లక్షణాలు, వ్యాప్తి, నివారణ మార్గాలు, పరీక్షల అవసరం, అందుబాటులో ఉన్న చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్ శ్రీకాంత్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లావణ్య ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి డాక్టర్ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, భయాలు, అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని వైద్య అధికారులు సూచించారు. సకాలంలో గుర్తింపు, చికిత్సతో హెపటైటిస్‌ను సమర్థంగా నియంత్రించవచ్చని ఆయన తెలిపారు.



# గురుపౌర్ణమికి కొండగట్టు గిరి ప్రదక్షిణ భక్తులకు ఆహ్వానం

**రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం నిర్వహణ రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని**

**నారాయణపూర్ ప్రాజెక్టు ముంపుకు గురయ్యే ప్రతి ఇంటికి న్యాయమైన పరిహారం అందజేస్తాం : ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం పిలుపు**

**కరీంనగర్, జూలై 28(నినాదం)**

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 5 గంటలకు శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరి సంక్షేమం కోసం ఈ గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇది ఏ రాజకీయ పార్టీ, మతం లేదా వర్గానికి సంబంధించిన కార్యక్రమం కాదని, ఆధ్యాత్మిక కార్యక్రమంగా మాత్రమే చూడాలని సూచించారు.కొండగట్టు క్షేత్రం ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి సౌందర్యానికి నిలయమని,



నరసింహ, శివ స్వరూపాల సమ్మేళనంగా ఆంజనేయ స్వామి విగ్రహం దేశంలోనే అరుదైనదని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు కొండగట్టుకు వస్తారని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ, బాసర, కాళేశ్వరం, ధర్మపురి, కొండగట్టు వంటి ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నారాయణపూర్ రిజర్వాయర్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, ప్రాజెక్టు పూర్తయ్యాక ముంపునకు గురయ్యే ప్రతి ఇంటికి న్యాయమైన పరిహారం అందజేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన 40 ఇళ్లకు పరిహారం చెల్లించకపోయినా, తమ ప్రభుత్వమే వారికి పరిహారం అందించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజల సహకారంతో తిప్పికొడతామని చెప్పారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మాజీ వర్కింగ్ అధ్యక్షుడు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, చొప్పదండి సహకార పరపతి సంఘం చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, గంగన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్ దూరదృష్టితోనే
# కల్యాణ లక్ష్మి పథకం

**కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం అందించాలి**

**చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**జమ్మికుంట, జూలై 28 (నినాదం)**

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితోనే కల్యాణ లక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారని ప్రతి పేదింటి ఆడబిడ్డకు మేనమామ కానుకగా లక్ష రూపాయలను అందించి వారి కుటుంబాలకు అండగా నిలిచారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని వీణవంక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన దూరదృష్టి తోని ప్రతి పేదింటి ఆడపిల్ల పెళ్లికి కానుకగా లక్ష 116 రూపాయలను అందించాలని సంకల్పించి కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మరిచిపోయారని కల్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తానని ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చడం లేదని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం కల్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన విమర్శించారు. రైతులు మహిళలు పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలని ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి మాజీ జెడ్పిటిసి మాడ వనమాల సాధవరెడ్డి తోపాటు పలువురు బిఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ

**మల్లారెడ్డిపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభం**

**జమ్మికుంట, జూలై 28 (నినాదం)**

వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ మాధవి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేరాల రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, మాల్ఖానా, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని ఏసీపీ పేర్కొన్నారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏసీపీ మాధవి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ మరియు అత్యవసర పరిస్థితుల్లో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు జరగాలని పిలుపునిచ్చారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ ,వీణవంక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఆవుల తిరుపతి , పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.




# ఓరియంటేషన్ శిక్షణకు తరలిన మున్సిపల్ కౌన్సిలర్లు

**జమ్మికుంట, జూలై 28 (నినాదం)**

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ , ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంయుక్త నిర్వహణలో జమ్మికుంట మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులకు ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.హైదరాబాద్ గచ్చిబౌలిలోని సెంచరీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ శిక్షణకు జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హాజరయ్యారు పట్టణాల సమగ్ర అభివృద్ధి, మున్సిపల్ పాలనలో మెరుగైన సేవలందించడం, మౌలిక వసతుల కల్పనపై ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఎన్ ఐ యు ఎం డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్, మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం, మున్సిపల్ నిబంధనలపై వారు ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జమ్మికుంట కౌన్సిలర్లు ఫిరోజ్, సురేష్, విష్ణు, చంద రాజు, తూర్పాటి చందన, రాజు, తిరుపతి, రాము, అశోక్, యాట్ల సునీతతో పాటు ఇతర కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ బిల్లు ఆమోదంలో
# జైపాల్ రెడ్డి కీలక పాత్ర

**ప్రజాస్వామ్య విలువలకు అంకితమైన మహానేతగా జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం**

**ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు పోలాడి రామారావు**

**కరీంనగర్, జూలై 28(నినాదం)**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో కేంద్ర మాజీ మంత్రి కీ.శే. ఎస్. జైపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు.మంగళవారం కరీంనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జైపాల్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రామారావు మాట్లాడారు. అప్పటి యూపీఏ ప్రభుత్వ పెద్దలను ఒప్పించి తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు జైపాల్ రెడ్డి విశేష కృషి చేశారని తెలిపారు.అనర్గళ ప్రసంగాలతో పార్లమెంట్‌లో అన్ని పార్టీల నాయకుల ప్రశంసలు అందుకుని ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆయన ఎప్పుడూ ముందుండేవారని,



అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పదవీచ్యుతి అనంతరం ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు మంజూరులోనూ ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. నేటి యువత జైపాల్ రెడ్డి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంబటి జోగిరెడ్డి, రొంటాల కేశవరెడ్డి, సంధ్యారాణి, జిల్లా అంజయ్య, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అసైన్డ్ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి

**ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్**

**కరీంనగర్, జూలై 28(నినాదం)**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 574లో ఎస్సీ, ఎస్టీ పేదలకు కేటాయించిన సుమారు 15 ఎకరాల అసైన్డ్ భూమిని 'జ్యోతిష్మతి విద్యాసంస్థలు' (శాలిని ఎడ్యుకేషనల్ ట్రస్ట్) అధినేత జె. సాగర్ రావు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆరోపించారు.ఈ భూముల ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై 2007లోనే తహసీల్దార్ స్థాయి నుంచి హైకోర్టు వరకు భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు వచ్చినప్పటికీ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ అమలు కాలేదని ఆయన విమర్శించారు.ఈ వ్యవహారంపై బండారి శేఖర్ 2025 డిసెంబర్ 8న జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, కమిషన్ విచారణ అనంతరం ఫిర్యాదు ప్రతిని కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అలాగే చేపట్టిన చర్యల నివేదికను ఆంగ్లంలో అనువదించి నాలుగు వారాల్లో కమిషన్‌కు సమర్పించాలని అధికారులను ఆదేశించింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలను వెంటనే అమలు చేసి, ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని అసలు లబ్ధిదారులకు అప్పగించాలని బండారి శేఖర్ డిమాండ్ చేశారు.



# మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## మున్సిపల్ సిబ్బందికి మొక్కలు పంపిణీ చేసిన చైర్ పర్సన్

**జమ్మికుంట, జూలై 28 (నినాదం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వన మహోత్సవంలో భాగంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రెంటాల సుహాసిని మున్సిపల్ కార్మికులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భావితరాల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. జీవకోటికి ప్రాణాధారం మొక్కలే అని స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమం ఒక యజ్ఞంల నిర్వహించాలని ఇది మన అందరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం మేనేజర్ భూపాల్ రెడ్డి సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ ఇన్చార్జి రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ సీనియర్ నాయకులు వాణి ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పి వినయ్ తో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క ఓటు మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఓలదే

**100% ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి... బిఎల్ఓబిఎల్ఏలకు సూచించిన కాంగ్రెస్ నేత దేశిని కోటి**

**జమ్మికుంట, జూలై 28 (నినాదం)**

సర్ ప్రక్రియ సమయం దగ్గర పడుతుందని ఎట్టి పరిస్థితుల్లో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా బి ఎల్ ఓ బి ఎల్ ఏ లు జాగ్రత్తలు తీసుకొని 100% ఓటర్ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని బి ఎల్ ఓ బి ఎల్ ఏ లకు సూచించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ లిస్టులో నమోదు చేయాలని సర్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ను ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని వారికి తెలిపారు. సర్ గడువు దగ్గర పడుతుందని ఆగస్టు 3 వరకు 100% ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓటు హక్కును కోల్పోయే విధంగా విధులు నిర్వహించవద్దని వారికి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును సర్ లో చేర్చి వారి ఓటును రక్షించాల్సిన బాధ్యత మనదే అని వారికి తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ బి ఎల్ ఏ లతోపాటు 204 బూత్ అధ్యక్షులు మడి పోజు నాలుగవ వార్డు అధ్యక్షులు టెంకురాల కిషోర్ 205 బూత్ అధ్యక్షులు ఆడెపు దేవరాజ్ శివ తదితరులు పాల్గొన్నారు.





## నగరపాలక సంస్థ పరిధిలో
# ఘనంగా ప్రారంభమైన వన మహోత్సవం

**మూడు లక్షల మొక్కల పంపిణీ, లక్ష మొక్కల నాటడమే లక్ష్యం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, జూలై 28(నినాదం)**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని 53వ డివిజన్ సాయినగర్‌లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సాయినగర్‌లో సుమారు 500 మొక్కలను నాటారు. నగరంలోని ప్రతి ఇంటికి రెండు చొప్పున పూల లేదా పండ్ల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు, మొత్తం మూడు లక్షల మొక్కలను ప్రజలకు అందజేసి, వివిధ డివిజన్లలో మరో లక్ష మొక్కలను నాటాలని నగరపాలక సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం మొక్కల పెరుగుదలకు అనుకూల సమయమని, ప్రజల భాగస్వామ్యంతో కరీంనగర్‌ను పరిశుభ్ర, హరిత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంపెల్లి శ్వేత రమణ్, వంగల పవన్ కుమార్, కాలనీ సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, స్థానికులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో ఘనంగా జగన్నాథ రథయాత్ర, పండరీపుర యాత్ర వేడుకలు

**భారతీయ సంస్కృతి, భక్తి, సమానత్వ విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యం**

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, జులై 28(నినాదం)**

భగత్‌నగర్ అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జగన్నాథ రథయాత్ర, పండరీపుర యాత్ర వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి భారతదేశం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్నాథ రథయాత్ర దేశంలోని అత్యంత ప్రాచీన, వైభవోపేత హిందూ ఉత్సవాల్లో ఒకటని తెలిపారు. ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను మహారథాలపై ఊరేగించే ఈ మహోత్సవం భక్తి, సమానత్వం, సేవాభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ఈ యాత్రలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తారని, భక్తులకు దైవానుగ్రహం, పుణ్యఫలం లభిస్తాయని విశ్వాసమన్నారు.పండరీపుర యాత్ర కూడా భక్తి, వినయం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, కులమత భేదాలకు అతీతంగా లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు. పాండురంగ స్వామిని



శ్రీమహావిష్ణువు అవతారంగా భక్తులు ఆరాధిస్తారని, ఆషాఢ, కార్తీక ఏకాదశి సందర్భంగా ఈ యాత్రకు విశేష ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనాల పండుగ విశిష్టతను వివిధ వేషధారణలతో చక్కగా ఆవిష్కరించారు. ముఖ్యంగా లష్కర్ బోనాల సంప్రదాయాన్ని ప్రతిబింబించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.పాఠశాల నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు నిర్వహించిన జగన్నాథ రథయాత్ర ఊరేగింపు భక్తి నినాదాలతో సాగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ గడ్డ.. ఈటెల రాజేందర్ అడ్డా

## జమ్మికుంటలో ఘనంగా ఈటల దంపతుల పెళ్లి రోజు వేడుకలు

**రాజేందర్ అన్న రాక కోసం ఎదురు చూస్తున్న ప్రజలు... బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు**

**జమ్మికుంట, జూలై 28 (నినాదం)**

మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు బిజెపి నాయకులు మాజీ మంత్రి ఈటల రాజేందర్ జమున దంపతుల పెళ్లిరోజు వేడుకలను జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈటల రాజేందర్ జమున ల పెండ్లి రోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, జమ్మికుంట పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు జీడీ మల్లేష్,పట్టణ ఉపాధ్యక్షుడు కొమ్ము అశోక్ లు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల నేతగా ఈటల రాజేందర్ కి తెలంగాణాలో మంచి పేరు ప్రతిష్టలు ఉన్నవని బీజేపీ నాయకులు కొనియాడారు. అనునిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే వ్యక్తి ఈటల అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఈటల రాజేందర్ పాత్ర ఎనలేనిదని నాయకులు గుర్తు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈటల రాజేందర్ ఎనలేని సేవ చేసి, హుజురాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచాడని వారు కితాబిచ్చారు. హుజురాబాద్ నియోజకవర్గం లో ఎవరికి ఏ ఆపద వచ్చిన గుర్తొచ్చే వ్యక్తి ఈటెల రాజేందర్ అని, ప్రతి ఇంటిలో ఈటలను పెద్దకొడుకు లాగ బావిస్తారని తెలిపారు. ఈటల రాజేందర్ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈటల పైన అసత్యపు ఆరోపణలతో పార్టీ నుండి వెళ్లగొట్టాడని, అప్పుడు ఈటల రాజేందర్ సతీమని జామునమ్మ అతనికి అండగా ఉండి ప్రెస్ మీట్ పెట్టి అధర్మానికి వ్యతిరేకంగా మీరు కొట్లాడండి మీకు నేను కష్టపడి డబ్బులు సంపాదించి ఇస్తానని చెప్పి చెప్పిన గొప్ప వ్యక్తి జమునమ్మ అని గుర్తు చేశారు. 2021లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి,ప్రజలను అనేక రకాల ప్రలోభాలకు గురి చేసిన హుజురాబాద్ ప్రజలు మాత్రం ధర్మం వైపు నిలబడి ఈటల రాజేందర్ కి అండగా నిలబడి గెలిపించుకున్నారని ఆ గెలుపు చారిత్రాత్మకమైనదని అన్నారు. అలాంటి నాయకున్ని 2023 లో జరిగిన ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి కుటుంబం చేసిన సెంటిమెంట్ బ్లాక్ మెయిల్ లోపడి ఓడగొట్టుకొని ఈ ప్రాంత ప్రజలు చాలా బాధపడుతున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఇప్పటికీ హుజురాబాద్ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ చేసిన అభివృద్ధి కనపడుతుంది తప్ప ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసింది శూన్యమని అన్నారు.ఇప్పటికి హుజరాబాద్ నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఈటల రాజేందర్ ఇంటి తలుపు తడుతున్నారని,మళ్ళీ ఈటల రాజేందర్ హుజురాబాద్ కు రావాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని నాయకులు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజేపీ అధికారం రావడంలో ఈటల రాజేందర్ ప్రముఖ పాత్ర పోషించే విధంగా భగవంతుడు ఆయనకు శక్తిని ఇవ్వాలని కోరారు. రాజేందర్ జమునల దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో, నిండు నూరేండ్లు వుండాలని దేవున్ని ప్రార్థించారు.ఈ కార్యకమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావుతో పాటు జీడి మల్లేష్,కొమ్ము అశోక్, ఇల్లందకుంట మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పల్లపు రవి,పోడేటి అనిల్ సర్పంచులు గట్టు వీరన్న గౌడ్, గరిగంటి శ్రీధర్, అంబరగొండ బాపురావు,బిజెపి నాయకులు కట్కూరి నర్సిరెడ్డి,మేకల సుధాకర్ రెడ్డి, మైనార్టీ నాయకుడు నస్సిరోద్దీన్ బీజేపీ



నాయకులు గాదె మహేష్, రాచపల్లి వెంకటేష్,ఆరెల్లి భాస్కర్, చింతల మహేందర్ కోరే రవీందర్,మేదరి రవీందర్, పరశురాం గౌడ్,గండికోట సమ్మయ్య, పసునూటి శివ, లకిడే రాజు,పనికారి రమేష్,ఉడుగుల మహేందర్, మురికి మహేష్,,కొండపర్తి ప్రవీణ్,ముకుంద సుధాకర్, బుర్ర కుమార్, నాయిర్నేని రమేష్,బొజ్జ శరత్, మల్లాడి సమ్మి రెడ్డి,సుంకరి శ్రీనివాస్,శనిగరపు రవి, సమ్మయ్య,కొండ్ల నగేష్ మోతే అర్జున్, సంతోష్, పర్లపెల్లి శ్రీనివాస్,కుక్కల రమేష్, ఎదులాపురం అశోక్,పసునూటి మల్లికార్జున్,పంజాల సంతోష్ గౌడ్, నాగపురి విజయ్,చంద సంతోష్ అప్పాల రవీందర్,తాళ్లపల్లి పాని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో సాగయ్యే పంటలను రైతులు సాగు చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, జూలై 28, (నినాదం):** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. వ్యవసాయ శాఖ నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రైతులు, వ్యవసాయ అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో 'రైతు నేస్తం' కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని, ఆధునిక సాంకేతికత, నీటి యాజమాన్య పద్ధతులను అనుసరించాలని ఆమె సూచించారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలతో పాటు ఎరువుల సకాల సరఫరా కోసం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. 100వ ఎపిసోడ్ సందర్భంగా నిరంతరం కార్యక్రమానికి హాజరైన ప్రగతిశీల రైతులను సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తక్కువ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు పెసర, కందులు, నువ్వులు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులు రైతులకు నేరుగా సలహాలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఇంకా సాగు చేయని భూములను ఖాళీగా ఉంచకుండా తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పంటల సాగు రైతులకు ఆదాయాన్ని అందించడంతో పాటు భూసారాన్ని కూడా మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. రైతులకు అనువైన పంటల వివరాలను రైతు వేదికల వద్ద ప్రదర్శనల ద్వారా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రగతిశీల రైతులను సన్మానించి, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి..



- జలసిరి పనులు వేగవంతం చేయాలి
- జడ్పీ సీఈవో శిరీష

**కోదాడ, జూలై 28(నినాదం):** అనంతగిరి మండల ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జడ్పీ సీఈవో శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలసిరి పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు గ్రామాభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా మండలంలోని పలు అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుష్మ, ఏవో అందె సతీష్, వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జలసిరితో రైతులకు సాగునీటి భరోసా



**నూతనకల్, జూలై 28(నినాదం):** ఎల్ నినో నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు అధిగమించేందుకు భూగర్భ జలాలు పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్డీఏ పీడీ సన్యాసయ్యా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు,ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఏఎంసీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ వీబీజీరాంజీ పథకంలో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతలు,ఊర,పంట కుంటల తవ్వకాలు చేపట్టాలన్నారు. బావులు,బోర్ల రీఛార్జి కుంటలు నిర్మించేందుకు చొరువచూపాలన్నారు. ఎల్ నినో ప్రభావం కారణంగా రైతులు వరికి బదులు ప్రయత్నం పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, ప్రత్యేక అధికారి భారతి,తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, సర్పంచులు,వివిధ శాఖ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన



**కోదాడ,జూలై 28(నినాదం):** అనంతగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా సహకార అధికారి (డీసీఓ) శ్రీరామ్ పరిశీలించారు. గోదాం నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు, స్థల అనుకూలతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కమలాకర్, ఆర్ఐ వెంకట నాగేష్, సీఈఓ సైదులు, జిల్లా సహకార సంఘం జూనియర్ అసిస్టెంట్ అంబేద్కర్, దేగ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాంరెడ్డి పల్లి సర్పంచ్‌కు సన్మానం



**మునుగోడు, జూలై 28 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల అభివృద్ధి అధికారి (ఎండిఓ) కార్యాలయంలో ఎండిఓ ఆధ్వర్యంలో, రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, ఉమ్మడి నల్గొండ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీ లపంగి నర్సింహా కి జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు -- 2026 అందుకున్న సందర్భంగా ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ రాజ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ టీచర్లు, అధికారులు, సిబ్బంది మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని లపంగి నర్సింహాని ఘనంగా అభినందించారు. జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకోవడం మా రాంరెడ్డిపల్లి గ్రామానికే గర్వకారణమని గ్రామ ప్రజలన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**రేవల్లి, జులై 28 (నినాదం):** ఏదుల మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రక్రియను ఏదుల మండల ఇన్‌చార్జి కోళ్ల వెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పందెం సుఖేందర్ రెడ్డి పరిశీలించారు. బీఎల్ఏ ఇన్‌చార్జి రామచందర్, గొల్లపల్లి సర్పంచ్ సంతోషమ్మ, కృష్ణయ్య, శేఖర్ రావు, భాస్కర్ రావు ఆధ్వర్యంలో అధికారులు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించి, నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

**భూపాలపల్లి, జూలై 28 (నినాదం):** భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు నేస్తం" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు బాగా లేనందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీటి సౌకర్యాలు, సాంకేతిక సలహాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి, అధిక దిగుబడులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం,ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలనినో ప్రభావం వలన వర్షాలు కురవడంలేదని రైతులు ఇట్టి విషయాన్ని గమనించాలని వ్యవసాయ శాఖ అధికారులు ఇస్తున్నటువంటి సూచనలను పరిగణలోకి తీసుకొని, వారు సూచించినటువంటి పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. గణపురం మండలంలోని రైతులు తొందరపడి వరి నాట్లు వేయకూడదని, ఘనపసముద్రం చెరువులో నీరు లేనందున రైతులు గమనించాలని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ శాస్త్రీయ విధానాల్లో సాగు చేసి అధిక దిగుబడులు,లాభాలు పొందాలని కోరారు. రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, రైతులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- సర్పంచ్ ఏసు మల్ల వీరలక్ష్మి పాపయ్య



**హుజూర్నగర్ (మఠంపల్లి), జూలై 28 (నినాదం):** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని మఠంపల్లి సర్పంచ్ ఏసుమల్ల వీరలక్ష్మి పాపయ్య అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మఠంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు హరితహారం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తపల్లి శౌరి, ఏపీఓ ఉమా, ఏఈఓ శ్రావ్యాంజలి, త్రివేణి, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జోసు, ఏసు మల్ల రాములు, వీరబాబు, మల్లారావు, పోలీస్ శాఖ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు అభినందనీయం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 28(నినాదం):** వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం కలెక్టర్ గుర్రంపేట గ్రామంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో పంట మార్పిడి విధానంలో చేపట్టిన కంది సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకున్న ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడనున్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని, రైతులు అవగాహనతో పంట మార్పిడి చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ఏ పంటలు సాగు చేశారు? ఈ ఏడాది ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపడానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడి, మారుతున్న వాతావరణ పరిస్థితులపై గ్రామంలోని ఇతర రైతులకు కూడా అవగాహన కల్పించి వారు కూడా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఎక్కువ లాభాలనిచ్చే ఆరుతడి మరియు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు నిరంతరం తగిన మార్గదర్శనం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ బసవరాజుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా యాదగిరి, మార్త రమేష్, బోర రాజయ్య క్షేత్రాల్లో చేపట్టిన కూరగాయలు, అంతర పంటల సాగును కలెక్టర్ ప్రత్యేక్షంగా పరిశీలించారు. కూరగాయలు దిగుబడి, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాల గురించి రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో, తక్కువ సమయంలో మంచి ఆదాయం పొందేందుకు అంతర పంటల సాగు లాభదాయకమని తెలిపారు. ?ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన అధికారి తిరుపతి, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఇతర అధికారులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ నిర్లక్ష్యంతో నీటి వృథా

- చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**మోటకొండూరు, జూలై 28(నినాదం):** మోటకొండూరు మండల కేంద్రంలో గ్రామ బస్టాండ్ వెనకాల పాల సెంటర్ వద్ద గ్రామ పంచాయతీ తాగునీటి పైప్‌లైన్ నుంచి నీరు నిరంతరం లీక్ అవుతూ రోడ్డుపై వృథాగా పారుతోంది. దీంతో విలువైన తాగునీరు వృథా కావడంతో పాటు రోడ్డంతా బురదగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో వర్షాలు లేక సాగు నీరు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే, ఉన్న త్రాగు నీరైన ప్రజలకు అందుబాటులో ఉండాలని చూస్తుంటే వృధాగా పోతున్న నీరుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే, త్రాగునీరు కూడా ఇలా రోడ్డుపై వృధాగా పోతున్న కూడా పట్టించుకోకుండా మాకే సంబంధం లేనట్టు అధికారులు వ్యవహరిస్తురని గ్రామస్తులు వాపోతున్నారు. స్థానికులు పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీ కారణంగా రహదారి దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని వారు చెబుతున్నారు. తాగునీటిని ఆదా చేయాల్సిన సమయంలో ఇలా నీరు వృథా కావడం బాధాకరమని గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని మరమ్మతు చేసి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నీటి పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై వృథాగా పారుతున్న నీటిని పరిశీలిస్తున్న తెలంగాణ రక్షణ సేన భవన మరియు ఇతర నిర్మాణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి గణేష్, స్థానిక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**ఆలేరు, జూలై 28(నినాదం):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మంగళవారం ఆలేరు మండలం కొలనుపాక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ (ఎఫ్ ఆర్ ఎస్) ద్వారా పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిశుభ్రతను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, భవిష్యత్ లక్ష్యాలపై ప్రశ్నించి, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతిరోజూ శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం



**సూర్యాపేట ప్రతినిధి, జులై 28 (నినాదం):** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశానుసారం జిల్లా కేంద్రంలోని 39 వ వార్డులో మంగళవారం స్థానిక కౌన్సిలర్ దంతాల సాయి ప్రియ సందీప్ ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు . నేత్ర వైద్య నిపుణులు జనార్ధన చారి, జూనియర్ డాక్టర్ లిసి, కావ్య వైద్య పరీక్షలు నిర్వహించి శాస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపడతామని వైద్య బృందం తెలిపింది . ఈ సందర్భంగా కౌన్సిలర్ దంతాల సాయి ప్రియ సందీప్ మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలకు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో వెంపటి సురేష్, రఫీ, సత్యనారాయణ, మహేష్, నరేష్,జగదీష్, చిన్న, వేణు, జానీ, అంతటి వెంకటేష్, దినేష్, శ్రీను,శివ, శైలేష్, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో బీఆర్ఎస్ అంతర్గత పోరు

- రాజకీయాలు హీటెక్కిన వేళ మధుసూదనాచారిపై విమర్శలు తగవు
- లేకుంటే రాజకీయంగా బదులిస్తాం
- బిఆర్ఎస్ ఉద్యమకారులు



**భూపాలపల్లి జూలై 28 ( నినాదం):** మాజీ శాసన సభాపతి, బిఆర్ఎస్ సీనియర్ నేత సిరికొండ మదుసుదనాచారి పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, లేకుంటే రాజకీయంగా తగిన సమాధానం ఇస్తామని టిఆర్ఎస్ ఉద్యమకారులు, నాయకులు హెచ్చరించారు. భూపాలపల్లి లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని వారు తీవ్ర విమర్శలు చేశారు. మధుసూదనా చారి ఉద్యమ నాయకుడని, ఆయన రాజకీయ భవిష్యత్తుపై పార్టీ అధిష్టానం, కేసీఆర్,కేటీఆర్, నిర్ణయమే ప్రకారంగా తుది నిర్ణయం అని స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని, అలాంటి నాయకుడి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఉద్యమ చరిత్రను అవమానించడమే న న్నారు. భూపాలపల్లి అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని, మదుసూదనాచారి ప్రజల కోరిక మేరకే రాజకీయాల్లో చురుకుగా ఉండాలని పేర్కొన్నారు. గండ్రవర్గం అభద్రత భావంతోనే విమర్శలకు దిగుతుందని ఆరోపిస్తూ అవసరమైతే ప్రజాక్షేత్రంలోనే తగిన గుణపాఠం ఇస్తామని హెచ్చరించారు.

**వేడెక్కుతున్న భూపాలపల్లి రాజకీయాలు**

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ భూపాలపల్లి బిఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వర్గాల మధ్య మాటల యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. ఒకే పార్టీలోని రెండు వర్గాలు పరస్పర విమర్శలు చేసుకోవడంతో భూపాల పల్లి రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయి.

## చెరువులో చేపల మృతి

- చెరువు నీటికి దూరంగా ఉండాలంటూ డబ్బు చాటింపు



**భూపాలపల్లి రూరల్, జులై 28 ( నినాదం):** భూపాలపల్లి మండలం కమలాపూర్‌లోని పెద్ద చెరువులోని భారీ సంఖ్యలో చేపలు మృతి చెందడం స్థానికంగా ఆందోళనకు గురి చేసింది. ఒక్కసారిగా చెరువులో చేపలు తేలడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యా. చేపల మృతికి గల కారణాలు ఇంకా తెలియకపోవడంతో ముందు జాగ్రత్త చర్యగా చెరువు నీటిని మనుషులు, పశువులు దూరంగా ఉండాలని గ్రామంలో డప్పు చాటింపు నిర్వహించారు. చెరువు పరిసరాలకు వెళ్ళవద్దని గ్రామ పెద్దలు హెచ్చరించడంతో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఘటన పర్యావరణ, ప్రజా ఆరోగ్యపరంగా ఆందోళన కలిగిస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చేపల మృతి గల అసలు కారణాలను శాస్త్రీయంగా నిర్ధారించి,నివేదిక వెల్లడించడంతోపాటు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి

- కోదాడ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కోదాడ ప్రతినిధి (సింగిడి):** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఇందులో భాగంగానే కోదాడ 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కోదాడ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోదాడ 100 పడకల ఆసుపత్రిని నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడొద్దని నాణ్యతలో ఏమైనా తేడాలు ఉంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా మెట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాల న్నారు. ఆస్పత్రికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ఆసుపత్రుల్లో గర్భిణిలకు సాధారణ ప్రసవం జరిగేలా చుడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, ఆస్పత్రి సూపర్డెంట్ దశరథ నాయక్, తహసిల్దార్ సంతోష్ కిరణ్ , డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన గిరిజనులకు పింఛన్ మంజూరు పత్రాలు పంపిణీ

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 28(నినాదం) :** తెలంగాణ జీవనోపాధుల పథకం కింద అర్హులైన గిరిజనులకు వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో తిర్యాణి, లింగాపూర్ మండలాల్లో ఎంపికైన గ్రామాల లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకు 100 శాతం పింఛన్లతో పాటు జాబ్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ, చిన్నారులకు పూర్తి స్థాయిలో టీకాలు, ఆహార భద్రతా కార్డుల మంజూరు, నైపుణ్య శిక్షణ, ఆర్థిక అక్షరాస్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డీపీఎం రామకృష్ణ, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఉచిత డ్రైవింగ్ శిక్షణతో యువతకు ఉపాధి బాట

నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ఆర్జీ-2 ఏరియా జీఎం బండి వెంకటయ్య

శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ



**యైటింక్లయిన్ కాలనీ, జులై 28, (నినాదం):** సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు యువతకు బాసటగా నిలుస్తాయని రామగుండం -2 ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య అన్నారు. అర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో రెమిడియేషన్ ప్లాన్-నేచురల్ కమ్యూనిటీ రిసోర్సెస్ అగ్మెంటేషన్ ప్లాన్ నిధులతో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా వీర్లపల్లి, విట్టల్‌నగర్, రమేష్‌నగర్ తదితర ప్రభావిత ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు నిర్వహించిన ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ విజయవంతంగా పూర్తయింది. జీడీకే-7 ఎల్ఈపీ గని ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు డ్రైవింగ్ లైసెన్సులను జీఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సింగరేణి సంస్థ ఉద్యోగ కల్పనతో పాటు యువతలో నైపుణ్యాలను పెంపొందించి స్వయం ఉపాధి అవకాశాలు విస్తరించే దిశగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. శిక్షణలో నేర్చుకున్న డ్రైవింగ్ నైపుణ్యాలను సమర్థంగా వినియోగించుకొని ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతమైన డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం మాలోత్ రాముడు, ఏజీఎం (ఐఈడీ) చంద్రశేఖర్, వకీల్ పల్లి గని ఏజెంట్ నెహ్రూ, జీడీకే-7 ఎల్ఈపి గని మేనేజర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ వేణుకుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మొహమ్మద్, వివిధ విభాగాల అధికారులు, శిక్షణ పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ లో ప్రపంచ పులుల దినోత్సవం



**నిర్మల్ ప్రతినిధి,సారంగాపూర్ : జూలై 28 (నినాదం) :** ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సారంగాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జామ్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించనైనది. ఈ సందర్భంగా మహమ్మద్ నజీర్ ఖాన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, సారంగాపూర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పులుల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. భవిష్యత్ తరాలు ప్రకృతి, అడవులు వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వెన్నెల, సుజాత అటవీ శాఖ బీట్ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డబ్బా గ్రామంలో ఘనంగా వనమహోత్సవం



**చింతలమానేపల్లి, జూలై 28 (నినాదం ):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ సత్యనారాయణ మొక్కలు నాటి, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటిలో ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, "వన సంరక్షణ - మన సంరక్షణ" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని కాపాడాలని సూచించారు. ఇంటి ఆవరణ పచ్చదనంతో ఉంటే గ్రామమంతా పచ్చదనంతో కళకళలాడుతుందని, ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. "నా ఇల్లే నా గ్రామం -- నా గ్రామ మే నా ఇల్లు" అనే భావనతో గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోంగ్రి సంతోష్, ఉపసర్పంచ్ టాకిరే మౌనిక వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ,వార్డు సభ్యులు దుర్గం వెంకటేష్, అద్దాల శ్రీకాంత్, జుముడి సుఖదేవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లక్ష్యం.. చేరాల్సిందే

బొగ్గు ఉత్పత్తిపై వర్షాల ప్రభావం లేకుండా చర్యలు

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు



**మంచిర్యాల, జూలై 28 (నినాదం):** ఈ ఏడాది సంస్థ నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు పనులను పరిశీలించారు. ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులతో కలిసి ఉత్పత్తి, డిస్పాచ్ వివరాలను సమీక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాన్ని నూటికి నూరు శాతం సాధించేలా కృషి చేయాలని సూచించారు. వర్షాల కారణంగా ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, యాక్టింగ్ మేనేజర్ మధుసూదన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగారాజు, డీవైఎస్ఎస్‌వో సంపత్, రక్షణ అధికారి శ్రీధర్‌రావు, ఏరియా ఇంజనీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలానికి ముందస్తు చర్యలు..

పదో వార్డులో డ్రైనేజీల సిల్టేషన్ వేగవంతం



**సుల్తానాబాద్, జూలై 28 (నినాదం):** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సుల్తానాబాద్ మున్సిపాలిటీ ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ప్రభుత్వవిప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారా వు ఆదేశాల మేరకు పదో వార్డులో డ్రైనేజీల సిల్టే షన్ పను లను మంగళవారం జేసీబీ సహాయంతో చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధా కృష్ణ, వైస్ చైర్‌పర్సన్, పదో వార్డు కౌన్సిలర్ అంత టి పుష్ప లత, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో డ్రై నేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి నీటి పారుదల సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయకుండా పరిశుభ్రత పాటించాలని, తడి చెత్త--పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని అధికా రులు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అ ధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పా ల్గొన్నారు.

# కేసీఆర్ పార్క్‌ను వెంటనే తెరవాలి

చెన్నూరులో బీఆర్ఎస్ నేతల ధర్నా




**చెన్నూర్, జూలై 28 (నినాదం):** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని కేసీఆర్ పార్క్‌ను వెంటనే తెరిచి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ భరత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని పార్కు ప్రధాన ద్వారం వద్ద గుమిగూడిన నేతలు, కార్యకర్తలు మున్సిపల్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆహ్లాదం, ఆరోగ్యం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కేసీఆర్ పార్క్‌ను ప్రస్తుత పాలకులు మూసివేయడం దుర్మార్గమన్నారు. పార్కు మూసివేత కారణంగా స్థానిక కాలనీల ప్రజలు, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచే వాకర్స్, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులో పిచ్చిమొక్కలు మొలిచి, సరైన నిర్వహణ లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని మండిపడ్డారు. తక్షణమే పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, అవసరమైన అన్ని వసతులు కల్పించి ప్రజా వినియోగానికి సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించారు. అధికారులు స్పందించి వారం రోజుల్లోగా పార్కును తెరవకపోతే, ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వాకర్స్ మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంథని లోనే కొనసాగించాలి



**మంథని జూలై 28 (నినాదం) :** వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంథని లోనే కొనసాగించాలని కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మంథని రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ మంథని లో నిర్వహించబడుతున్న వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంథని మండలం సూరయ్య పల్లి గ్రామంలోని రైతు వేదికలోకి మార్చడం సరికాదని అన్నారు. ఇప్పటికే మంథని లో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రానికి తర లించాలరని ఇప్పుడు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని శిథిలావస్థలో ఉన్నదని కారణంతో పక్క గ్రామానికి తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ము అని అన్నారు. రైతులు పనుల నిమిత్తం 3 కిలోమీటర్లు వెళ్ళాల్సిన పరిస్థితి ఉన్నదని మండలంలోని అనేక గ్రామాలనుండి వచ్చే రైతులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయి అని ఆవేదన వ్యక్తం చేసారు. మండల కేంద్రాన్ని విస్మరించి పక్క గ్రామానికి తరలించడం ఎంతవ రకు సమజసం అని ప్రశ్నించారు. మండలంలోని 35 గ్రామాల నుండి ఆఫీస్ అడ్రస్ తెలియక గందర గోలానికి గురి అవుతున్నారని అన్నారు. =ఇూ కార్యాలయం తో పాటు వివిధ శాఖల కార్యాలయాన్ని అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి అని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పక్క గ్రామానికి తరలించడం ఏమిటి అని రైతులు అంటే అంత చిన్న చూపు ఎందుకు అని మండి పడ్డారు. రైతుల సంక్షేమాన్ని, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఐట ెపరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టి సారించి తరలించిన కార్యాలయాన్ని మంథనిలో పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖా కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి ఏల్పుల సురేష్, వ్యవసాయ శాఖా కార్మిక సంఘం జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు బావు రవి, నాయకులు మంథని కిష్టస్వామి ఉప్పు రమేష్, ఇరుగురాల ప్రసాద్ పాల్గొన్నారు.

# గిరిజనుల భూముల జోలికి వస్తే ఊరుకోం

ఎమ్మెల్సీ దండే విఠల్





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 28 (నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, పెంచికలపేట మండలం పోతేపల్లి గ్రామ శివారులో పోడు సాగు చేస్తున్న గిరిజన రైతులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నార న్న సమాచారం మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిం చారు. ట్రాక్టర్‌పై వెళ్లి రైతులతో మాట్లాడిన ఆయన అనంతరం అటవీ, రెవెన్యూ అధికారులతో చర్చించారు. తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనుల హక్కులకు భంగం కలిగించే చర్యలు చేపట్టవద్దని అధికారులను హెచ్చరించారు. పోడు భూముల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, రైతులను బెదిరించడం లేదా సాగును అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, గిరిజనుల హక్కులను కాపాడటం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. గిరిజనుల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని, వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఏ స్థాయిలోనైనా పోరాడతామని తెలిపారు. పోడు రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ జోక్యంతో అధికారులు సానుకూలంగా స్పందించి, రైతులు తమ పోడు భూముల్లో సాగు కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో గిరిజన రైతులు ఎమ్మెల్సీ దండే విఠల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

# టీన్‌పట్టి గ్యాంగ్‌కు పోలీసుల చెక్..

చిన్నబొంకూర్‌లో పేకాట గుట్టురట్టు

నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు సీజ్..

ఐదుగురు కటకటాలకు

సీఐ రంజిత్ కుమార్, ఎస్సై చంద్రకుమార్




**సుల్తానాబాద్, జూలై 28 (నినాదం):** సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ గ్రామ శి వారులో రైల్వే ట్రాక్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో టీన్‌పట్టి పేరుతో పేకాట నిర్వహిస్తున్న ఐదుగు రిని సుల్తానాబాద్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహిం చగా, మున్సిపల్ పరిధిలోని పూసల గ్రామానికి చెందిన నిమ్మల అనిల్, చొప్పరి రాకేష్,చొప్పరి రాజు,కొమ్ము శ్రీకాంత్,పూసల సాంబమూర్తి నగదుతో జూదం ఆడుతపట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి రూ. 25,020 నగదు, 5 2 పేకముక్కలు, 5 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకు న్నారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సుల్తానాబాద్ సీఐ రంజిత్‌రావు తెలి పారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్‌రావు మా ట్లా డుతూ, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల కు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామ ని, ఇలాంటి ఘటనలపై ప్రజలు వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# కారుణ్యానికి కాసుల నీడ..?

విరిగిన కాలుకూ 'ఫిట్' ముద్ర..!

మెడికల్ బోర్డు ముందే మానవత్వం ఓడిందా..?



వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో ఒక కాలును కోల్పోయాడు. మరో కాలుతో కూడా సరిగా

**మంచిర్యాల, జూలై 28 (నినాదం):** సింగరేణిలో కారుణ్య నియామకాల కోసం నిర్వహించే మెడికల్ బోర్డు ప్రక్రియపై మళ్లీ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనారోగ్యంతో విధులు నిర్వర్తించలేని ఉద్యోగులను మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఉద్యోగ విరమణ చేయించి, వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కల్పించే విధానం కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశంతో 2017 సంవత్సరం లో అమల్లోకి వచ్చింది. అయితే ఇదే ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గతంలో ప్రతి నెలా రెండు నుంచి మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి అర్హులైన ఉద్యోగులను మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించేవారు. దీంతో వేలాది కుటుంబాలకు ఉపాధి లభించింది. అయితే ఇటీవల ఈ ప్రక్రియ చుట్టూ దళారుల ముఠాలు చురుగ్గా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు ఇస్తే 100 శాతం అన్‌ఫిట్ చేయిస్తాం అంటూ అమాయక కార్మికులను మోసం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు ఈ పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కాలు కోల్పోయినా... ఫిట్ అని తేల్చారా...**

మందమర్రికి చెందిన సింగరేణి కార్మికుడు నడవలేని పరిస్థితిలో ఉంది. దీంతోపాటు ఆయనకు ఫిట్స్, వినికిడి లోపం వంటి పలు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డు అతడిని "ఫిట్"గా ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా బాధితుడు, కార్మికుల్లో తీవ్ర ఆశ్చర్యాన్ని కలిగించింది. నిజంగా విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న ఉద్యోగిని ఫిట్‌గా ఎలా నిర్ధారించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**విచారణ జరపాలనే డిమాండ్**

కార్మికుల జీవితాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా సింగరేణి యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియలో పారదర్శకత పెంచడంతో పాటు దళారుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

## పారదర్శకతే నమ్మకానికి పునాది..

శ్రీధర్, బి.ఎం.ఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు...



సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన బోర్డులో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నిజంగా శారీరక ఇబ్బందులు ఉన్న ఉద్యోగులను కూడా ఫిట్‌గా ప్రకటించడం బాధాకరమని అన్నారు. మెడికల్ బోర్డుపై కార్మికులకు నమ్మకం కల్పించేలా ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించాలని, అవసరమైతే ఫిర్యాదులపై స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని ఆయన కోరారు.

# "హెచ్&టీ గోదాముల్లో రూ. 700 కోట్ల స్కాం..

ధాన్యం కొనుగోళ్లలో భారీ అవినీతి

ప్రతి లారీపై రూ.18 వేల అక్రమ వసూళ్లు

ఆధారాలతో కేంద్రానికి ఫిర్యాదు చేస్తాం

రైతుల కోసం చివరి వరకు పోరాటం

బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టి ముక్కుల సురేష్ రెడ్డి



**సుల్తానాబాద్, జూలై 28 (నినాదం):** పెద్దపల్లి నియోజకవర్గంలో హెచ్‌డటీ గోదాముల ద్వారా కేవలం ఒకే ఏడా దిలో కరీఫ్, రబీ సీజన్ల ధాన్యం కొనుగోళ్లలో సుమారు రూ. 700 కోట్ల భారీ కుంభకోణం జరిగిం దని బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఈడీ (జుణ), సీబీఐ (జదీ×), విజిలెన్స్, కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి భారతీయ జనతా పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ప్రతి 290క్వింటాళ్లలోడ్‌కురూ. 18 వేల చొప్పున అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో రైస్ మిల్లర్లు, గోదాం నిర్వాహకులు, కొందరు అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఎఫ్‌సీఐ అన్ని ఖర్చులు భరిస్తున్నప్పటికీ రైతులపై అదనపు భారం ఎందుకు మోపుతున్నారని ప్రశ్నించిన ఆయన, ఒక్కోలారీపై రైతు రూ. 18 వేల వరకు నష్టపోతున్నాఅధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీఎంఆర్ ధాన్యాన్ని గోదాముల్లో స్వీకరించకుండా నిర్లక్ష్యంచేస్తున్న నిర్వాహకులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేద ని నిలదీశారు. కొనుగోలు కేంద్రం నుంచి గోదాం వరకు, వడ్ల గింజ బియ్యంగా మారే ప్రతి దశలో అవినీతి, అక్ర మాలు, దోపిడీ జరుగుతు న్నాయని ఆరోపించారు. ఎఫ్‌సీఐ నిధులను దుర్వినియోగం చేసి వందల కోట్ల రూపాయలు దోచుకున్న వారిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను కేంద్ర ప్రభుత్వం, ఈడీ, సీబీఐలకు అందజేస్తానని, రైతులకు న్యాయం జరిగే వరకు ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా పోరాటం కొనసాగిస్తానని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్, కాసాగోని నిర్మల, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు రఫీక్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అరుణ్ రంజా, కొల్లూరి సంతోష్, బండారి లత, మెండే శంకరయ్య, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మల్యాభాగ్యలక్ష్మి, ఉషణ అన్వేష్, పెరకరమేష్, ఏనుగు రాజిరెడ్డి, మారం రమేష్, దాసరి వెంకటేష్, నల్లవెల్లి శంకర్, వడ్లకొండ శశివర్ధన్, శాలి గంటి కొమురయ్య, దాసరి చందు, వీరగోని కిరణ్, కొత్తూరు సంపత్, సుబ్బని సురేష్, రమేష్ గౌడ్, శేఖర్ మాస్టర్, ఈర్ల ప్రశాంత్,వెంకటేష్, కరెంగుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**






**నిర్మల్ ప్రతినిధి, జూలై 28 (నినాదం):** వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు లాభదాయకంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని జిల్లాల మండల కేంద్రాల్లోని రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు. 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయి వ్యవసాయ సాంకేతికత, శాస్త్రీయ సూచనలను రైతులకు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంట మార్పిడి ద్వారా విజయాలు సాధించిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు. సోన్ మండల రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు 'రైతు నేస్తం' కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ సంతోష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

**కలెక్టర్ హరిత**





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 28 (నినాదం) :** ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచి వాటిని మరింత బలోపేతం చేసేలా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. మంగళవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, సిర్పూర్-టి మండలం పారిగాం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, విద్యార్థుల హాజరు, ఇంకుడు గుంత, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు ప్రతి విద్యార్థికి అందేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల ని, పాఠశాలల్లో 100 శాతం విద్యార్థుల నమోదు లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. ఆరవ, ఏడో తరగతి విద్యార్థుల గణితం, సైన్స్ అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరా లను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు మెరుగైన విద్య అందించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, సిబ్బంది హాజరు, ఓపీ, ల్యాబ్, రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిశుభ్రత, వైద్య సిబ్బంది సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన, ఎస్సీ ఎస్టీ ల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**అచ్చంపేటలో రూ.12.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**చెంచు గిరిజనుల కోసం రూ.1.80 కోట్ల షాపింగ్ కాంప్లెక్స్**

**గురుకులాల ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**అచ్చంపేట, జూలై 27 (నినాదం):** గిరిజనులు, ఆదివాసీలు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరులో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి విద్య, వసతి, ఆహార నాణ్యత, మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం అమ్రాబాద్, పదర మండలాల్లో ఆర్టికల్-273(1) గ్రాంట్, పీఎం డీఏ-జీజీయూఏ పథకాల కింద రూ.12.70 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో అదనపు తరగతి గదులు, డార్మిటరీలు, కిచెన్ కమ్ డైనింగ్ హాల్స్, ప్రహరీ గోడలు, టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెంచు గిరిజనుల స్వయం ఉపాధికి రూ.1.80 కోట్లతో ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అటవీ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడం ద్వారా మధ్యవర్తుల దోపిడీ తగ్గి గిరిజన కుటుంబాలకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు. గురుకులాల్లో ఉపాధ్యాయుల ఖాళీలను త్వరితగతిన భర్తీ చేస్తామని, నల్లమల ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, మెరుగైన ఆహారం, వసతి, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నల్లమల ప్రాంతంలో విద్య, మౌలిక వసతులు, గిరిజన సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని, ప్రతి గిరిజన తండాకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. అనంతరం మంత్రి మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీఈఓ రమేష్ కుమార్, ఆర్డీవో యాదగిరి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గురుకులాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల సరఫరాకు పాల్పడే వారి పై పీడియాక్ట్

**గంజాయి డ్రగ్స్ సరఫరా పై ప్రత్యేక నిఘా**

**యువత మత్తు బారినపడి భవిష్యత్తు వృధా చేసుకోవద్దు**

**గోదావరిఖని ఏసిపి మడత రమేష్**



**మంథని జూలై 28 (నినాదం) :** మాదకద్రవ్యాల సరఫరాకు పాల్పడే వారి పై పీడియాక్ట్ ప్రయోగిస్తామని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ తెలిపారు. యువత మత్తు ఇంజక్షన్ల బారిన పడుతున్నారని తీవ్ర ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. యువత మత్తు బారిన పడి బంగారాన్ని భవిష్యత్తును వృధా చేసుకోవద్దనీ పేర్కొన్నారు. తెలంగాణను డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మంథని డివిజన్‌లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంథని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం సీపీ ఆదేశాల మేరకు మంథని డివిజన్‌లో గంజాయి, డ్రగ్స్ సరఫరాపై నిరంతర నిఘా ఉంచామని, గంజాయి కొరత కారణంగా కొంతమంది యువకులు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా లభించే కొన్ని మత్తు మాత్రలను ద్రవ రూపంలోకి మార్చి, ఇంజెక్షన్ల ద్వారా తీసుకుంటున్నట్లు గుర్తించామని, ఈ కేసులో నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గంజాయికి ప్రత్యామ్నాయంగా మత్తు మాత్రలను ఇంజెక్షన్లుగా వాడటం ప్రాణాంతకమని ఏసీపీ హెచ్చరించారు. మంథని ప్రాంతంలోని మెడికల్ షాపుల యజమానులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, చెల్లుబాటు అయ్యే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలు అమ్మకూడదని ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వ్యాపారం చేసే పెడ్లర్లు, సరఫరాదారుల విషయంలో ఎలాంటి సహనం వహించబోమని ఏసీపీ తేల్చిచెప్పారు. ఎన్‌డీపీఎస్ చట్టంతో పాటు పీడీ యాక్ట్ కింద జైలుకు పంపుతామని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

NINADAM CINEMA

# హారర్ థ్రిల్లర్ '418' విడుదల వాయిదా




మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం లో రూపొందు తున్న హారర్ థ్రిల్లర్ '418' కోసం ఎదురు చూస్తున్న సినీ అభిమానులకు స్వల్ప నిరాశ ఎదురైంది. జూలై 31న ప్రపంచవ్యా ప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయి దా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన మైత్రీ మూవీ మేకర్స్, సినిమా విడుదలను వాయిదా వేస్తున్నామని తెలిపింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను మాత్రం వెల్లడిం చలేదు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని అభిమానులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం చిత్రబృందం విడుదల వాయిదాకు సంబం ధించి ఎలాంటి అధికారిక కారణం చెప్పలేదు. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, విజువల్ ఎఫెక్ట్స్, సాంకేతిక అంశాలు లేదా విడుదల ప్రణాళికలో మార్పుల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారా అనే చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. '418' ఒక ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార సామగ్రి సినిమాపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా సస్పెన్స్, భయానక అంశాలతో కథను తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగు తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. ఆమెతో పాటు చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రా నికి మరో ప్రధాన ఆకర్షణ దర్శకుడు ప్రశాంత్ నీల్ మద్దతు. ఆయన ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉండటం వల్ల 418 పై ప్రారంభం నుంచే మంచి బజ్ ఏర్పడింది. ఆయన పేరు జత కావడంతో సినిమా స్థాయిపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందిస్తున్నారు. హారర్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవిస్తూ దర్శకుడు సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విడుదల వాయిదా పడినప్పటికీ, సినిమా విడుదలపై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది.

# డిఫరెంట్ లవ్ స్టోరీ.. చెన్నై లవ్ స్టోరీపై నాగచైతన్య



తనకు ప్రేమకథలంటే ఇష్టమన్నారు నటుడు నాగ చైతన్య. కొవిడ్ తర్వాత లవ్‌స్టోరీలు తెరకెక్కట్లేదని తాను బాధపడినట్లు చెప్పారు. కిరణ్ అబ్బవరం హీరోగా వచ్చిన తాజా చిత్రం 'చెన్నైలవ్ స్టోరీ'. ఈ సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకోవడంతో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొవిడ్ తర్వాత ప్రేమకథలు రావట్లేదని భయపడ్డా. ప్రేక్షకులు థియేటర్‌ల కు వెళ్తారా.. ప్రేమకథలు చూస్తారా? అని అనుకు న్నాను. ఇప్పుడు మళ్లీ ఆ ట్రెండ్ ప్రారంభమైంది. 'చెన్నై లవ్‌స్టోరీ'తో మంచి ప్రేమకథను అందిం చారు. ఇప్పటి వరకూ ఇద్దరు ప్రేమించుకోవడం పెళ్లి చేసుకోవడం ఇలాంటి కథలే చూశాం. కానీ, బ్రేకప్ ప్రేమకథ ఎలా ఉంటుందనేది ఇందులో చూపించారు. ఇప్పటి తరానికి బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది. ఇలాంటి స్టోరీలు రావాలని ఎంతో ఎదురుచూశా. ఈ చిత్రం చూసిన తర్వాత చాలా ఆనందించా' అని నాగచైతన్య అన్నారు. సాయి రాజేశ్ ఈ కథను చాలా గొప్పగా రాశారని ప్రశంసిం చారు. కిరణ్ అబ్బవరం ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారని నాగచైతన్య అన్నారు. 'క' సినిమా ఈవెంట్‌లో కిరణ్ స్పీచ్ విని తాను ఎంతో బాధపడినట్లు చెప్పారు. సినిమా కోసం కిరణ్ ఎంతో కష్టపడతాడని తెలిపారు. శ్రీ గౌరీ ప్రియ కెరీర్‌లో ఈ సినిమా ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. ఈ చిత్రబృందమంతా ఎంతో కష్టపడి వర్క్ చేసిందని.. కొత్త వాళ్లను ప్రోత్సహించడంలో నిర్మాత ఎస్‌కేఎన్, దర్శకుడు సాయి రాజేశ్ ఎప్పుడు ముందుంటారని తెలిపారు. ఒక సినిమా పోస్టర్ మీద కలెక్షన్‌లు వేయడం కంటే ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకోవడం నిజమైన విజయమని నాగచైతన్య అన్నారు.


# ట్రోల్స్‌ను అస్సలు పట్టించుకోవద్దు

**అభిమానులకు అల్లు అర్జున్ సూచన**



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ శౌర్య భవన్‌లో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అర్జున్, సోషల్ మీడియాలో నిత్యం ఎదురయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై తీవ్రంగా స్పందించారు. నెట్టింట జరిగే దుష్ప్రచారాలను, అనవసర వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని, వాటికి ఎలాంటి స్పందన ఇవ్వకుండా సంయమనం పాటించాలని తన అభిమానులకు ఆయన హితవు పలికారు.


# ప్యారడైజ్ స్పెషల్ సాంగ్ కోసం కీర్తి సురేశ్?



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'నేను లోకల్' మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి. ఒకవేళ కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్‌లో కనిపి స్తే, అనిరుధ్ మాస్ బీట్‌కు ఆమె డ్యాన్స్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# రిజర్వేషన్లపై తన పేరుతో తప్పుడు ప్రచారాలు

**వాటిని నమ్మవద్దని కోరిన నటి శిల్పాశెట్టి**



రిజర్వేషన్ల అంశంపై తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు పూర్తిగా అబద్ధమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నటి శిల్పా శెట్టి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తన పేరును ఉపయోగిస్తూ కొందరు కావాలని నిందలు వేస్తున్నారని, అది పూర్తిగా కల్పితమైన వార్త అని స్పష్టం చేశారు. నా పేరును ఉపయోగిస్తూ రిజర్వేషన్లపై వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనలు చూసి తీవ్ర షాక్‌కు గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దుర్బుద్ధితో కూడిన చెత్త ప్రచారం. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను ఎవరూ నమ్మకండి అంటూ శిల్పా రాసుకొచ్చింది. రిజర్వేషన్ వ్యవస్థను ఉద్దేశించి వైద్యులు, కులాల ఆధారంగా రోగులకు చికిత్స చేయాలంటూ శిల్పా శెట్టి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టినట్లుగా ఒక స్క్రీన్‌షాట్ నెట్టింట తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ వివాదం ముదరక ముందే శిల్పా స్పందించి ఆ వార్తలకు తెరదించింది. ఇక సినిమాల విషయాని కొస్తే, శిల్పా శెట్టి ఇటీవల ధ్రువ సర్జా, సంజయ్ దత్, రవిచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'కేడీ: ది డెవిల్' అనే కన్నడ చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'మా హై నా' అనే ప్రముఖ రియాలిటీ కుకింగ్ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787